# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

08.01.2026 గురువారం Thursday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 185 | పేజీలు : 8 Pages : 8 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana









## గిరిజన సంక్షేమానికి సర్కారు కృషి

- ఎప్పుడూ లేనంతగా నిధుల కేటయింపు
- రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన సీతక్క

2



## బొమ్మ రవికి కోర్టులో చుక్కెదురు

- ఐదు కేసుల్లో బెయిల్‌ను తిరస్కరించిన నాంపల్లి కోర్టు

2



## 50 కోట్ల జీఎస్టీ ఎగవేత

- ఆరెంజ్ డైరెక్టర్ సునీల్ కుమార్ అరెస్ట్
- ట్రిలియన్ లీడ్ ఫ్యాక్టరీ ఎండీ చేతన్ కూడా అరెస్ట్

2

## మున్సిపల్ ఎన్నికలపై ఈసీ కసరత్తు

**ఈ నెల 16 నాటికి ఓటర్ల తుది జాబితా**

- 13వ తేదీ నాటికి పోలింగ్ స్టేషన్ల వివరాల ముసాయిదా

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ఈ నెల 20వ తేదీలోగా నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. అందుకు తగ్గట్టుగా ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కసరత్తు మొదలు పెట్టాయి. ఇందులో భాగంగా మున్సిపల్ ఎన్నికలపై ఉన్నతాధికా రులతో ఎస్ఈసీ రాణికుముదిని బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

- 2019 నాటి ఓటరు జాబితానే తీసుకోవాలని ఆదేశం
- కలెక్టర్లతో స్టేట్ ఎలక్షన్ కమిషన్ వీడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్ :** ఓటర్ల జాబితా సవరణ గడువును రాష్ట్ర ఎన్నికల సం ఘం పొడిగించింది. ఈ నెల 13 నాటి కి పోలింగ్‌స్టేషన్ల వివరాల ముసాయిదా ప్రచురించాలని ఎస్ఈసీ ఆదేశించారు. ఈ నెల 16 నాటికి ఓటర్ల తుది జాబితా ప్రచురించాలని స్పష్టం చేశారు. బ్యాలెట్ బాక్సులు, సిబ్బంది నియామకంపై చర్చించారు. ఇప్పటికే జిల్లా, మండల స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించిన ఈసీ.. గురువారం రాజకీయ పార్టీల రాష్ట్ర స్థాయి ప్రతినిధులతో సమావేశం కానుంది. తెలంగాణలో గడువు ముగిసిన 117 మున్సిపాల్టీ పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే.

మిగతా 2 లో








## జైలులో మత్తు పదార్థాల సరఫరా

- నిజామాబాద్ జైలర్ ఉపేందర్ సస్పెన్షన్
- మరో జైలర్ ఆదిలాబాద్‌కు బదిలీ

2



## నిన్న ప్రియురాలు.. నేడు ప్రియుడు

- విషాదాంతం అయిన ప్రేమజంట జీవితం
- ఉరేసుకుని ప్రేమికురాలు బలవన్మరణం
- తట్టుకోలేక ప్రియుడు కూడా ఆత్మహత్య
- ఇరు కుటుంబాల్లో పెను విషాదం

ప్రియురాలి మరణాన్ని తట్టుకోలేక ప్రియుడు పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రాహ్మణపల్లెలో చోటుచేసుకుంది.

2



తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్త పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులు.. సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డికి నోటీసులు జారీ చేసింది.. నేడు గురువారం ఉదయం 11 గంటలకు విచారణకు రావాలని ఆదేశించింది.

## ఫోన్ ట్యాపింగ్ కేసు సీఎం సోదరుడికి సిట్ నోటీసులు

- ఉదయం 11 గంటలకు రావాలని ఆదేశాలు
- ఆయనతో పాటు ఇద్దరు బీఆర్ఎస్ నేతలు కూడా..

2

## 13 నుంచి హైదరాబాద్‌లో కైట్ ఫెస్టివల్

- 17 వరకు అన్ని చెరువుల వద్ద ఉత్సవాలు
- మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి

2



## కేసీఆర్ అప్పులు చేసింది నిజమే..

- ఆ అప్పులు తెలంగాణ అభివృద్ధి కోసమే
- సీఎం రేవంత్ ఫ్రస్టేషన్‌లో ఉన్నాడు
- బీఆర్ఎస్ నేత కేటీఆర్

3



03

తెలంగాణకు కేసీఆర్ అద్భుతమైన ప్రాజెక్టులు తీసుకొచ్చారని కేటీఆర్ గుర్తు చేశారు. కేసీఆర్ అప్పు చేసిన మాట వాస్తవమేనని స్పష్టం చేశారు. అయితే చేసిన అప్పు రాష్ట్రాభివృద్ధి కోసం వినియోగించారని వివరించారు. ఇందులో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదన్నారు. ఇకపోతే సీఎం రేవంత్ రెడ్డి తీవ్రమైన ఫ్రస్టేషన్‌లో ఉన్నారని కేటీఆర్ అన్నారు. ఆయనలో అంత ఫ్రస్టేషన్ ఎందుకో తనకు అర్థం కావడం లేదని తెలిపారు.

## కేంద్ర బడ్జెట్‌పై సందిగ్ధం



- ఫిబ్రవరి 1న ఆదివారం కావడంతో కొంత చర్చ
- త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జనవరి 31 నుంచి ప్రారంభం కానున్నాయి. అలాగే బడ్జెట్ ప్రతిపాదనలను ఫిబ్రవరి1న ప్రవేశపెడతారు. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం రావడంతో అదే రోజు ప్రవేశపెడతారా? అనే చర్చ జరుగుతోంది.

4

## ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉచిత సలహాలు

**అవేవీ పట్టించుకోకుండా భారత్ భద్రతపై దృష్టి**

**విదేశాంగమంత్రి జైశంకర్ వ్యాఖ్య**

పాకిస్థాన్ ఉగ్ర దాడులకు ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో పశ్చిమ దేశాలు కపటత్వం ప్రదర్శించడంపై విదేశాంగ మంత్రి జై శంకర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమకు వేల మైళ్ల దూరంలో ఉన్న ఆ దేశాలు ఉద్రిక్తతల సమయంలో ఆందోళన చెందినట్లు చెప్పాయని.. కానీ అవేవీ తమ సొంత ప్రాంతంలో జరుగుతున్న వాటిని పట్టించుకోవడం లేదని విమర్శించారు.

4




## కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

**ముగ్గురు ఉగ్రవాదుల హతం**

జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లాలో ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు చుట్టుముట్టినట్టు తెలుస్తోంది. ఈ ప్రాంతంలో ఇద్దరు ముగ్గురు ఉగ్రవాదులు సంచరిస్తున్నట్టు సమాచారం అందడంతో గాలింపు చర్యలు జరుపుతున్నట్టు అధికారులు తెలిపారు.

వివరాలు 2వ పేజీలో






# జైలులో మత్తు పదార్థాల సరఫరా

**నిజామాబాద్ జైలర్ ఉపేందర్ సస్పెన్షన్**

**నిజామాబాద్, జనవరి 7:** జిల్లా జైలులో గంజాయి దొరికిన ఘటనపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. జైలులో డ్రగ్స్‌తో పాటు ఇతర మత్తు పదార్థాలు సరఫరా అవుతుందన్న ఆరోపణలపై జైళ్ల శాఖ డీఐజీ, ఐజీ పూర్తి స్థాయిలో విచారణ జరిపారు. ఈ విచారణ నివేదిక ఆధారంగా జైలర్ ఉపేందర్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. మరో జైలర్ సాయి సురేశ్‌ను ఆదిలాబాద్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే సూపరింటెండెంట్ దశరథాన్ని నెల రోజులు సెలవులపై వెళ్లాలని ఆదేశించారు.ఇక వరంగల్ జైలర్‌గా పనిచేస్తున్న పూర్ణచందర్‌కు నిజామాబాద్ జైలర్‌గా అదనపు బాధ్యతలు ఇచ్చినట్లు తెలుస్తోంది. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆనంద్‌రావుకు ఇంచార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించారు. జైలు అధికారులతో కలిసి పనిచేసినట్లు తేలిన ఖైదీలను ఇతర జైళ్లకు మార్చారు.

# సీఎం సోదరుడికి సిట్ నోటీసులు

**హైదరాబాద్, జనవరి 7 :** తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్త పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి.. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) అధికారులు.. సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డికి నోటీసులు జారీ చేసింది.. నేడు(గురువారం) ఉదయం 11 గంటలకు విచారణకు రావాలని ఆ నోటీసులో అధికారులు పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి విపక్ష నాయకుడిగా ఉన్న రోజుల్లో కొండల్ రెడ్డి ఫోన్‌ను ట్యాప్ చేశారని దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలో ఆయన వాంగ్మూలం తీసుకోవడం కోసం విచారణకు పిలుస్తున్నారు. ఇదే కేసులో మరో ఇద్దరు బీఆర్ఎస్ నేతలకూ నోటీసులు వెళ్లాయి. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, చిరుమర్తి లింగయ్యలను కూడా నేడు ఉదయం 11 గంటలకు హాజరు కావాలని పోలీసులు ఆదేశించారు. ఇప్పటికే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావు తండ్రి కొండలరావు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుమారుడు సందీప్ రావులకు కూడా ఇలాంటి నోటీసులు జారీ అయ్యాయి.

# బొమ్మ రవికి కోర్టులో చుక్కెదురు

**ఐదు కేసుల్లో బెయిల్‌ను తిరస్కరించిన నాంపల్లి కోర్టు**

**హైదరాబాద్, జనవరి 7:** పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' నిర్వాహకుడు ఇమంది రవికి నాంపల్లి కోర్టులో చుక్కెదురైంది. అతడి బెయిల్ పిటిషన్లను న్యాయస్థానం కొట్టివేసింది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఐదు కేసుల్లో బెయిల్ ఇవ్వాలని రవి కోర్టును ఆశ్రయించాడు. కేసు ప్రస్తుతం దర్యాప్తు దశలో ఉందని పోలీసులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అతడికి విదేశాల్లో పౌరసత్వం ఉందని.. బెయిల్ ఇస్తే దేశం దాటి వెళ్లిపోయే అవకాశం ఉందని తెలిపారు. విచారణ జరిపిన న్యాయస్థానం రవి బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఐదు కేసుల్లో బెయిల్ ఇవ్వాలని ఐ బొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవి ఇటీవల నాంపల్లి కోర్టును ఆశ్రయించాడు. ఈ బెయిల్ పిటిషన్లపై బుధవారం నాడు నాంపల్లి కోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా తాను హైదరాబాద్ వదిలి వెళ్లనని.. పోలీసు విచారణకు సహకరిస్తానని రవి కోర్టుకు తెలిపారు. ఇకపై పైరసీ చేయనని మొర పెట్టుకున్నాడు. మరోవైపు కేసు దర్యాప్తు దశలో ఉన్నదని పోలీసులు కోర్టుకు తెలిపారు. అలాగే ఇమ్మడి రవికిరవికి పలు దేశాల్లో పౌరసత్వం ఉందని.. బెయిల్ ఇస్తే విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని పోలీసులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం ఐబొమ్మ రవి అభ్యర్థనను తోసిపుచ్చింది. ఐదు కేసుల్లోనూ బెయిల్ ఇచ్చేందుకు తిరస్కరించింది. ఆ బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది.

# 50 కోట్ల జీఎస్టీ ఎగవేత

**ఆరెంజ్ డైరెక్టర్ సునీల్ కుమార్ అరెస్ట్**

**ట్రిలియన్ లీడ్ ఫ్యాక్టరీ ఎండీ చేతన్ కూడా అరెస్ట్**

**హైదరాబాద్, జనవరి 7:** జీఎస్టీ పన్ను ఎగవేత కేసులపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ హైదరాబాద్ జోనల్ యూనిట్ దాడులను మరింత ముమ్మరం చేసింది. డేటా అనలిటిక్స్, అంతర-ఏజెన్సీ సమన్వయంతో సేకరించిన ప్రత్యేక సమాచారంతో, భారీ స్థాయిలో జరుగుతున్న అంతర్రాష్ట్ర పన్ను మోసాల వెనుక ఉన్న కీలక వ్యక్తులపై చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో జీఎస్టీ చట్ట ఉల్లంఘనలకు పాల్పడ్డ ఇద్దరు ప్రముఖ కంపెనీల మేనేజింగ్ డైరెక్టర్లను డీజీజీఐ అధికారులు అరెస్టు చేశారు. జనవరి 6న జరిగిన ఈ అరెస్టులు పన్ను మోసాల తీవ్రతను మరింత స్పష్టంగా చూపిస్తున్నాయి. మెసర్స్ ఆరెంజ్ ప్యాసింజర్ ట్రాన్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ప్రయాణికుల నుంచి వసూలు చేసిన రూ.28.24 కోట్ల జీఎస్టీని గడువు ముగిసిన మూడు నెలలు గడిచినా ప్రభుత్వ ఖజానాకు జమ చేయకుండా అక్రమంగా దాచుకున్నట్టు దర్యాప్తులో వెల్లడైంది. అదే విధంగా, మెసర్స్ ట్రిలియన్ లీడ్ ఫ్యాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ చేతన్ ఎన్ రూ.22 కోట్ల మేర నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ మోసానికి సూత్రధారిగా వ్యవహరించినట్టు డీజీజీఐ గుర్తించింది. ఈ ఇద్దరిపై సీజీఎస్టీ చట్టం నిబంధనల కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్టు అధికారులు తెలిపారు. సంఘటితంగా జరుగుతున్న పన్ను మోసాలపై నిరంతర ఒత్తిడి కొనసాగించేందుకు ఈ చర్యలు తీసుకున్నామని డీజీజీఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ స్పష్టం చేసింది. పన్ను చెల్లింపుదారులు చట్టాన్ని గౌరవిస్తూ వ్యవహరించాలని, జీఎస్టీ ఎగవేతకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని డీజీజీఐ హెచ్చరించింది.

# కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

**శ్రీనగర్, జనవరి 7:** జమ్మూకశ్మీర్ లోని కథువా జిల్లాలో ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు చుట్టుముట్టినట్టు తెలుస్తోంది. ఈ ప్రాంతంలో ఇద్దరు ముగ్గురు ఉగ్రవాదులు సంచరిస్తున్నట్టు సమాచారం అందడంతో గాలింపు చర్యలు జరుపుతున్నట్టు అధికారులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 4 గంటల ప్రాంతంలో బిలావర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కమద్ నల్లా సమీపంలో ఒక టెర్రరిస్టును స్థానికులు గుర్తించారు. ధన్ను పరోల్ వద్ద కూడా ఉదయం అతన్ని చూసినట్టు అధికారులకు సమాచారం అందింది. దీంతో అదనపు బలగాలు ఆ ప్రాంతానికి చేరుకున్నాయి. ఎస్ఓజీతో పాటు సీఆర్‌పీఎఫ్ బలగాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టినట్టు జమ్మూ ఐజీపీ భీమ్ సేన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. ఏడాది భద్రతా బలగాలు చేపట్టిన తొలి కీలక ఆపరేషన్ ఇదేనని, జమ్మూ ఐజీ, కథువా ఎస్ఎస్‌పీ శర్మ సంయుక్తంగా ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్నారని భద్రతా బలగాలు తెలిపాయి. ప్రస్తుతం ఎదురెదురు కాల్పులు కొనసాగుతున్నాయి.

# మున్సిపల్ ఎన్నికలపై ఈసీ కసరత్తు

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై తెలంగాణ ఎన్నికల సంఘం కీలక సమావేశం ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో 2019 నాటి ఓటరు జాబితానే ప్రాతిపదికగా తీసుకోవాలని ఆదేశాలను జారీ చేసింది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై ఎన్నికల సంఘం అధికారులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులతో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ఇదే సమయంలో కలెక్టర్లతో స్టేట్ ఎలక్షన్ కమిషన్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల కోసం 2019 నాటి ఓటరు జాబితానే ప్రాతిపదికగా తీసుకోవాలని ఈసీ ఆదేశించింది. అలాగే, ఈనెల 16వ తేదీన ఓటరు తుది జాబితాను విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 13వ తేదీ నాటికి పోలింగ్ స్టేషన్ల వివరాల ముసాయిదా ప్రచురించాలి. టీపోల్ యాప్‌లో పోలింగ్ స్టేషన్ల వివరాలు అప్‌లోడ్ చేయాలని తెలిపింది.




ఇక, పోలింగ్ స్టేషన్లలో బీఎల్‌వోల ద్వారా ఓటరు వివరాలను పరిశీలన చేయాలని సూచించింది. అలాగే, ఆన్‌లైన్‌లో కూడా ఓటరు నమోదు, మార్పులకు అవకాశం ఇచ్చింది. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ బృందాల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నియమావళి కఠినంగా అమలు చేయాలని ఆదేశాల్లో పేర్కొంది.

# 13 నుంచి కైట్ ఫెస్టివల్




**17 వరకు అన్ని చెరువుల వద్ద ఉత్సవాలు**

**మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి**

**అధికారులతో కలిసి ఉత్సవాలపై సమీక్ష**

**హైదరాబాద్, జనవరి 7:** ఈ సంక్రాంతి పండుగను సంప్రదాయం, సంస్కృతి పరిరక్షణకు అనుగుణంగా ఘనంగా జరుపుతున్నామని తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రాష్ట్ర టూరిజాన్ని ప్రమోట్ చేయడానికి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జనవరి 13 నుంచి 17 వరకు 'కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్' పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఫెస్టివల్‌లో 19 దేశాల నుంచి 40 మంది అంతర్జాతీయ కైట్ ప్లేయర్స్, అదేవిధంగా మన దేశంలోని 15 రాష్ట్రాల కైట్ ప్లేయర్స్ పాల్గొంటున్నారని తెలిపారు. ఈ ఉత్సవంలో వివిధ రాష్ట్రాలకు చెందిన స్వీట్ స్టాల్‌లు కూడా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. జనవరి 16 నుంచి 18 వరకు హాట్ ఎయిర్ బెలూన్ షో కోసం ఏవియేషన్ అనుమతి ఇప్పటికే తీసుకున్నామన్నారు. ఈ బెలూన్ షో బుకింగ్ కోసం ఆన్‌లైన్ సౌకర్యం కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. గచ్చిబౌలి స్టేడియంలో పగలు గోల్ఫ్ కోర్స్, పరేడ్ గ్రౌండ్‌లో నైట్ డ్రోన్ షోలు కూడా ఉంటాయన్నారు. చెరువుల పరిరక్షణ లక్ష్యంగా నగరంలోని అన్ని చెరువుల వద్ద కైట్ ఫెస్టివల్ కార్యక్రమం జరుగుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే ఈ ఉత్సవంలో ఇండోనేషియా, ఆస్ట్రేలియా, కెనడా, శ్రీలంక, కంబోడియా, థాయిలాండ్, కొరియా, జపాన్, పోర్చుగల్, వియత్నాం, మలేషియా, ఇటలీ, స్విట్జర్లాండ్, అల్జీరియా, సింగపూర్, రష్యా, ఉక్రెయిన్ / ఫ్రాన్స్ వంటి 19 దేశాలకు చెందిన 40 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్, అలాగే భారతదేశంలోని 15 రాష్ట్రాల నుండి 55 మంది జాతీయ కైట్ ఫ్లయర్స్ పాల్గొంటారు. రాత్రివేళ ఆకాశంలో వెలుగులు విరజిమ్మే 'నైట్ ఫ్లయింగ్'కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణ కానుందని అన్నారు. తెలంగాణ స్థానిక సంస్కృతిని ప్రోత్సహించేలా రాష్ట్ర సాంప్రదాయ కళా రూపాలతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడతాయి. వేదిక వద్ద సుమారు 100 చేనేత, హస్తకళల స్టాల్స్, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల రుచులతో కూడిన 60 ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కల్చర్ లాంగ్వేజ్ ఇండియన్ కనెక్షన్స్ సహకారంతో జరిగే ఈ ఉత్సవంలో ఇతర రాష్ట్రాలు, దేశాల నుండి వచ్చి హైదరాబాద్‌లో స్థిరపడిన వారు తమ ఇళ్లలో తయారు చేసిన 1,200 కంటే ఎక్కువ రకాల మిఠాయిలను ప్రదర్శిస్తారని అన్నారు. హైదరాబాద్‌ను గ్లోబల్ మెడికల్ టూరిజం హబ్‌గా మార్చడానికి ప్రత్యేక సొసైటీ స్థాపన చేస్తున్నామని అన్నారు. పర్యాటకుల భద్రత కోసం 'టూరిస్ట్ పోలీస్' అందుబాటులోకి వస్తుందన్నారు. పర్యాటకం అంటే కేవలం సందర్శన కాదు, అది ఒక అనుభూతి. అది మనల్ని మూసధోరణుల నుంచి బయటపడేలా చేసి, మానసిక వికాసానికి, ఉత్సాహానికి దోహదపడుతుంది. వారసత్వ కట్టడాల పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ మా ప్రభుత్వ బాధ్యత. మన పర్యాటకానికి యువత, టెక్కీలు, మీడియా, సెలబ్రిటీలు మరియు ఇన్‌ఫ్లుయెన్సర్లు రాయబారులుగా మారి... 'తెలంగాణ జరూర్ ఆనా' అంటే తెలంగాణకు తప్పక రండి అనే ఆత్మీయ పిలుపును ప్రపంచానికి చాటాలని కోరుతున్నట్లు వెల్లడించారు. పర్యాటకంపై అధికారులతో మంత్రి సమీక్షించి వివరాలు వెల్లడించారు.

# గిరిజన సంక్షేమానికి కృషి

**ఎప్పుడూ లేనంతగా నిధుల కేటాయింపు**

**రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన సీతక్క**

**ములుగు, జనవరి 7:** గిరిజనలు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, గతంలో ఎప్పుడూ లేని విధంగా రేవంత్ నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం పాటుపడుతోందని మంత్రి సీతక్క అన్నారు. ములుగు జిల్లా ఏటూరు నాగారం ఐటీడీఏ పరిధిలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, స్థానిక డీడీ దబ్బకట్ల జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే ఆదివాసీల ఆత్మగౌరవం, అస్తిత్వానికి ప్రతీకగా మేడారం జాతర రూపుదిద్దుకుంటుందని, జాతర పవిత్రతను కాపాడాలని మంత్రి సీతక్క సూచించారు. పూజారులు, ఆదివాసీ సంఘాల నాయకుల సమన్వయంతో జాతర విజయవంతం చేయాలన్నారు. జాతర నిర్వహణపై ఆదివాసీ సంఘాల నాయకులు తమ అభిప్రాయాలను తెలపాలని సూచించారు. కోట్లాది మంది భక్తుల విశ్వాసం మేడారం జాతర కలకలాం గుర్తుండిపోయేలా ఆలయ ప్రాంగణం రూపుదిద్దుకుంటుందని వెల్లడించారు. చిలకలగుట్ట నుంచి సమ్మక్కను తీసుకొచ్చేటప్పుడు ఆదివాసీ యువజన సంఘాలు సమన్వయం పాటించాలని, వలంటరీ సభ్యులకు, మహిళలకు ప్రత్యేకంగా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. జాతర సమయంలో ఇసుక లారీల రవాణాను పూర్తిగా నిలిపివేయనున్నట్లు వివరించారు. జాతరకు వచ్చే భక్తులు ఏ విధంగా దర్శనం చేసుకోవాలనే అంశంపై ప్రత్యే క రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని అధికారులకు సూచించామని అన్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా




జాతరకు ఏర్పాట్లు చేస్తున్నామని, అభివృద్ధిక శ్రీకారం చుట్టామని అన్నారు.

# నిన్న ప్రియురాలు.. నేడు ప్రియుడు

**విషాదాంతం అయిన ప్రేమజంట జీవితం**

**ఉరేసుకుని ప్రేమికురాలు బలవన్మరణం**

**తట్టుకోలేక ప్రియుడు కూడా ఆత్మహత్య**

**ఇరు కుటుంబాల్లో పెను విషాదం**

**హైదరాబాద్, జనవరి 7:** ప్రియురాలి మరణాన్ని తట్టుకోలేక ప్రియుడు పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రాహ్మణపల్లెలో చోటుచేసుకుంది. మంగళవారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లిలో పూజ అనే 17 ఏళ్ల యువతి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తమ బిడ్డ ఆత్మహత్యకు కారణం అదే గ్రామానికి చెందిన సిద్ధగోని మహేష్ అని మృతురాలి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం మహేష్ కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. రంగారెడ్డి జిల్లా బ్రాహ్మణ పల్లె సమీపంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని.. నిప్పంటించుకుని తీవ్ర గాయాలతో మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో




పోతురాజు అలివేలు కూతురు పోతురాజు పూజ (16)అనే విద్యార్థిని ఇబ్రహీంపట్నంలోని కార్తికేయ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. పూజా తండ్రి పదహారేళ్ల క్రితం మృతి చెందడంతో అప్పటినుంచి తన తల్లి అలివేలు కుమారుడు కుమార్తె ఇరువురిని పెంచి పోషించింది. అదే గ్రామానికి చెందిన సిద్ధగోని యాదయ్య కుమారుడు సిద్ధగోని మహేష్ (20) నాలుగు ఐదు నెలలుగా ఒకరినొకరు ప్రేమించుకుంటున్నారు. విషయం ఇరు కుటుంబాల్లో తెలవడంతో వీరిని గత కొన్ని రోజులుగా కలుసుకోకుండా చేశారు. దీంతో ఇటీవలే మహేష్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. కొన్ని రోజులు దవాఖానాలో చికిత్స పొంది ప్రాణాలతో బయటపడ్డాడు. మహేష్ పురుగుల మందు తాగిన విషయాన్ని తెలుసుకున్న పూజ సైతం మందు తాగి ఆత్మహత్య చేసుకోవడానికి యత్నించింది. ఆమె సైతం ప్రాణాలతో బయటపడింది. పెళ్లి చేసుకోకుంటే చస్తానని మహేష్ ఫోన్ చేసి చెప్పడంతో.. పూజ మానసిక ఒత్తిడికి గురైంది. తన ప్రియుడు ఆత్మహత్య చేసుకుంటాడేమోనని దిగులుతో తానే మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉదయం 8గంటలకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పూజ మృతి చెందడంతో గ్రామంలో కొద్దిసేపు ఆందోళన నెలకొంది. పోలీసుల రంగప్రవేశంతో పూజ మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. పూజ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని తెలుసుకున్న మహేష్ బుధవారం హయత్ నగర్ పరిధిలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో అటు పూజ ఇటు మహేష్ ఆత్మహత్య చేసుకుని చనిపోవడంతో మేడిపల్లి గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ఇరు కుటుంబాలలో రోదనలు మిన్నంటాయి.

TGTEL/25/A1737 | NETI SAKSHI

# కేసీఆర్ అప్పులు చేసింది నిజమే



- ఆ అప్పులు తెలంగాణ అభివృద్ధి కోసమే
- సీఎం రేవంత్ ఫ్రస్టేషన్‌లో ఉన్నాడు
- కొత్త బిఆర్ఎస్ నేత కేటీఆర్

**ఖమ్మం, జనవరి 7:** తెలంగాణకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అద్భుతమైన ప్రాజెక్టులు తీసుకొచ్చారని కేటీఆర్ గుర్తు చేశారు. కేసీఆర్ అప్పు చేసిన మాట వాస్తవమేనని కేటీఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అయితే చేసిన అప్పు రాష్ట్రాభివృద్ధి కోసం వినియోగించారని వివరించారు. ఇందులో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదన్నారు. ఇకపోతే సీఎం రేవంత్ రెడ్డి తీవ్రమైన ఫ్రస్టేషన్‌లో ఉన్నారని కేటీఆర్ అన్నారు. ఆయనలో అంత ఫ్రస్టేషన్ ఎందుకో తనకు అర్థంకావడం లేదని తెలిపారు. సెక్యూరిటీ వాళ్ళతో పాటు పోలీసుల్ని సైతం ఆయన కొడుతున్నారని ఆరోపించారు. 'రేవంత్ రెడ్డి ఫ్రస్టేషన్‌లో ఉన్నాడని.. అరుస్తున్నాడు.. కొడుతున్నాడు.. రేపు ఎవరినైనా కరుస్తాడేమో జాగ్రత్త' అంటూ సీఎం భార్య గీతకు ఈ సందర్భంగా కేటీఆర్ హితవు పలికారు. అధికార కాంగ్రెస్ పార్టీలోని అగ్రనేతలకు, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీలోని కీలక నేతల మధ్య మాటలు తూటాలు పేలుతున్న క్రమంలో కెటిఆర్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఈ రెండు పార్టీల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలతో మాటల వేడి బాగా పెరిగింది. తాజాగా బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బుధవారం హైదబారాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. రేవంత్ రెడ్డిని రైతుబంధు ఏమైందని ప్రశ్నిస్తే.. లాగులో తొండలు వదులుతాం అంటున్నారని మండిపడ్డారు. ఎప్పటికప్పుడు న్యూఢిల్లీ పోయి కప్పం కట్టి వస్తున్నారని విమర్శించారు. ఢిల్లీలో కప్పం కట్టకపోతే తన పదవి ఉండదని.. ఊడిపోతుందని ముఖ్యమంత్రి రేవంత్‌కి తెలుసునన్నారు. తాను ఆంధ్రప్రదేశ్ వెళ్లి చదువుకుంటే తప్పు.. ఆయన మాత్రం ఆంధ్రాలోని భీమవరంకు చెందిన వ్యక్తిని అల్లుడిగా తెచ్చుకోవచ్చు నంటూ కేటీఆర్ వ్యంగ్యంగా పేర్కొన్నారు. తాను అమెరికాలో బాత్‌రూమ్‌లు కడుక్కుంటున్నానని అన్నారు. మరి అమెరికాలో మీ సోదరుడు జగదీష్ రెడ్డి కూడా ఉన్నాడని.. ఆయన తన ఇంట్లో ఆయనే కడుక్కోవట్లేదా? అంటూ సీఎం రేవంత్‌ను ఈ సందర్భంగా కేటీఆర్ చురకలంటించారు. అమెరికాలో ఎవరింట్లో పనులు వాళ్ళే చేసుకుంటారని.. ఈ విషయం తెలయకుంటే తెలుసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఈ సందర్భంగా సూచించారు. ప్రజలు.. మిమ్మల్ని గెలిపించింది ఈ పనికిమాలిన డైలాగుల కోసం కాదని.. పనిచేసి చూపించాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఆయన స్పష్టం చేశారు. యూరియా బస్తాల కోసం ప్రతి రోజు షాపుల ముందు రైతులు క్యూ కదుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. షాపుల్లో యూరియా లేనప్పుడు అందుకోసం రూపొందించిన యాప్‌లు ఏమి చేస్తాయంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. యూరియా అంశంలో యాప్‌ల సమస్య రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం కొత్త డ్రామాకు తెరలేపిందని విమర్శించారు. ఇప్పుడు కొత్తగా మళ్ళీ కార్డులు తీసుకు వస్తామని ప్రభుత్వం చెబుతుందన్నారు.

## ముగ్గురు మంత్రులు ఉన్నా ఒరిగిందేమీ లేదు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఖమ్మం జిల్లా అభివృద్ధికి చేసిందేమీ లేదని కేటీఆర్ విమర్శించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా ఇక్కడి ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. నాడు ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడం కోసం కేసీఆర్‌గారు సీతారామసాగర్ ప్రాజెక్టును నిర్మించతలపెట్టి 90 శాతం పనులను పూర్తిచేశారని గుర్తుచేశారు. ఖమ్మం జిల్లాలో 7.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని, గోదావరి జలాలపై పూర్తి హక్కులు ఖమ్మం జిల్లాకే దక్కాలని నాడు కేసీఆర్ ఈ ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని విమర్శించారు. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు కమీషన్‌లకు కక్కుర్తిపడి ప్రాజెక్టును పక్కనపెట్టారని మండిపడ్డారు. ఆ ముగ్గురు మంత్రులు ప్రజలకు మేలు చేయగల మొనగాళ్ళు కాదని, మోసగాళ్లని కేటీఆర్ విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపి నామా నాగేశ్వరరావు, పువ్వాడ అజయ్, రాజ్యసభ సభ్యుడు తదితరులు పాల్గొన్నారు.

# డైలీ సీరియల్‌లా ఫోన్ ట్యాపింగ్ విచారణ

- అన్ని వేళ్లూ ఒకేవైపు చూపిస్తున్నా చర్యలేవీ
- అసెంబ్లీ నుంచి బిఆర్ఎస్ పారిపోయింది
- బిజెపి మాత్రమే సమర్థ విపక్షంగా పనిచేసింది
- మెదక్ ఎంపీ రఘునందన్ రావు



**మెదక్, జనవరి 7:** ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ డైలీ సీరియల్‌లా సాగుతోందని బీజేపీ సీనియర్ నేత, మెదక్ ఎంపీ ఎం.రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం మెదక్‌లో రఘునందన్ రావు మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ కేసు డైలీ సీరియల్‌లా సాగుతోందని వ్యంగ్యంగా అన్నారు. కొండను తవ్వి ఎలుకను ఈ సిట్ పడుతుందో లేదో అంటూ సందేహం వ్యక్తం చేశారు. డేటాను సర్వీస్ ప్రొవైడర్ల వద్ద తీసుకోవచ్చునని అభిప్రాయపడ్డారు. నేడు కొండల్ రెడ్డి, రేపు ఆయన డ్రైవర్ ఇలా ఎన్నాళ్లు అంటూ? సిట్ వ్యవహారశైలిపై ఆయన కొంత అసహనం వ్యక్తం చేశారు. కర్త, కర్మ అన్ని ఒకరివైపే వేలు చూపిస్తున్నాయని.. కానీ ఆయనను పిలిచేందుకు భయపడుతున్నారంటూ రఘునందన్ పరోక్షంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ తతంగమంతా ఎన్నికల కోసం పిలుస్తున్నట్లుగా ఉందన్నారు. సిట్ కాంగ్రెస్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌లా మారిందంటూ ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఫస్ట్ బాధితుడిని తానేనని గుర్తు చేశారు. మొక్కుబడిగా ఐదు రోజులు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించిం దంటూ రాష్ట్ర ప్రభుత్వంపై రఘునందన్ రావు మండిపడ్డారు. అసెంబ్లీని బాయ్‌కాట్ చేసి.. ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పూర్తి వైఫల్యం చెందిందని విమర్శించారు. నీటి అంశాలపై చర్చకు పాలక పక్షం మీనమేషాలు లెక్కిస్తే.. బీఆర్ఎస్ పార్టీ భయపడి పారిపోయిందని పేర్కొన్నారు. తమ సంఖ్య తక్కువ ఉన్నా గట్టిగా పోరాడి.. పాలక పక్షాన్ని బీజేపీ నిలదీసిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా బీజేపి శాసనసభా పక్ష నేత మహేశ్వర రెడ్డిని అభినందిస్తున్నానని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తుంటే.. 20 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా సభలో లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది పాలమూరు జిల్లా మీద, కృష్ణా జలాల మీద కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి ఇదంటూ అధికార పార్టీ సభ్యులపై నిప్పులు చెరిగారు. కొంతమంది తమ పార్టీ నుంచి వలసపోతే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఆలోచించుకోవాలంటూ వలస నేతలకు ఈ సందర్భంగా ఆయన కీలక సూచన చేశారు. యెన్నెం శ్రీనివాస రెడ్డి కూడా తమ పార్టీ నుంచి వెళ్లిన వారేనని గుర్తు చేశారు. ఆలోచించుకోవాలంటూ ఆయనకు హితవు పలికారు. అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్‌లపై పోరాడేది.. ప్రజల పక్షాన ఉండేది బీజేపీ మాత్రమేనని ఎంపీ స్పష్టం చేశారు. తమ పార్టీలో కొత్త పాత అనేది ఏమీలేదని కుండబద్ధలు కొట్టారాయన. కల్వకుంట్ల కవిత పార్టీ స్థాపిస్తే.. దేశంలో 6202వ పార్టీ అవుతుందన్నారు. ఎవరు కొత్త పార్టీ పెట్టిన తాము స్వాగతిస్తామని స్పష్టం చేశారు. ఒక నటుడు సినిమాకు టికెట్ల ధర పెంచి మరో నటుడికి పెంచకపోతే అది పక్షపాతం అవుతుందన్నారు. అందరికీ ఒకటే రూల్ ఉండాలి.. అన్ని సినిమాలకు ఒకటే రూల్ ఉండాలని రఘునందన్ తెలిపారు.



# సీఎం కప్-2025 పోస్టర్ ఆవిష్కరణ

**హైదరాబాద్, జనవరి 7 :** సీఎం కప్–2025 సెకండ్ ఎడిషన్ పోస్టర్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, శాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, సిఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు, సోనీబాల తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 17 నుంచి 22 వరకు గ్రామస్థాయి, 28 నుంచి31 వరకు మండలస్థాయి, ఫిబ్రవరి 3 నుంచి 7 వరకు నియోజకవర్గ స్థాయి, ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు జిల్లా స్థాయి, ఫిబ్రవరి 19 నుంచి 26 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరుగనున్నాయి. మొత్తం 44 రకాల క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడించారు.

# అమెరికాలో చట్టవిరుద్ధ పనులు చేయకండి

**అది మీ వీసాపై ప్రభావం చూపుతుంది**

**భారతీయ విద్యార్థులకు అమెరికన్ ఎంబసీ హెచ్చరిక**

**న్యూఢిల్లీ, జనవరి 7:** ఇండియాపై అమెరికా కక్ష కట్టినట్లే ఉంది. ఇటీవల అగ్రరాజ్యం వ్యవహరిస్తోన్న తీరు చూస్తుంటే అట్లే అనిపిస్తోంది. ఒకవైపు సుంకాల పేరుతో ఇండియాపై ట్రంప్ ఇష్టారీతిన టారిఫ్స్ విధిస్తుంటే.. మరోవైపు భారతీయ విద్యార్థులపై అమెరికా కఠిన ఆంక్షలు విధిస్తుంది. తాజాగా మరోసారి ఇండియన్ స్టూడెంట్స్‌కు అమెరికా వార్నింగ్ ఇచ్చింది. ఈ మేరకు న్యూఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అమెరికాలో చదువుతున్న భారతీయ విద్యార్థులు ఏదైనా ఉల్లంఘనలకు పాల్పడితే దేశ బహిష్కరణకు గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. అమెరికాలోకి ప్రవేశించడం ఒక హక్కు కాదని.. వీసా హోల్డర్లందరూ స్థానిక చట్టాలు, నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని నొక్కి చెప్పింది. 'యుఎస్ చట్టాలను ఉల్లంఘించడం మీ స్టూడెంట్ వీసాపై తీవ్ర పరిణామాలు చూపించవచ్చు. రూల్స్ బ్రేక్ చేసి అరెస్ట్ అయినా, ఏదైనా చట్టాలను ఉల్లంఘించినా మీ వీసా రద్దు కావొచ్చు. దేశం నుంచి మిమ్మల్ని బహిష్కరించవచ్చు. అలాగే.. భవిష్యత్తులో యుఎస్ వీసాలకు మీరు అనర్హులుగా మారవచ్చు. నియమాలను పాటిస్తూ మీ ప్రయాణాన్ని ప్రమాదంలో పడేయకండి. యుఎస్ వీసా అనేది ఒక ప్రత్యేక హక్కు, పూర్తి హక్కు కాదు' అని యుఎస్ ఎంబసీ పేర్కొంది. అమెరికాలో ఉన్న సమయంలో విద్యార్థులు జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా ఉండాలని సూచించింది. ట్రంప్ రెండో అమెరికా పగ్గాలు చేపట్టాక కీలక మార్పులకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో స్టూడెంట్ వీసా ఒకటి. స్టూడెంట్ వీసా ఫీజులను భారీగా పెంచడం, తప్పనిసరి సోషల్ మీడియా తనిఖీ వంటి కఠిన ఆంక్షలు విధించారు. ట్రంప్ పరిపాలన ఆంక్షలతో స్టూడెంట్స్ అమెరికా వెళ్లడం కష్టతరంగా మారింది.





# ఉర్దూ వర్సిటీ భూములకు నోటీసులపై బండి సంజయ్ ఫైర్

**హైదరాబాద్ :** హైదరాబాద్ మౌలానా ఉర్దూ యూనివర్శిటీ లోని 50 ఎకరాల స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని నోటీసుల్లో కలెక్టర్ పేర్కొనడంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేసారు. వేల కోట్ల రూపాయల విలువైన వర్శిటీ భూములను అమ్మి దోచుకోవాలనుకుంటున్నారా? కనీస సౌకర్యాలు కల్పించడం చేతగాని ప్రభుత్వం విద్యా సంస్థల భూములను అమ్ముకోవాలనుకుంటోందని ఆరోపించారు. విద్యా సంస్థల జోలికొస్తే ఖబడ్దార్ అంటూ సర్కార్ కు అల్టిమేటం ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా అన్యాక్రాంతమైన అనేక ప్రభుత్వ భూములున్నాయి. పాతబస్తీలో సల్కం చెరువును కబ్జా చేసి విద్యా వ్యాపారం చేస్తున్న ఒవైసీపై చర్యలేవి? వాటిని స్వాధీనం చేసుకుని ప్రజోపయోగ అవసరాలకు ఎందుకు ఉపయోగించడం లేదు. విద్యార్థుల భవిష్యత్త్ అవసరాలకు ఉపయోగపడే వర్శిటీల, విద్యా సంస్థల భూములపై కన్నేయడం సిగ్గు చేటని అన్నారు. తక్షణమే సర్కార్ తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.

# ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు పరిశీలకులు

**పుదుచ్చేరి, తమిళనాడుకు ఉత్తమ్ నియామకం**



**న్యూఢిల్లీ, జనవరి 7:** త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాలకు సీనియర్ పరిశీలకులను ఏఐసీసీ బుధవారం నియమించింది. అస్సాం, కేరళ, తమిళనాడు–పుదుచ్చేరి, పశ్చిమబెంగాల్‌కు ఈ పరిశీలకులను నియమించింది. ఈ నియమకాలు తక్షణం అమల్లోకి వచ్చినట్టు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలకు ఏఐసీసీ పరిశీలకుడిగా తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. నాలుగు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల పర్యవేక్షణకు ఏఐసీసీ సీనియర్ పరిశీలకులను నియమించింది. అస్సాం, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అస్సాం ఎన్నికల పరిశీలకులుగా భూపేష్ భగేల్, డీకే శివకుమార్, బంధు టిర్కి, కేరళకు సచిన్ పైలెట్, కేజె జార్జ్, ఇమ్రాన్, కన్హయ్య కుమార్, తమిళనాడు, పుదుచ్చేరికి పరిశీలకులుగా ముఖుల్ వాస్కి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఖాజి మహ్మద్ నిజాముద్దీన్.. పశ్చిమ బెంగాల్‌కు సుదీప్ రాయ్ భర్మన్, షకీల్ అహ్మద్ ఖాన్, ప్రకాష్ జోషిని నియమించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శ కేసీ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. అస్సాం రాష్ట్రానికి మాజీ సీఎం భూపేష్ బఘేల్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, బంధు తిర్కీ ఏఐసీసీ సీనియర్ పరిశీలకులుగా నియమితులయ్యారు. కేరళ పరిశీలకులుగా రాజస్థాన్ మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్, కేజే జార్జ్, ఇమ్రాన్ ప్రతాప్‌గఢి, కన్హయ్య కుమార్ నియమితులయ్యారు. తమిళనాడు, పుదుచ్చేరి పరిశీలకులుగా ముకుల్ వాస్నిక్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఖాజీ మె?హమ్మద్ నిజాముద్దీన్ పరిశీలకులుగా ఉంటారు. పశ్చిమబెంగాల్‌కు సుదీప్ రాయ్ బర్మన్, షకీల్ అహ్మద్ ఖాన్ పరిశీలకులుగా నియమితులయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో క్షేత్ర స్థాయిలో పార్టీ వ్యూహాలను అమలు చేయడం, అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల ప్రచారానికి సమన్వయం చేయడంలో సీనియర్ పర్యవేక్షకులు కీలక పాత్ర పోషించనున్నారు.

# డ్రగ్స్ పార్టీపై పోలీసుల దాడి

**పట్టుబడ్డ వారిలో ఏఆర్ కానిస్టేబుల్**

**హైదరాబాద్,జనవరి7:** గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రగ్స్ పార్టీ జరుగుతుందన్న పక్కా సమాచారంతో ఈగల్ టీమ్ సోదాలు నిర్వహించింది. కొండాపూర్ మసీద్‌బండ సమీపంలో ఉన్న కోవే స్టేస్‌లో కొందరు వ్యక్తులు డ్రగ్స్ తీసుకుంటున్నట్లు తెలియడంతో ఈగల్ టీమ్ ఆకస్మిక దాడి చేసింది. సోదాల సమయంలో.. అక్కడ మద్యం సేవిస్తున్న ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారికి డ్రగ్ కిట్స్ ద్వారా పరీక్షలు నిర్వహించగా.. ఏడుగురిలో ఐదుగురికి గంజాయి పాజిటివ్ వచ్చింది. వీరిలో హైదరాబాద్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ కూడా ఉండటం గమనార్హం. పట్టుబడిన వారిలో నలుగురు స్నేహితులు ఉన్నారు. వారంతా 2019లో హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తి చేశారు. గతంలో ఓ స్నేహితుడి పెళ్లి వేడుకకు వెళ్లిన సమయంలో వీరు మొదటిసారి డ్రగ్స్ రుచి చూశారు. ఆ సరదా.. కాలక్రమేణా వ్యసనంగా మారింది. అప్పటి నుంచి ఈ నలుగురూ తరచూ ఒకచోట చేరి డ్రగ్స్ సేవించడం అలవాటుగా మార్చుకున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. వారికి డ్రగ్స్ ఎక్కడి నుంచి సరఫరా అవుతుందనే కోణంలో విచారణ వేగవంతం చేశారు.





సంపాదకీయం

# ప్రపంచ మనుగడకు సవాల్‌గా ట్రంప్!

అమెరికా ఇతర దేశాల మీద దాడిచేస్తే...కారణాలు ఉంటాయి. కానీ ఇతర దేశాలు దాడి చేస్తే అది తప్పంటాడు. ఎవరి కారణాలు వారికి ఉంటాయి. అయితే ట్రంప్ రెండోసారి అధ్యక్షుడు అయ్యాక టెంపరితనం పెరిగింది. ప్రపంచంలో పెద్దన్న పాత్ర పోషించాలని చూస్తున్నారు. సామ్రాజ్యవాద విస్తరణ కాంక్ష కనిపిస్తోంది. తన కనుసన్నల్లో అన్ని దేశాలు నడవాలన్న నిరంకుశ రాజరికం కనిపిస్తోంది. ఏ దేశం కూడా తన కనుసన్నల్లోనే నడవాలను హుంకరిస్తున్నారు. పన్నుల టారిఫ్‌లతో విరుచుకు పడుతున్నారు. మొత్తంగా రెండురకాలుగా ట్రంప్ ప్రపంచాన్ని గిప్పిట్లో పెట్టుకోవాలని చూస్తున్నారు. చెప్పినట్లు వింటే టారిఫ్‌ల బాదుడు ఉండదు. చెప్పినట్లు వినకుంటే టారిఫ్‌లు విధిస్తున్నారు. ఈ క్రమంలో చైనా,భారత్ వంటి దేశాలపై పన్నులతో విరుచుకు పడుతున్నారు. ఇలా కాని పక్షంలో బడిత ఉన్నోడిదే బర్రె అనే సామెతలో వెనిజువెలా లాంటి దేశాలపై సైనిక దాడికి దిగుతున్నాడు. ఇప్పటికే ఇరాన్, ఖతార్, సిరియాలపై విరుచుకుపడి బాంబులు వేశారు. వెనెజువెలాను తామే పాలిస్తామని చెప్పడం ఏరకమైన న్యాయం అన్నది అర్థం కాదు. ప్రపంచంలో సైనిక పాటవశక్తి ఉంటే ఏ దేశం మీదయినా దాడి చేయవచ్చా అన్న సందేహాలు వస్తున్నాయి. అలా అయితే మన దేశం నుంచి విడిపోయిన పాక్, బంగ్లా దేశ్‌లపై మనం కూడా దాడి చేసి భారత్‌లో కలిపేసుకుని, అఖండ భారత్ కలను సాకారం చేసుకోవచ్చు. అందుకు కొన్నిదేశాల మద్దతు అంటే, అమెరికాను ఎదిరించే దేశాల మద్దతు కూడగడితే చాలన్నమాట. భారత్‌లో ఉగ్రవాదులను ఉసిగొల్పుతున్న పాక్‌కు బుద్ధి చెప్పేందుకు దాడి చేస్తే అడ్డుకోవాలని ట్రంప్ చూశారు. తానే పాక్, భారత్ యుద్ధాన్ని ఆపానని అంటాడు. ఉక్రెయిన్, రష్యాల మధ్య యుద్ధం వద్దని పెత్తనం చెలాయిస్తున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేయవద్దని అంటాడు. ఇలా ట్రంప్ తన తలకెక్కిన అహంకారంతో వ్యవహరి స్తున్నాడు. నిజానికి ఇప్పుడు భారత్ బంగ్లాదేశ్‌పై దాడి చేయాలి. అక్కడ మైనార్టీ హిందువులను ఊచకోత కోస్తున్నందుకు కలగచేసుకోవాలి. కానీ ఇది అంతర్జాతీయ సమస్య అవుతుంది. అదే అమెరికా వెనెజువెలాపై దాడిచేసి, ఆ దేశ అధ్యక్షుడిని పట్టుకుని వెళితే ఏ దేశం కూడా అడ్డుకోలేక పోయింది. దీంతో లాటిన్ అమెరికాలోని వెనిజులా ప్రస్తుతం ఒక విచిత్ర పరిస్థితిలో ఉంది. జనవరి మూడవ తేదీన రాజధాని కారకాస్ పై దాడి చేసిన అమెరికా నిద్రలో ఉన్న అధ్యక్షుడు మదురో, ఆయన సతీమణి సిసిలీ ఫ్లోర్స్‌ను కిడ్నాప్ చేసి ఏకంగా అ÷-ఎరికాకే తీసుకుపోయింది. నార్కో టెర్రరిస్టు అని అభియోగం మోపి న్యూయార్క్ కోర్టులో ప్రవేశపెట్టింది. తాను వెనిజులా అధ్యక్షుడినని, ఎలాంటి నేరం చేయలేదని మదురో కోర్టులో చెప్పాడు. తదుపరి ఏం జరుగుతుందో తెలియదు. తామే వెనిజులాను నడిపిస్తామని ట్రంప్ ప్రకటించాడు. అంతర్జాతీయ సంస్థలు ఏం చేస్తున్నాయో తెలియడం లేదు. ఉపాధ్యక్షురాలిగా ఉన్న డెల్సీ రోడ్రిగజ్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక తమకు సహకరించకపోతే మదురో కంటే ఎక్కువగా అనుభవించాల్సి వస్తుందని ట్రంప్ ఆమెను కూడా బెదిరించాడు. అయితే అంతర్జాతీయంగా వస్తున్న సమాచారం మేరకు . వెనిజులాలోని చమురు నిక్షేపాలను ఆక్రమించుకోవడం అమెరికా ఎత్తుగడగా ఉంది.. అమెరికా చర్యను ఐరాస ఖండించింది. మదురోను ఎలా పట్టుకున్నారు, అందుకు అనుసరించిన పద్ధతేమిటి అనే అంశాలు ఎలా ఉన్నా ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకోవాల్సిన అవసరం మాత్రం ఉంది. దీనిపై ప్రపంచ దేశాలను కూడాగట్టాల్సి ఉంది. ముదురో అపహరణ సమయంలో జరిగిన ప్రతిఘటనలో 80 మంది మరణించారని, వారిలో 32 మంది క్యూబన్లు ఉన్నట్లు వార్తలు వచ్చాయి. రెండో ప్రపంచ యుద్ధానికి ముందు జర్మన్ నియంత అడాల్ఫ్ హిట్లర్ కూడా యూదుల మారణకాండకు పాల్పడ్డాడు. నరమేధం సృష్టించాడు. గ్యాస్ ఛాంబర్‌లు పెట్టి లక్షల మందిని పొట్టన పెట్టుకున్నాడు. అనేక దేశాలను ఆక్రమించుకుంటూ పోయినా ప్రజాస్వామిక ముసుగు వేసుకున్న దేశాలేవీ అడ్డుకోలేదు. అప్పట్లో అమెరికా ఆయుధాలు కూడా అందించింది. అయితే రష్యా అధినేత స్టాలిన్ నాయకత్వంలో ప్రతిఘటించిన తరవాతనే హిట్లర్ ఆత్మహత్య చేసుకొని దిక్కులేని చావు చచ్చాడు. ఇండియాలో కూడా బ్రిటిషర్లు ఇలాగే వ్యవహరించాలరు. అంతకు ముందు మొగలులు కూడా దాడులు చేసి హిందూ ఆలయాలను ధ్వంసం చేసి ప్రజలను ఊచకోత కోశారు. మతమార్పిళ్లు చేశారు. తెలంగాణలో నైజాం నిరంకుశ రజాకార్లు కూడా ప్రజలను ఊచకోత కోశారు. ఇవన్నీ కూడా హిట్లర్‌ను మించి జరిగాయి. కాశ్మీర్‌లో మారణహోమం చూశాం. మతమార్పిళ్లు చూశాం. ఊచకోతలు చూశాం. ఇకపోతే దేశాన్ని ముక్కలు చేసేలా బ్రిటిషర్లు కుట్రలు చేశారు. అయితే ఇప్పుడు ప్రపంచ వ్యవస్థ మారంది. ఆధునిక ప్రపంచంలో ఇటీవల ఉక్రెయిన్‌పై రష్యా దాడిని, ఇప్పుడు వెనిజువెలాపై అమెరికా దాడిని చూస్తున్నాం. ఈ రెండు దేశాలు సైనికంగా బలంగా ఉండడంతో తమను ఎవరేమీ చేయలేరన్న ధీమాతో దాడులకు తెగించారు. చరిత్రను చూస్తే ప్రజాస్వామ్యం, మానవ హక్కుల గురించి ప్రపంచానికి నిత్యం నీతిసూత్రాలను బోధించే అమెరికా అడుగడుగునా వాటిని ఉల్లంఘించడం చూస్తున్నాం. తమ దారికి రాని వారిని ఏం చేస్తామో ఇది ప్రారంభం మాత్రమే అని మదురో అపహరణ తరువాత ట్రంప్ చెప్పాడంటే రానున్న రోజుల్లో ఇంకా ఎన్ని దాడులు చూడాల్సి వస్తుందో, ప్రపంచానికి ఎలాంటి ముప్పురానుందో అన్నది ప్రపంచ దేశాలు ఆలోచించాల్సి ఉంది. ఇప్పుడు డోనాల్డ్ ట్రంప్ రూపంలో ఉన్న అమెరికన్ ఫాసిస్టు శక్తిని నిలువరించేది ఎవరనేదే కాలమే చెప్పాలి. తమ తదుపరి లక్ష్యం మెక్సికో, కొలంబియా, క్యూబా అని కూడా ట్రంప్ చెప్పాడు. ట్రంప్ సామ్రాజ్య విస్తరణ కాంక్ష వెనిజులా ఉదంతం స్పష్టం చేసింది. అంతకు ముందు డెన్మార్క్ స్వయంపాలిత గ్రీన్‌లాండ్ తమకు కావాలని చెప్పిన సంగతి తెలిసిందే. అది కూడా త్వరలోనే స్వాధీనం చేసుకునేదాకా వదిలేట్టుగా లేదు. కెనడాను కూడా ఇలాగే బెదరించాడు. ఏది కావాలంటే దాన్ని స్వాధీనం చేసుకొనే ట్రంప్ తరహా సామ్రాజ్యవాదం ముదరితే మళ్లీ బ్రిటిష్ తరహా సామ్రాజ్యం అమెరికా ప్రారంభిస్తుందా అన్న ఆందోళన కలుగుతోంది.

# కేంద్ర బడ్జెట్‌పై సందిగ్ధం

- ఫిబ్రవరి 1న ఆదివారం కావడంతో కొంత చర్చ
- త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం

**న్యూఢిల్లీ, జనవరి 7:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జనవరి 31 నుంచి ప్రారంభం కానున్నాయి. అలాగే బడ్జెట్ ప్రతిపాదనలను ఫిబ్రవరి1న ప్రవేశపెడతారు. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం రావడంతో అదే రోజు ప్రవేశపెడతారా? అనే చర్చ జరుగుతోంది. అలా కానట్లయితే 2న ప్రవేశ పెట్టే అవకాశం కూడా ఉంటుంది. అయితే దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. వారాంతాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టడం కొత్తేమీ కాదు. తొలిసారిగా 2016లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వార్షిక బడ్జెట్‌ను ఆదివారమే ప్రవేశపెట్టారు. ఆ తరువాత 2025లోనూబడ్జెట్‌ను నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టారు. 2020లో కరోనా సమయంలోనూ, అంతకు ముందు 2012 మే 13న ఆదివారం పార్లమెంట్ సమావేశం జరిగింది. ఈ లెక్కన పార్లమెంటరీ సంప్రదాయాలను అనుసరిస్తే, ఆదివారం కూడా బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం లేకపోలేదు. గతంలో కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి చివరిరోజున సమర్పించేవారు. దీనివల్ల బడ్జెట్ ఆమోద పక్రియ ఆలస్యమయ్యేది. దీంతో కొత్త ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి ప్రభుత్వ ఖర్చుల కోసం కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి నిధులను ఉపసంహరించు కునేందుకు వీలుగా పార్లమెంట్ 'ఓట్ ఆన్ అకౌంట్'ను ఆమోదించాల్సి వచ్చేది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలు శాఖాపరమైన డిమాండ్లను వివరంగా పరిశీలించిన




తరువాత, మిగిలిన సంవత్సరానికి పూర్తి బడ్జెట్‌ను ఆమెదించే వారు. ఇది తీవ్ర జాప్యాలకు దారితీస్తుండటంతో.. దీన్ని నివారించేందుకు 2017లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ తేదీని ఫిబ్రవరి 1కి మార్చారు. దీనివల్ల ఏప్రిల్ 1న ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ముందే అంటే మార్చి 31లోపే బడ్జెట్ ఆమోద పక్రియ పూర్తి చేయడానికి పార్లమెంటుకు తగినంత సమయం లభిస్తుంది. ఈక ÷-రమంలో ఈ యేడాది కూడా ఫిబ్రవరి 1ననే బడ్జెట్ ప్రవేశ పెట్టడానికి అభ్యంతరం ఉండకపోవచ్చు. ఇకపోతే ఇప్పటికే ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడస్జెట్ కసరత్తు మొదలు పెట్టారు. వివిధ శాఖలనుంచి నివేదికలు తెప్పించుకున్నారు.



# ఢిల్లీలో కాలుష్యానికి తోడు చలి తీవ్రత

**న్యూఢిల్లీ, జనవరి 7:** ఢిల్లీలో గాలి నాణ్యతలు పడిపోయాయి. చలి తీవ్రత కూడా పెరిగింది. బుధవారం ఉదయం, మధ్యాహ్నం దట్టమైన పొగమంచు కురవడంతో భారత వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్‌ని జారీ చేసింది. బుధవారం ఉదయం ఢిల్లీలో ఎక్యూఐ 336 స్థాయి వద్ద నమోదైంది. దీంతో వీటి స్థాయిల్ని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) వెరీ పూర్ కేటగిరీలో వర్గీకరించింది. నెహ్రూనగర్‌లో ఎక్యూఐ 360 స్థాయిలు నమోదయ్యాయి. 21 పర్యవేక్షణా కేంద్రాల్లో ఎక్యూఐ స్థాయిలు వెరీ పూర్, 14 కేంద్రాల్లో పూర్ కేటగిరీలో ఎక్యూఐ స్థాయిలు నమోదయ్యాయని సిపిసిబి పేర్కొంది.

# ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉచిత సలహాలు

**అవేవీ పట్టించుకోకుండా భారత్ భద్రతపై దృష్టి ● విదేశాంగమంత్రి జైశంకర్ వ్యాఖ్య**



**న్యూఢిల్లీ, జనవరి 7:** పాకిస్థాన్ ఉగ్ర దాడులకు ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో పశ్చిమ దేశాలు కపటత్వం ప్రదర్శించడంపై విదేశాంగ మంత్రి జై శంకర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమకు వేల మైళ్ల దూరంలో ఉన్న ఆ దేశాలు ఉద్రిక్తతల సమయంలో ఆందోళన చెందినట్లు చెప్పాయని.. కానీ అవేవీ తమ సొంత ప్రాంతంలో జరుగుతున్న వాటిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. లక్సెంబర్గ్‌లోని భారత కమ్యూనిటీ సభ్యులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సాయం చేయాలనుకునే వారితో కలిసి పని చేసేందుకు భారత్ సిద్ధంగా ఉంటుందని జైశంకర్ పేర్కొన్నారు. అదే.. పాకిస్థాన్‌లా ప్రవర్తిస్తే మాత్రం వాటికి అలాగే సమాధానం చెబుతామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో జరిగే పరిణామాలు దేనిని ఏమేరకు ప్రభావితం చేస్తాయో చెప్పడం కష్టమన్నారు. ఆలోచన లేకుండా ఎక్కడో దూరంగా కూర్చొన్నవారు.. ఉచిత సలహాలు ఇస్తున్నారని, అవి కొన్నిసార్లు స్వార్థంగా, నిర్లక్ష్యంగా ఉంటున్నాయన్నారు. ప్రస్తుతం చాలా దేశాలు తమ స్వార్థం కోసం మాత్రమే పని చేస్తున్నాయన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎలా వ్యవహరించాలనే దానిపై పలు దేశాలు భారత్‌కు సలహాలు ఇచ్చాయన్నారు. కానీ అవేవీ పట్టించుకోకుండా దేశ భద్రత కోసం భారత్ ముందుకుసాగిందన్నారు.

# గ్రీన్‌ల్యాండ్ స్వాధీనానికి ఎత్తుగడలు

**పావులు కదుపుతున్న ట్రంప్**




**వాషింగ్టన్, జనవరి 7:** వెనిజులా అధ్యక్షుడు మదురోను నిర్బంధించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్నారు. గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు అవసరమైన ఎంపికలపై అధ్యక్షుడు ట్రంప్, ఆయన బృందం చర్చిస్తోందని వైట్‌హౌస్ మంగళవారం ప్రకటించింది. లక్ష్యాన్ని సాధించేందుకు 'మిలటరీ'ని ప్రయోగించడాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపింది. ఆర్కిటిక్ ప్రాంతంలో ప్రత్యర్థులను అడ్డుకునేందుకు గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకోవడం అమెరికా జాతీయ భద్రతా ప్రాధాన్యతగా ట్రంప్ భావిస్తున్నారని జాతీయ మీడియా ప్రశ్నలకు ప్రతిస్పందనగా వైట్‌హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునే మార్గాల గురించి ఓవల్ కార్యాలయంలో చర్చలు కొనసాగుతున్నాయని మరియు సలహాదారులు వివిధ మార్గాలపై చర్చిస్తున్నారని అమెరికా సీనియర్ అధికారి తెలిపారు. గ్రీన్‌ల్యాండ్‌కు మద్దతుగా నాటో నేతలు చేసిన ప్రకటనలపై ట్రంప్ భయపడటం లేదని అన్నారు. గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికా కోనుగోలు చేయడం లేదా ఆ భూభాగంతో స్వేచ్ఛా అనుబంధ ఒప్పందం (సిఒఎఫ్ఎ) ఏర్పరుచుకోవడం కూడా ఉందని పేరు వెల్లడించేందుకు నిరాకరించిన ఒక అధికారి తెలిపారు. సిఒఎఫ్ఐ ఒప్పందం గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికాలో భాగం చేయాలనే ట్రంప్ లక్ష్యాన్ని నెరవేరుస్తుందని అన్నారు. వెనిజులా అధ్యక్షుడు మదురోను నిర్బంధించిన అనంతరం గ్రీన్‌ల్యాండ్‌పై సుమారు రెండు నెలల్లో నిర్ణయం ప్రకటిస్తానని ట్రంప్ ఆదివారం వెల్లడించిన సంగతి తెలిసిందే.

# ఉగ్రవాదులకు అడ్డాగా పాక్

**పాకిస్థాన్‌లో లష్కరే, హమాస్ నాయకుల సమావేశం**

**సంచలన వీడియో వైరల్**

**ఇస్లామాబాద్:** ఉగ్రవాదాన్ని పెంచి పోషించడంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన పాకిస్థాన్ నైజం మరోసారి బయటపడింది. ఉగ్రవాద సంస్థ లష్కరే తొయిబా, హమాస్ నేతలు ఇటీవల పాకిస్థాన్‌లోని గుజ్రాన్‌వాలాలో సమావేశమయ్యారు. పాకిస్థాన్ మర్కజే ముస్లిం లీగ్ (పీఎంఎంఎల్) నిర్వహించిన ఈ సమావేశంలో హమాస్ సీనియర్ కమాండర్ నాజీ జహీర్ హాజరయ్యాడు. లష్కరే కమాండర్ రషీద్‌అలీ సంధుతో భేటీ అయ్యాడు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అమెరికా నిషేధించిన రెండు ఉగ్రవాద సంస్థలు ఒకేచోట సమవేశం కావడం సంచలనవుతుండగా, రెండు ఉగ్రవాద గ్రూపుల మధ్య సంబంధాలను బలోపేతం చేసుకోవడమే ముఖ్య ఉద్దేశంగా ఈ సమావేశం జరిగినట్టు తెలుస్తోంది. అమెరికా నిషేధించిన రెండు ఉగ్రవాద సంస్థలు ఒకేచోట సమవేశం కావడం సంచలనవుతుండగా, రెండు ఉగ్రవాద గ్రూపుల మధ్య సంబంధాలను బలోపేతం చేసుకోవడమే



ముఖ్య ఉద్దేశంగా ఈ సమావేశం జరిగినట్టు తెలుస్తోంది.

**పాకిస్థాన్‌తో జహీర్ సంబంధాలు**

పాకిస్థాన్‌తో నాజీ జహీర్‌కు ఉన్న సంబంధాలు కొత్తవి కావు. 2025లో ఆయన పలువురు హమాస్ నేతలతో కలిసి పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) వెళ్లాడు. ఇది పహల్గాం ఉగ్రదాడికి ముందు జరిగింది. పీఓకే పర్యటన సందర్భంగా భారత వ్యతిరేక ర్యాలీలో లష్కరే తొయిబా, జైషే మొహమ్మద్ కమాండర్లతో కలిసి జహీర్ పాల్గొన్నాడు. 2024 జనవరిలో కరాచీని జహీర్ సందర్శించాడు. 2024 ఏప్రిల్‌లో ఇస్లామాబాద్ పర్యటించాడు. ఇస్లామాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ సన్మానం అందుకున్నాడు. ఇవేకాకుండా, 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌లో హమాస్ ఉగ్రదాడి జరిపిన తర్వాత వారం రోజులకు నాజీ జహీర్ పాకిస్థాన్‌కు వెళ్లాడు. జమియత్ ఉలేమా-ఇ-ఇస్లాం అధిపతి మౌలానా ఫజల్ ఉర్ రెహ్మాన్‌ను కలిశాడు.

# చిరుధాన్యాలతో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు..



ప్రస్తుతం మారుతున్న జీవనశైలిలో అనారోగ్యకర ఆహారపు అలవాట్లకు అలవాటుపడ్డారు జనాలు. దీంతో కొత్త కొత్త రోగాలు వస్తున్నాయి. డయాబెటీస్, ఉబకాయం,అధిక రక్తపోటు, కిడ్నీ సంబంధిత వ్యాధులు ఇలా ఒకటి కాదు రెండు కాదు ఏదో ఒక కారణంతో ఆస్పత్రుల్లో తీరగాల్సి వస్తుంది. మనం తినే ఆహారంలో చిరుధాన్యాలు తీసుకుంటే థైరాయిడ్, మూత్రపిండాలు, యూరిక్ యాసిడ్, కాలేయ వ్యాధులు, ప్యాంక్రియాటిక్ వంటి వ్యాధులకు చెక్ పెట్టొచ్చని అంటున్నారు నిపుణులు.

## చిరుధాన్యాలతో కలిగే ప్రయోజనాలు:

డయాబెటీస్ కంట్రోల్: చిరుధాన్యాలలో 'గ్లెసెమిక్ ఇండెక్స్' తక్కువగా ఉండటం వల్ల ఇవి రక్తంలోని చెక్కర స్థాయిలను పెరగనీయకుండా చూస్తాయి.

అధికబరువు తగ్గడం: వీటిలో పీచు పదార్థం (ఖీఱఎవతీ) ఎక్కువగా ఉండటం వల్ల త్వరగా ఆకలి వేయడం, బరువు తగ్గడం సులభమవుతుంది.

గుండె ఆరోగ్యం: చిరుధాన్యాలలో పొటాషియం, మెగ్నీషియం అధికంగా ఉండటం వల్ల అధిక రక్తపోటు(ధ్రీా) నియంత్రణలో ఉంటుంది, చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది.

జీర్ణక్రియ: పీచు పదార్థం వల్ల మలబద్ధకం సమస్యలు దూరమవుతాయి, జీర్ణ వ్యవస్థ శుభ్రపడుతుంది.

గ్లూటెన్ ఫ్రీ: గోధుమలు(+శ్రీబ్వఅ ఖశ్రీ–శ్రీవతీస్త్రఎ) పడని వారు చిరుదాన్యాలు తీసుకొని ఆరోగ్యాన్ని చక్కగా కాపాడుకోవచ్చు.

ఎలా తీసుకోవాలి:

చిరుధాన్యాలను వండుకునే ముందు కనీసం 6 నుంచి 8 గంటలు నానెబెట్టాలి. దీనివల్ల వాటిలో ఉన్న పోషకాలు శరీరానికి బాగా అందుతాయి. చిరుధాన్యాలను అన్నం,రొట్టెలు,ఇడ్లీ,దోష లేదా గంజిగా కూడా తీసుకోవచ్చు.

## చిరుధాన్యాల రకాలు:

కొర్రలు: డయాబెటీస్ ఉన్నవారికి కొర్రలు మంచి ఆహారం. శరీరంలోని కొలెస్ట్రాల్ లేకుండా చూస్తుంది. నరాలకు శక్తినిస్తుంది, మానసికంగా ధృఢంగా ఉండేలా చేస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లను పుష్కలంగా ఇస్తాయి.

అరికెలు: రక్తహీనత, బలహీనతగా ఉన్నవాళ్లకు అరికెలు ఒక గొప్ప వరం అనే చెప్పాలి. మలబద్ధకం, షుగర్ వంటి సమస్యలతో బాధపడేవారికి అరికెలు రోజూ తింటే ఎంతో ఆరోగ్యం. మంచి నిద్ర పడుతుంది, రక్తాన్ని శుద్ధి చేస్తుంది.

ఊదలు: ఇవి జీర్ణాశయానికి ఎంతో మేలు చేస్తాయి. చిన్న పెగు, పెద్ద పేగుల ఆరోగ్యాన్ని కాపాడతాయి. క్యాన్సర్ వంటి మహమ్మారి దగ్గరకు రాకుండా చూస్తుంది. రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. డయాబెటీస్ ఉన్నవారు ఊదలను తమ ఆహారంలో భాగంగా చేసుకోవచ్చు.

సామలు: అజీర్తి ఉన్నవారికి సామలు ఒక వరం అనే చెప్పొచ్చు. అతిసారం, అజీర్ణం, సుఖవ్యాధులు, అడవారి రుతు సమస్యలకు సామలు మంచి పరిష్కారాన్ని చూపిస్తాయి. మైగ్రెన్ నుంచి త్వరగా ఉపశమనం ఇస్తాయి. గుండె సంబంధిత సమయస్యలను పరిష్కరిస్తుంది. ఉబకాయం,కీళ్ల నొప్పులతో బాధపడేవారు సామలు తింటే చక్కటి ఆరోగ్యాన్ని పొందుతారు.



### చలికాలంలో మోకాళ్ల నొప్పులు ఎందుకు వస్తాయి?

# కారణాలు తెలుసుకోండి

శీతాకాలంలో మోకాలి నొప్పి పెరుగుతుంది. ఒకప్పుడు ఇది వృద్ధులకు మాత్రమే ఉండేది, కానీ ఇప్పుడు యువతలో కూడా కనిపిస్తుంది. మోకాళ్లలో గట్టిదనం, లేచినప్పుడు లేదా కూర్చున్నప్పుడు నొప్పి, లేదా నడుస్తున్నప్పుడు ఇబ్బందిగా ఉండటం శీతాకాలంలో సర్వసాధారణంగా మారాయి. అయితే, ఈ సీజన్‌లో మోకాళ్ల నొప్పులు ఎందుకు వస్తాయి? దీని వెనుక కారణాలు ఏంటి? దానిని ఎలా తగ్గించుకోవాలి? అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం..

ఆరోగ్య నిపుణుల ప్రకారం, చల్లని వాతావరణంలో ఉష్ణోగ్రత తగ్గడం వల్ల రక్త ప్రసరణ నెమ్మదిస్తుంది. చలి కారణంగా మన రక్త నాళాలు కుంచించుకుపోతాయి. దీని కారణంగా తగినంత రక్తం, ఆక్సిజన్.. మోకాలు, కీళ్ళను చేరుకోలేవు. ఇది కీళ్ల వశ్యతను ప్రభావితం చేస్తుంది. నొప్పితో పాటు దృఢత్వం పెరుగుతుంది. ఆస్టియో ఆర్థరైటిస్ కూడా మోకాలి నొప్పికి ఒక ప్రధాన కారణం. ఇది వయస్సు పెరుగుతున్న కొద్దీ ఎక్కువగా కనిపిస్తుంది. మోకాళ్ల మధ్య ఉన్న మృదులాస్థి క్రమంగా అరిగిపోవడం ప్రారంభమవుతుంది. చల్లని వాతావరణంలో మృదులాస్థి, చుట్టుపక్కల కండరాలు గట్టిగా మారుతాయి. దీని కారణంగా నొప్పి ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికే మోకాలి సమస్యలు ఉన్నవారు శీతాకాలంలో ఎక్కువ నొప్పిని అనుభవిస్తారు.

శీతాకాలంలో శారీరక శ్రమ తగ్గడం వల్ల మోకాళ్ల నొప్పులు పెరుగుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. చలి కారణంగా ప్రజలు వ్యాయామం, నడక లేదా యోగా చేయడం తగ్గిస్తారు. ఇది కండరాలను బలహీనపరుస్తుంది. మోకాళ్లకు మద్దతు ఇచ్చే కండరాలు బలహీనపడినప్పుడు, కీళ్లపై ఎక్కువ ఒత్తిడి ఉంటుంది. నొప్పి పెరుగుతుంది. ఇంకా, చల్లని వాతావరణం శరీరంలో విటమిన్ డి లోపానికి కారణమవుతుంది. ఎముకలు, కీళ్ల బలానికి విటమిన్ డి చాలా అవసరం. విటమిన్ డి లోపం మోకాలి నొప్పికి కారణమవుతుంది.

శీతాకాలంలో మోకాళ్ల నొప్పులను నివారించడానికి మీ మోకాళ్లను వెచ్చగా ఉంచుకోవడం, తేలికపాటి వ్యాయామం చేయడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, ఎండలో సమయం గడపడం చాలా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. నొప్పి తగ్గకపోతే, నడవడం కష్టంగా మారితే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించండి. వైద్యుడు సూచించిన మందులను సకాలంలో తీసుకోండి.



### పసిపిల్లల విషయంలో ఈ లక్షణాలను

# నిర్లక్ష్యం చేయకండి.!

దేశంలోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. ఢిల్లీతో సహా అనేక రాష్ట్రాలు ప్రస్తుతం తీవ్రమైన చలిని ఎదుర్కొంటున్నాయి. ఈ చలి వాతావరణం నవజాత శిశువులకు మరింత ప్రమాదకరంగా మారుతుంది. ఎందుకంటే, నవజాత శిశువులకు రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. దీని వల్ల వారు జలుబుకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అయితే, పసిపిల్లలు తమ సమస్యను చెప్పలేకపోతారు కాబట్టి వారి ప్రవర్తన, శారీరక మార్పులపై శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం.

నవజాత శిశువుల్లో జలుబు ప్రారంభ లక్షణాలను ముందుగానే గుర్తిస్తే తీవ్రమైన సమస్యలను నివారించవచ్చు. అందువల్ల చిన్నారుల తల్లిదండ్రులు వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి. నవజాత శిశువుల్లో జలుబు లక్షణాలను ఎలా గుర్తించాలో ఇప్పుడు తెలుసుకుందాం..

## నవజాత శిశువుల్లో జలుబు లక్షణాలు ఏంటి?

శిశువు చేతులు, కాళ్లు చల్లగా ఉండటం, చర్మం పాలిపోయినట్టు లేదా కొద్దిగా నీలం రంగులో కనిపించడం వంటి లక్షణాలు ఉండవచ్చు. శరీర ఉష్ణోగ్రత సాధారణం కంటే తక్కువగా ఉండటం కూడా ఒక సూచన. అలాగే, బిడ్డ ఏడుస్తున్నప్పుడు వేగంగా శ్వాస తీసుకోవడం, తరచుగా తుమ్మడం, ముక్కు మూసుకుపోవడం వంటి సమస్యలు కూడా రావచ్చు. మీ బిడ్డకు ఈ లక్షణాల్లో ఏవైనా కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. సమయానికి చికిత్స చేయకపోతే సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంటుంది.

## నవజాత శిశువులను ఎలా చూసుకోవాలి?

శీతాకాలంలో చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. బిడ్డకు ఎప్పుడూ వెచ్చగా ఉండే దుస్తులు వేయాలి. సమయానికి తల్లిపాలు ఇవ్వడం చాలా ముఖ్యం. ఉదయం స్నానం చేయించిన తర్వాత బిడ్డను కాసేపు ఎండలో కూర్చోనివ్వాలి. ఇది ఆరోగ్యానికి మంచిది. చల్లని గాలి పడకుండా చూడాలి. ఫ్యాన్ లేదా ఏసీకి దూరంగా ఉంచాలి. ఏవైనా ఆరోగ్య సమస్యల లక్షణాలు కనిపిస్తే ఇంట్లో మందులు వేసి సొంత వైద్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

### మలబద్ధకం సమస్య తగ్గాలంటే ఇలా తయారు చేసిన పెరుగును తినాలి..

# ఎంతో మేలు చేస్తుంది..

ప్రస్తుత కాలంలో మనల్ని ఇబ్బంది పెడుతున్న జీర్ణ సంబంధిత సమస్యల్లో మలబద్ధకం సమస్య కూడా ఒకటి. ఇది ఒక సాధారణ సమస్య అయినప్పటికీ దీనిని నిర్లక్ష్యం చేయడం వల్ల అనేక జీర్ణ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. మన దేశంలో దాదాపు 22 శాతం మంది మలబద్ధకంతో బాధపడుతున్నారు. 13 శాతం మంది తీవ్రమైన మలబద్ధకం సమస్యతో బాధపడుతున్నారని సర్వేలు చెబుతున్నాయి. ఫైబర్ కలిగిన ఆహారాలను తక్కువగా తీసుకోవడం, నీటిని తక్కువగా తాగడం, శారీరక శ్రమ లేకపోవడం, జీవనశైలిలో వచ్చిన మార్పుల కారణంగా ఈ సమస్య తలెత్తుతుంది. చాలా మంది ఈ సమస్య నుండి బయటపడడానికి మందులను వాడుతూ ఉంటారు. అయితే తరచూ ఈ మందులను వాడడం అంత మంచి పద్దతి కాదు. మలబద్ధకం సమస్యతో బాధపడే వారు మందులను వాడడానికి బదులుగా జీవనశైలిలో, ఆహార పద్దతుల్లో మార్పులు చేసుకోవాలి. మలబద్ధకంతో బాధపడే వారు ముఖ్యంగా ఎండుద్రాక్షలను పెరుగుతో కలిపి తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. మలబద్ధకాన్ని తగ్గించే సులభమైన, సహజమైన మార్గాలల్లో ఇది ఒకటి. దీని వల్ల మబద్ధకం సమస్య తగ్గడంతో మొత్తం శరీరానికి కూడా మేలు కలుగుతుందని వారు తెలియజేస్తున్నారు. ఇక ఎండుద్రాక్షలను పెరుగుతో ఎలా తీసుకోవాలి.. అలాగే దీనిని తీసుకోవడం వల్ల మనకు కలిగే ఇతర ప్రయోజనాల గురించి వైద్యులు వివరిస్తున్నారు.

## ఇలా తయారు చేయాలి..

ఎండుద్రాక్ష పెరుగును తయారు చేసుకోవడానికి ఒక గిన్నెలో తాజా గోరు వెచ్చని పాలను తీసుకోవాలి. తరువాత ఇందులో 4 లేదా 5 నల్ల ఎండుద్రాక్షలను వేయాలి. తరువాత ఇందులో తోడుకు సరిపోయేలా ఒక చుక్క పెరుగు వేసి బాగా కలపాలి. తరువాత



మూత పెట్టి రాత్రంతా కదిలించకుండా ఉంచాలి. మరుసటి ఈ పాలు పెరుగుగా మారతాయి. ఇలా తయారు చేసిన ఎండుద్రాక్ష పెరుగును భోజనంతో పాటుగా తీసుకోవచ్చు లేదా స్నాక్ గా కూడా తీసుకోవచ్చు. పిల్లలకు కూడా ఈ పెరుగును ఆహారంగా ఇవ్వవచ్చు. ఇలా తయారు చేసిన ఎండుద్రాక్ష పెరుగును తీసుకోవడం వల్ల మనం వివిధ రకాల ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

## జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా..

ఎండుద్రాక్షలో కరిగే ఫైబర్ ఉంటుంది. పెరుగు ప్రోబయోటిక్ గా పని చేస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల పొట్ట ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇందులో ఉండే ఫైబర్ మలబద్ధకం సమస్యను తగ్గించడంలో సహాయపడుతుంది. ఎండుద్రాక్షను, పెరుగును కలిపి తీసుకోవడం వల్ల పొట్టలో చెడు బ్యాక్టీరియా శాతం తగ్గుతుంది. మంచి బ్యాక్టీరియా శాతం పెరుగుతుంది. దీంతో ఇన్ఫెక్షన్ లు రాకుండా ఉంటాయి. అలాగే దీనిని తీసుకోవడం వల్ల గ్యాస్ సమస్య తగ్గుతుంది. కడుపులో మంట సమస్యతో బాధపడే వారు ఇలా తయారు చేసిన పెరుగును తీసుకోవడం వల్ల పొట్టకు శాంతత లభిస్తుంది. కడుపులో మంట తగ్గుతుంది.

## నోటి ఆరోగ్యానికి కూడా..

అంతేకాకుండా ఎండుద్రాక్ష, పెరుగును కలిపి తీసుకోవడం వల్ల దంతాల, చిగుళ్ల ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఎముకల దృఢంగా మారతాయి. కీళ్ల నొప్పులు తగ్గుతాయి. ఎండుద్రాక్ష పెరుగును తీసుకోవడం వల్ల శరీర బరువు అదుపులో ఉంటుంది. కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటాయి. పిల్లలకు ఈ పెరుగును ఇవ్వడం వల్ల వారిలో ఎదుగుదల చక్కగా ఉంటుంది. ఈ విధంగా ఎండుద్రాక్షలతో చేసిన పెరుగు మలబద్ధకం సమస్యను తగ్గించడంతో పాటు మొత్తం ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుందని దీనిని తరచూ తీసుకోవడం వల్ల పొట్ట సంబంధిత సమస్యలు రాకుండా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు.

# రాజానగరానికి 'జూ' కళ!

- దివాన్ చెరువులో జూపార్కు ఏర్పాటుకు కసరత్తు
- 250 హెక్టార్లలో సహజసిద్ధమైన పార్కు
- కేంద్ర బృందంతో కలిసి స్థలాన్ని పరిశీలించిన ఎంపీ పురంధేశ్వరి
- పర్యావరణ శాఖ సానుకూలత.. త్వరలోనే కార్యాచరణ



**రాజానగరం, జనవరి 7:**

ప్రకృతి ప్రేమికులను, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునేలా తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో త్వరలోనే భారీ జూపార్కు ఏర్పాటు కానుంది. ఈ మేరకు ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి నేతృత్వంలో కేంద్ర బృందం బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన జరిపింది. ఈ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి సానుకూల స్పందన లభించడంతో రాజానగరం పర్యాటక చిత్రపటంలో చేరనుంది. రాజానగరం మండల పరిధిలోని దివాన్ చెరువులో ఉన్న రిజర్వ్ ఫారెస్ట్ భూములను ఎంపీ పురంధేశ్వరి, ఢిల్లీ నుంచి వచ్చిన సెంట్రల్ జూ అథారిటీ అధికారుల బృందం పరిశీలించింది. ఈ ప్రాంత భౌగోళిక పరిస్థితులు, అటవీ విస్తీర్ణం, నీటి లభ్యత, పర్యావరణ అనుకూలత వంటి అంశాలపై అధికారులతో కలిసి ఎంపీ అధ్యయనం చేశారు.

ఈ సందర్భంగా ఎంపీ పురంధేశ్వరి మాట్లాడుతూ.. రాజానగరంలో మొత్తం 311 హెక్టార్ల రిజర్వ్ ఫారెస్ట్ ఏరియా అందుబాటులో ఉందన్నారు. ఇందులో సుమారు 250 హెక్టార్ల భూమిని జూపార్కు కోసం వినియోగించుకునే అవకాశం ఉందని తెలిపారు. జంతువులు, పక్షులను బోనుల్లో బంధించినట్లు కాకుండా, అవి స్వేచ్ఛగా తిరిగేలా సహజ వాతావరణంలోనే (సఫారీ తరహాలో) ఈ జూపార్కును అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. జూపార్కు ప్రతిపాదనను కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారని ఎంపీ తెలిపారు. సాధ్యాసాధ్యాల పరిశీలన కోసం ఆఫీసర్ బెన్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి బృందాన్ని పంపినట్లు చెప్పారు. పరిశీలన అనంతరం ఈ ప్రదేశం జూపార్కుకు అన్ని విధాలా అనుకూలమని బృందం నిర్ధారించిందని, త్వరలోనే దీనికి సంబంధించిన కార్యాచరణ రూపొందిస్తామని ఆమె వెల్లడించారు. ప్రజలు కూటమి ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, సెంట్రల్ జూ అథారిటీ సభ్య కార్యదర్శి డా. వి. క్లెమెంట్ బెన్, వన్యప్రాణి విభాగం ఐజీ అజయ్, రాజమహేంద్రవరం డీఎఫ్ఓ బి. ప్రభాకర రావు, రాష్ట్ర సిల్వికల్చరిస్ట్ ఆర్. శ్రీనివాస్, ఎఫ్ఆర్ఓ దావీద్ రాజు, పద్మావతి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ లత, ఎఫ్‌బీఓ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# పులికాట్ తీరాన.. విదేశీ విహంగాల జాతర!



- 10, 11 తేదీలలో అట్టహాసంగా 'ఫ్లెమింగో ఫెస్టివల్'
- సాహస క్రీడలు, జలపాతాల సందడి.. ఉచిత బస్సుల ఏర్పాటు
- విస్తృత ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం
- పర్యాటకులు తరలిరావాలని కలెక్టర్, ఎమ్మెల్యే పిలుపు

**సూళ్లూరుపేట, జనవరి 7 :**

ఆంధ్రప్రదేశ్ పర్యాటక ముఖచిత్రమైన పులికాట్ సరస్సు తీరం మరోసారి పండుగ శోభను సంతరించుకోనుంది. పక్షుల కిలకిలరావాలు, ఆహ్లాదకరమైన వాతావరణం నడుమ జనవరి 10, 11 తేదీలలో 'ఫ్లెమింగో ఫెస్టివల్'ను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. గతేడాది కంటే మిన్నగా, మరింత వైభవంగా ఈ వేడుకలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ వెల్లడించారు. బుధవారం సూళ్లూరుపేటలోని జెడ్పీ హైస్కూల్ మైదానంలో ఏర్పాట్లపై నిర్వహించిన మీడియా సమావేశంలో కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే మాట్లాడారు. ఈసారి ఫెస్టివల్‌లో పర్యాటకులకు సరికొత్త అనుభూతిని పంచేలా అధికారులు చర్యలు చేపట్టారు.

### ముఖ్య ప్రదేశాలు

నేలపట్టు పక్షుల అభయారణ్యం, ఆటకాని తిప్ప, బి.వి. పాలెం పాయింట్‌లతో పాటు కొత్తగా ఉబ్బలమడుగు జలపాతం, ఇరుక్కం ఐల్యాండ్‌లలో కూడా వేడుకలు నిర్వహిస్తున్నారు. బి.వి. పాలెం వద్ద పారా గ్లైడింగ్, హాట్ ఎయిర్ బెలూన్ వంటి అడ్వెంచర్ స్పోర్ట్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. మత్స్యకారులకు ఉపాధి కల్పించేలా.. 40 నిమిషాల బోటింగ్ కు రూ.30, ఇరుక్కం ఐల్యాండ్ కు రానుపోను రూ.100 గా ధరలు నిర్ణయించారు. సందర్శకుల సౌకర్యార్థం నేలపట్టు, సూళ్లూరుపేట, బి.వి. పాలెం ప్రాంతాల నుంచి ఉచిత బస్సులను నడపనున్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన కల్పించేందుకు రెండు రోజుల పాటు ప్రభుత్వ ఖర్చులతో సుమారు 6 వేల మంది విద్యార్థులను ఫెస్టివల్‌కు తీసుకురానున్నారు.

### డ్రోన్ నిఘా - పటిష్ట భద్రత

జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ.. పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఫెస్టివల్ జరిగే అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా ఉంచుతామని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కలెక్టర్ ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు జరిగాయన్నారు. గతంలో కంటే భిన్నంగా ఈసారి ఇరుక్కం ఐల్యాండ్, ఉబ్బలమడుగులోనూ కార్యక్రమాలు ఉన్నాయని, పర్యాటకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వంశీ, వెంకటగిరి డీఎఫ్ఓ శ్రీకాంత్, ఆర్డీవోలు శ్రీకాళహస్తి, భానుప్రకాష్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ శ్రీమంత్ రెడ్డి, పాల్గొన్నారు.

# వైద్య విద్యలో గుజరాత్ తరహా విధానం

- అంతర్జాతీయ ప్రమాణాలతో సామాన్యులకు వైద్య విద్య
- కార్పొరేట్ సంస్థలకు పీపీపీ విధానంలో అవకాశం
- ఎంబీబీఎస్ సీట్లతో సమానంగా పీజీ సీట్లు చేస్తాం
- జాతీయ వైద్య కమిషన్ చైర్మన్ డాక్టర్ అభిజత్ చంద్రకాంత్ సేథ్



**విజయవాడ, జనవరి 7:**

వైద్య విద్యను సామాన్యులకు చేరువ చేస్తూనే, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించడమే జాతీయ వైద్య కమిషన్ లక్ష్యమని ఆ కమిషన్ చైర్మన్ డాక్టర్ అభిజత్ చంద్రకాంత్ సేథ్ తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కృత్రిమ మేధ, డిజిటల్ హెల్త్ కేర్ వంటి ఆధునిక సాంకేతికతను వైద్య విద్యలో జోడిస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో ఉపకులపతి డాక్టర్ పి. చంద్రశేఖర్ తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అంతకుముందు ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో భేటీ అయి వైద్య విద్యకు సంబంధించి పలు కీలక అంశాలపై చర్చించినట్లు ఆయన తెలిపారు.

వైద్య విద్యలో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య విధానంపై డాక్టర్ సేథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గుజరాత్ రాష్ట్రంలో ఈ విధానం ఇప్పటికే విజయవంతంగా అమలవుతోందని, దానినే దేశవ్యాప్తంగా విస్తరించే యోచనలో ఉన్నామన్నారు. గతంలో కేవలం లాభాపేక్ష లేని సంస్థలకే అనుమతి ఉండగా, ఇకపై లాభాపేక్ష ఉన్న కార్పొరేట్ కంపెనీలు కూడా పీపీపీ పద్ధతిలో వైద్య కళాశాలలు ఏర్పాటు చేసుకునేలా నిబంధనలు సవరించినట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలు కలిసి పనిచేయడం వల్ల వనరులను సమర్థవంతంగా వాడుకోవచ్చని చెప్పారు. పీపీపీ పద్ధతిలో నడిచే ఆసుపత్రులు ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయి కాబట్టి రోగులకు ఉచిత లేదా రాయితీపై వైద్యం అందుతుందని ఆయన స్పష్టం చేశారు. అలాగే వైద్య కళాశాలల గుర్తింపు ప్రక్రియను సరళతరం చేస్తామని, కౌన్సెలింగ్ ప్రక్రియలో జాప్యం లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కేవలం బయోమెట్రిక్ హాజరే కాకుండా నాణ్యతే ప్రమాణంగా గుర్తింపు ఇస్తామని, వైద్య విద్యలో నాణ్యత పెంచేందుకు క్లినికల్ పరిశోధనలను తప్పనిసరి చేయడంతో పాటు కొత్తగా పీహెచ్‌డీ స్పెషాలిటీ కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు.

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం అండర్ గ్రాడ్యుయేట్ సీట్లతో పోలిస్తే పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లు నలభై శాతమే ఉన్నాయని, రాబోయే రోజుల్లో వీటిని ఎంబీబీఎస్ సీట్లతో సమానంగా పెంచే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. తాలూకా స్థాయి ఆసుపత్రుల్లో వైద్యుల కొరత తీర్చేందుకు ఫ్యామిలీ మెడిసిన్ విధానం తీసుకువస్తున్నామని, దీని ద్వారా సుమారు ఐదు వందల సీట్లు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు శత జయంతిని పురస్కరించుకుని జనవరి పన్నెండున విశ్వవిద్యాలయ రీసెర్చ్ డే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ప్రభుత్వ వైద్య కళాశాలకు పరిశోధనల కోసం ఏటా యాభై లక్షల రూపాయలు, క్రీడల కోసం ఇరవై ఐదు లక్షల రూపాయలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఈ విలేకరుల సమావేశంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఇ. లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

# పిఠాపురంలో సంక్రాంతి శోభ

### రేపటి నుంచి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన

### పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

### కాకినాడలో శాంతి భద్రతలపై సమీక్ష



**పిఠాపురం, జనవరి 7:**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు మూడు రోజుల పర్యటన నిమిత్తం తన సొంత నియోజకవర్గమైన పిఠాపురానికి రానున్నారు. గురువారం రాత్రికి ఆయన పిఠాపురం చేరుకుంటారు. శుక్రవారం ఉదయం పీఠికాపుర సంక్రాంతి మహోత్సవం పేరిట నిర్వహించనున్న ముందస్తు సంక్రాంతి సంబరాల్లో ఆయన పాల్గొంటారు. ఉదయం పది గంటల ముప్పై నిమిషాలకు ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాల మైదానానికి చేరుకుని సంక్రాంతి సంబరాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం ఉదయం పదకొండున్నర గంటలకు నియోజకవర్గ పరిధిలో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. ఆ తర్వాత సంక్రాంతి మహోత్సవంలో పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలు, అక్కడ ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను తిలకిస్తారు. శుక్రవారం సాయంత్రం పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల ముంపునకు గురైన ఇందిరానగర్ కాలనీ, రైల్వే స్టేషన్ సమీపంలోని మోహన్ నగర్ ప్రాంతాలను సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకుంటారు.

పర్యటనలో భాగంగా శనివారం ఉదయం గొల్లప్రోలు ప్రాంతంలోని ఇళ్ళ స్థలాలను ఉప ముఖ్యమంత్రి పరిశీలిస్తారు. అక్కడి నుంచి ఉదయం పదిన్నరకు కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకుని జిల్లాలోని శాంతి భద్రతల పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు కాకినాడలోని రంగరాయ మెడికల్ కళాశాలకు చేరుకుని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. పవన్ కళ్యాణ్ పర్యటన నేపథ్యంలో అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు.

పిఠాపురం వేదికగా మూడు రోజులపాటు నిర్వహించనున్న సంక్రాంతి సంబరాలు ఆద్యంతం తెలుగుదనం ఉట్టిపడేలా సాగనున్నాయి. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. మొదటి రోజు సంక్రాంతి అనగానే గుర్తుకు వచ్చే హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, జానపద గీతాలాపనలు, వీర నాట్యాలు, ఉరుముల నృత్యాలు, తప్పెట గుళ్ళు, గరగు నృత్యాలు, లంబాడ నృత్యం, డప్పులు, గిరిజన సంప్రదాయ నృత్యరీతి అయిన థింసా, అలాగే కూచిపూడి, భరతనాట్యం తదితర శాస్త్రీయ నాట్య ప్రదర్శనలు, కోలాటాలు ఏర్పాటు చేశారు. రెండో రోజు జనవరి పదో తేదీన మొదటి రోజు ప్రదర్శనలతోపాటు కేరళ సంప్రదాయ మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శనలు ఉంటాయి. చివరి రోజు గ్రామీణ జానపదుల పాటలు, సినీ మ్యూజికల్ నైట్ కార్యక్రమాలు ఆహుతులను అలరించనున్నాయి.

# ఆంధ్రప్రదేశ్‌ను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారుస్తాం

### క్లీన్ ఎనర్జీలో దేశానికే దిక్సూచిగా రాష్ట్రం - 160 గిగావాట్ల ఉత్పత్తి లక్ష్యం

### నెడ్‌క్యాప్ ఎండీ డాక్టర్ కమలాకర్ బాబు

### విజయవాడలో ఘనంగా ప్రకాష్‌మయ్ ఎనర్షియా అవార్డుల ప్రదానం




**విజయవాడ, జనవరి 7:**

రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, క్లీన్ ఎనర్జీ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశానికి మార్గదర్శకంగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని నెడ్‌క్యాప్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి. కమలాకర్ బాబు తెలిపారు. విజయవాడలోని లెమన్ ట్రీ హోటల్‌లో బుధవారం జరిగిన ప్రకాష్‌మయ్ ఎనర్షియా అవార్డ్స్ రెండు వేల ఇరవై ఆరు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వివిధ రంగాల్లో గ్రీన్ ఎనర్జీ కోసం విశేష కృషి చేసిన ఇరవై రెండు మందికి ఈ సందర్భంగా అవార్డులను అందజేసి సత్కరించారు. వివిధ రాష్ట్రాలు, పునరుత్పాదక ఇంధన నోడల్ ఏజెన్సీలు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలు చేస్తున్న కృషిని గుర్తించి ఈ పురస్కారాలను అందించినట్లు ఆయన వెల్లడించారు.

ఈ సందర్భంగా డాక్టర్ కమలాకర్ బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అక్టోబర్ రెండు వేల ఇరవై నాలుగులో ప్రభుత్వం నూతన ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీని ప్రకటించిందని గుర్తు చేశారు. ఈ పాలసీ ద్వారా రాష్ట్రంలో నూట అరవై గిగావాట్ల క్లీన్ ఎనర్జీ ఉత్పత్తిని సాధించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. భారత ప్రభుత్వం రెండు వేల ముప్పై నాటికి నిర్దేశించిన ఐదు వందల గిగావాట్ల పునరుత్పాదక ఇంధన లక్ష్యానికి అనుగుణంగా, అలాగే స్వర్ణాంధ్ర ప్రదేశ్ రెండు వేల నలభై ఏడు విజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ గ్రీన్ పాలసీ విధానాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. ఈ విధానం కింద గాలి విద్యుత్, సౌర విద్యుత్, హైబ్రిడ్ ప్రాజెక్టులు, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ వంటి ఆధునిక వనరుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు.

ఇప్పటివరకు ఎనభై మూడు గిగావాట్ల సామర్థ్యానికి అనుమతులు మంజూరు చేయగా, ఈ రంగంలో సుమారు ఆరు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రావడం రాష్ట్రానికి గర్వకారణమని ఎండీ తెలిపారు. అదేవిధంగా యాభై ఒక గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు సంబంధించిన ఆర్డర్లు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. దేశం నిర్దేశించిన విధంగా రెండు వేల నలభై ఏడు నాటికి నెట్ జీరో కార్బన్ ఉద్గారాల స్థాయికి చేరుకోవాలనే లక్ష్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించిందన్నారు. క్లీన్ ఎనర్జీ విస్తరణ ద్వారా కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇటీవల మహారాష్ట్రలో నిర్వహించిన జాతీయ స్థాయి కార్యక్రమంలో పునరుత్పాదక ఇంధన రంగంలో విశేష ప్రతిభ కనబరిచినందుకు ఏపీకి నాలుగు ప్రతిష్టాత్మక అవార్డులు లభించడం శుభపరిణామమని హర్షం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పర్యవేక్షణలో రాష్ట్ర ఇంధన రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని కమలాకర్ బాబు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు నమ్మకమైన, చౌకైన, నాణ్యమైన విద్యుత్తును అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

# ఇండియాలో మ్యాచ్‌లు ఆడాల్సిందే

## బంగ్లాదేశ్‌కు ఐసీసీ వార్నింగ్!



బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. టీ20 వరల్డ్‌కప్‌లో తమ మ్యాచ్‌లు భారత్ నుంచి శ్రీలంకకు షిఫ్ట్ చేయాలన్న అభ్యర్థనను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) తిరస్కరించినట్లు తెలిసింది. ఈ మేరకు మంగళవారం బీసీబీకి ఐసీసీ స్పష్టం చేసినట్లు సమాచారం. షెడ్యూల్ ప్రకారమే భారత్‌లో వరల్డ్‌కప్ మ్యాచ్‌లు ఆడాలని, లేదంటే పాయింట్లు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించినట్లు తెలుస్తోంది. అయితే దీనిపై అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది. అయితే ఇటీవల భారత్- బంగ్లాదేశ్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు సంచలన నిర్ణయం తీసుకుంది. భద్రతాపరమైన కారణాలు చూపిస్తూ, తమ జట్టు, భారత్‌లో ఆడాల్సిన వరల్డ్‌కప్ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలని ఐసీసీకి లేఖ రాసింది. అయితే ఆ అభ్యర్థననే ఐసీసీ తాజాగా తిరస్కరించినట్లు తెలిసింది. వచ్చే నెలలో భారత్, శ్రీలంక సంయుక్త వేదికలుగా జరగనున్న టీ20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ తమ గ్రూప్ దశ మ్యాచ్‌లన్నీ భారత్‌లోనే ఆడాల్సి ఉంది. అయితే ఇటీవల బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్‌ను బీసీసీఐ ఆదేశాల మేరకు రీసెంట్?గా కేకేఆర్ జట్టు నుంచి వదిలేయండతో ఇరు దేశాల మధ్య వివాదం ముదిరింది. ఎలాంటి వివరణ లేకుండా తమ దేశ ఆటగాడు ముస్తాఫిజుర్‌ను ఐపీఎల్ నుంచి తప్పించడంతో బంగ్లా ఈ నిర్ణయం తీసుకుంది. తమ క్రికెట్ జట్టును భారత్‌కు పంపబోమని బంగ్లా క్రికెట్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. ఈ వివాదాల మధ్యే బంగ్లాదేశ్ ప్రపంచకప్‌నకు తమ జట్టును ప్రకటించింది. 15 మందితో కూడిన బృందం పొట్టి కప్పు టోర్నీలో పాల్గొనన్నట్లు ప్రకటన చేసింది. ఈ జట్టుకు లిట్టన్ దాస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఇందులో ముస్తాఫిజుర్ రహమాన్ కూడా చోటు దక్కించుకున్నాడు. ప్రస్తుతం బంగ్లాలో దేశవాళీ టోర్నీ బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ కొనసాగుతోంది. ఈ లీగ్?లో భారత్‌కు చెందిన రిధిమా పాఠక్ ప్రెజెంటర్‌గా వ్యవహరిస్తున్నారు. అయితే భారత్- బంగ్లాదేశ్ వివాదాల నేపథ్యంలో రిధిమాను కామెంటరీ ప్యానెల్ నుంచి తొలగించారని వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై రిధిమా స్వయంగా క్లారిటీ ఇచ్చారు. తనను తొలగించారని వస్తున్న వార్తలన్నీ అవాస్తవానేనని అన్నారు. ఇరు దేశాల మధ్య ప్రస్తుతం ఉన్న పరిస్థితుల నేపథ్యంలో తానే స్వయంగా ప్యానెల్? నుంచి తప్పుకున్నట్లు క్లారిటీ ఇచ్చారు. 'బంగ్లా ప్రీమియర్ లీగ్ నుంచి నన్ను తొలగించారు అనే ప్రచారం జరుగుతోంది. అయితే అందులో ఎలాంటి నిజం లేదు. బీపీఎల్ నుంచి వైదొలగాలని నేనే వ్యక్తిగతంగా నిర్ణయం తీసుకున్నాను. నాకు దేశమే ముఖ్యం. తర్వాతే ఇంకేదైనా. నిజాయతీ, గౌరవం, అభిరుచితో కొన్ని సంవత్సరాలుగా క్రికెట్‌కు సేవ చేసే అవకాశం నాకు లభించింది. దాన్ని మాత్రం కొనసాగిస్తాను. నాకు మద్దతుగా నిలిచిన వారందరికీ ధన్యవాదాలు' అని రిధిమా సోషల్ మీడియాలో పేర్కొన్నారు.



# బంగ్లాదేశ్ బీభత్సంపై శిఖర్ ధావన్ ఆగ్రహం

బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీల పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. అక్కడ జరుగుతున్న వరుస దాడులు, హత్యలు మానవత్వాన్ని సిగ్గుతో తలదించుకునేలా చేస్తున్నాయి. తాజాగా ఒక హిందూ వితంతువుపై ఇద్దరు వ్యక్తులు సామూహిక అత్యాచారం చేయడమే కాకుండా, ఆమెను చెట్టుకు కట్టేసి జుట్టు కత్తిరించిన ఉదంతం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కిరాతక చర్యపై టీమిండియా మాజీ ఆటగాడు శిఖర్ ధావన్ ఎక్స్ వేదికగా స్పందించారు. "బంగ్లాదేశ్‌లో ఒక హిందూ వితంతువుపై జరిగిన క్రూరమైన దాడి గురించి చదివి నా మనసు వికలమైంది. ఎక్కడైనా, ఎవరిపైనా ఇలాంటి హింసను అంగీకరించలేము. బాధితురాలికి న్యాయం జరగాలని, ఆమెకు తగిన మద్దతు లభించాలని నేను ప్రార్థిస్తున్నాను" అని ధావన్ పోస్ట్ చేశారు. బంగ్లాదేశ్‌లో గత డిసెంబర్ నెల నుంచి హింసాత్మక ఘటనలు పెచ్చుమీరాయి. కేవలం రెండు నెలల వ్యవధిలోనే కనీసం ఆరుగురు హిందూ పురుషులను దారుణంగా హత్య చేసినట్లు నివేదికలు చెబుతున్నాయి. మృతులలో వ్యాపారులు, సామాన్య పౌరులు ఉన్నారు. వీరిని కాల్చి చంపడం లేదా కత్తులతో పొడిచి చంపడం వంటి దారుణాలకు పాల్పడుతున్నారు. తాజాగా వితంతువుపై జరిగిన గ్యాంగ్ రేప్ ఘటన దేశవ్యాప్తంగా మైనారిటీ వర్గాల్లో భయాందోళనలను పెంచింది. మానవ హక్కుల సంఘాల ప్రకారం.. వందలాది హిందూ దేవాలయాలపై దాడులు జరిగాయి, ఆస్తులను లూటీ చేశారు. గతేడాది జూలైలో సింగపూర్‌లో జరిగిన తిరుగుబాటుకు కారకుడైన షరీఫ్ ఉస్మాన్ హాదీ మరణం తర్వాత బంగ్లాదేశ్‌లో రాజకీయ అస్థిరత ఏర్పడింది. అప్పటి నుండి నిరసన ప్రదర్శనలు హింసాత్మకంగా మారాయి. ఈ రాజకీయ అశాంతిని ఆసరాగా చేసుకున్న మతోన్మాద శక్తులు మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నాయి. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం శాంతిభద్రతలను కాపాడటంలో విఫలమైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మైనారిటీలు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బతుకుతున్న పరిస్థితులు అక్కడ నెలకొన్నాయి. శిఖర్ ధావన్ కంటే ముందే మరికొందరు క్రీడాకారులు, ప్రముఖులు బంగ్లాదేశ్‌లో హిందువుల రక్షణ కోసం గొంతు వినిపించారు. అంతర్జాతీయ వేదికలపై కూడా ఈ అంశంపై చర్చ జరుగుతోంది. ఐపీఎల్, ఇతర క్రికెట్ లీగ్స్ విషయంలో ఇప్పటికే భారత్-బంగ్లా మధ్య ఉద్రిక్తతలు ఉన్న తరుణంలో, ధావన్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. క్రీడాకారులు కేవలం ఆటకే పరిమితం కాకుండా, సామాజిక అన్యాయాలపై స్పందించడాన్ని నెటిజన్లు సోషల్ మీడియాలో అభినందిస్తున్నారు.



# వైభవ్ సూర్యవంశీ ఊచకోత..

టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ మరోసారి దుమ్మురేపాడు. అండర్ 19 ప్రపంచకప్‌కు సన్నాహకంగా సౌతాఫ్రికాతో జరుగుతున్న యూత్ వన్డే సిరీస్ మూడో మూడో మ్యాచ్‌లో 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ సెంచరీతో చెలరేగాడు. తనదైన విధ్వంసకర బ్యాటింగ్‌తో 63 బంతుల్లోనే శతకం సాధించాడు. 74 బంతుల్లో 9 ఫోర్లు, 10 సిక్సలతో 127 పరుగులు చేశాడు. అతనికి తోడుగా ఆరోన్ జార్జ్(106 బంతుల్లో 16 ఫోర్లతో 118) సెంచరీతో చెలరేగడంతో ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ అండర్ 19 జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 393 పరుగులు చేసింది. సౌతాఫ్రికా బౌలర్లలో ఎంటాండో సోని(3/61) మూడు వికెట్లు తీయగా.. జాసన్ రోల్స్(2/59) రెండు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ అండర్ 19 జట్టుకు ఓపెనర్లు ఆరోన్ జార్జ్, వైభవ్ సూర్యవంశీ అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. ఆకాశమే హద్దుగా చెలరేగిన వైభవ్ 63 బంతుల్లోనే సెంచరీ మార్క్ అందుకున్నాడు. 171.62 స్ట్రైక్‌రేట్‌తో 10 సిక్సలు, 9 ఫోర్లతో వీరవిహారం చేశాడు. భారీ షాట్ ఆడే క్రమంలో అతను క్యాచ్ ఔటవ్వడంతో తొలి వికెట్‌కు నమోదైన 227 పరుగుల భారీ భాగస్వామ్యానికి తెరపడింది. ఆ కాసేపటికే ఆరోన్ జార్జ్ ఔటవ్వగా.. వేదాంత్ త్రివేది(34), మోహమద్ ఇనామ్(19 బంతుల్లో ఫోర్, 2 సిక్సలతో 28 నాటౌట్) రాణించారు. ఇప్పటికే ఈ సిరీస్‌ను భారత అండర్ 19 టీమ్ 2-0తో కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్ కూడా గెలిచి సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయాలనే పట్టుదలతో ఉంది. ఈ సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ వరుసగా 11, 68, 127 పరుగులతో రాణించాడు. ఈ సిరీస్‌కు ముందు బిహార్ తరఫున విజయ్ హజారే ట్రోఫీ ఆడిన వైభవ్ సూర్యవంశీ.. అరుణాచల్ ప్రదేశ్‌పై 190 పరుగులతో విధ్వంసం సృష్టించాడు. అతని ధాటికి లిస్ట్-ఏ క్రికెట్ చరిత్రలోనే బిహార్ రికార్డ్ స్కోర్ నమోదు చేసింది.

# వరల్డ్‌కప్‌నకు కివీస్ జట్టు ప్రకటన

## శాంట్నర్ కెప్టెన్సీలో బరిలోకి కివీస్



2026 వరల్డ్?కప్?నకు న్యూజిలాండ్ తమ జట్టును ప్రకటించింది. ఈ జట్టుకు మిచెల్ శాంట్నర్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. అయితే ఇటీవల వెస్టిండీస్?తో టెస్టు సిరీస్‌లో అదరగొట్టిన పేసర్ జాకబ్ డఫ్ఫీకి ఈ జట్టులో చోటు దక్కింది. దీంతో 31ఏళ్ల డఫ్ఫీ తొలిసారి తన కెరీర్‌లో వరల్డ్‌కప్ టోర్నీ ఆడనున్నాడు. ఫిన్ అలెన్, మార్క్ చాప్‌మన్, దేవన్ కాన్వే, డారిల్ మిచెల్, టిమ్ సైఫర్ట్‌లతో బ్యాటింగ్ విభాగం పటిష్ఠంగా కనిపిస్తుంది. కాన్వేతోపాటు ఫిన్ అలెన్ ఇన్నింగ్స్ ప్రారంభించే అవకాశం ఉంది. ఇక కెప్టెన్ శాంట్నర్, ఇష్ సోధి, మిచెల్ బ్రేస్‌వెల్, గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర నాలుగురు ఆల్‌రౌండర్లను ఎంపిక చేశారు. ఈ ప్లేయర్లు బ్యాటింగ్‌తోనే కాకుండా బౌలింగ్‌లోనూ రాణించగల సత్తా ఉన్నవాళ్లు. అలాగే మ్యాచ్ హెన్రీ, లాకీ ఫెర్గ్యూసన్, ఆడమ్ మిల్నే, జిమ్మి నీషమ్ లాంటి టాప్ క్లాస్ బౌలర్లతో బౌలింగ్ విభాగం దుర్భేద్యంగా కనిపిస్తుంది. ఈ స్టార్ బౌలర్ల క్యాంప్‌లో ఆర్సీబీ స్టార్ జాకబ్ డఫ్ఫీ ఉండనున్నాడు. అలా బ్యాటింగ్, బౌలింగ్‌లో కివీస్ జట్టు పటిష్ఠంగా కనిపిస్తుంది. ఐపీఎల్ స్టార్ ఫ్రాంచైజీ ఇటీవల అబుదాబి వేదికగా జరిగిన ఐపీఎల్ మినీ వేలంలో జాకబ్ డఫీని రూ.2 కోట్ల బేస్‌ప్రైజ్‌కు దక్కించుకుంది. గతేడాది డిసెంబర్‌లో అతడు వెస్టిండీస్?పై టెస్టు సిరీస్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చుడాడు. ప్రస్తుతం భీకర ఫామ్‌లో ఉన్న డఫీని కివీస్ బోర్డు వరల్డ్‌కప్ ఎంపిక చేసింది. 2025లో డఫీ మొత్తం 39 ఇన్నింగ్స్‌ల్లో 17.11 యావరేజ్‌తో 81 వికెట్లు నేలకూల్చాడు. దీంతో అతడు న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ సర్ రిచర్డ్ హాడ్లీ 40ఏళ్ల రికార్డును బద్దలు కొట్టాడు. రిచర్డ్ హాడ్లీ 1985వ సంవత్సరంలో 29 ఇన్నింగ్స్‌లో 79 వికెట్లు తీసి ఈ రికార్డ్ నెలకొల్పాడు. ఇక ప్రస్తుతం అద్భుతమై ఫామ్?లో ఉన్న డఫీని వరల్డ్‌కప్‌లో తొలి మ్యాచ్‌నుంచే బరిలోకి దింపడం పక్కా!భారత్, శ్రీలంక సంయుక్త వేదికలుగా వచ్చే నెల 07న టీ20 వరల్డ్‌కప్ ప్రారంభం కానుంది. ఫైనల్ మ్యాచ్ 08న జరగనుంది. ఒకవేళ పాకిస్థాన్ ఫైనల్‌కు అర్హత సాధిస్తే శ్రీలంకలో ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది. లేదంటే భారత్‌లోనే తుది పోరు ఉంటుంది. ఈ టోర్నీ కోసం ఇప్పటికే భారత్ సహా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, సౌతాఫ్రికాతో సహా అనేక దేశాలు తమతమ జట్లను ప్రకటించేశాయి. ఇంకా మరికొన్ని జట్లు తమతమ స్క్వాడ్‌లను ప్రకటించాల్సి ఉంది.

వరల్డ్‌కప్‌కు న్యూజిలాండ్ జట్టు : మిచెల్ శాంట్నర్ (కెప్టెన్), ఫిన్ అలెన్, మైఖేల్ బ్రేస్‌వెల్, మార్క్ చాప్‌మన్, డెవాన్ కాన్వే, జాకబ్ డఫీ, లాకీ ఫెర్గూసన్, మాట్ హెన్రీ, డారిల్ మిచెల్, ఆడమ్ మిల్నే, జేమ్స్ నీషమ్, గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, టిమ్ సీఫెర్ట్, ఇష్ సోధి



# న్యూజిలాండ్ వన్డే సిరీస్‌కు సిద్ధమైన శ్రేయస్ అయ్యర్

భారత క్రికెట్ జట్టుకు శుభవార్త, ఎందుకంటే వన్డే జట్టు వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఫిట్ అని ప్రకటించారు. జనవరి 11 నుంచి ప్రారంభం కానున్న భారత్-న్యూజిలాండ్ వన్డే సిరీస్‌లో అయ్యర్ ఆడవచ్చు. BCCI భారత జట్టులో చేర్చింది, అయితే శ్రేయస్ అయ్యర్ ఆడటం అతని ఫిట్‌నెస్ ఆధారంగా ఉంటుందని కూడా చెప్పింది. దైనిక్ జాగరణ్ ప్రకారం, న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో ఆడేందుకు శ్రేయస్ అయ్యర్ ఫిట్‌గా ఉన్నాడు. గత కొన్ని రోజులుగా BCCI సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో అతని శిక్షణ పూర్తయింది. నేషనల్ క్రికెట్ అకాడమీ హెడ్ VVS లక్ష్మణ్ ఇ-మెయిల్ ద్వారా చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌కు శ్రేయస్ అయ్యర్ ఫిట్‌నెస్ నివేదికను సమర్పించారు. భారత జట్టులోకి తిరిగి రాకముందు శ్రేయస్ అయ్యర్ 2 మ్యాచ్‌లు ఆడి తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాల్సి ఉంది. అతను విజయ్ హజారే ట్రోఫీలో హిమాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో పునరాగమనం చేశాడు. ఆ మ్యాచ్‌లో ముంబై తరఫున ఆడుతూ అయ్యర్ 82 పరుగులు చేశాడు. విజయ్ హజారే ట్రోఫీలో మిగిలిన లీగ్ మ్యాచ్‌లకు అయ్యర్‌ను ముంబై జట్టుకు కెప్టెన్‌గా నియమించారు. అతను జనవరి 8న పంజాబ్‌తో తన రెండో మ్యాచ్ ఆడనున్నాడు. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో క్యాచ్ పడుతున్న సమయంలో శ్రేయస్ అయ్యర్‌కు గాయమైంది. రక్తస్రావం కారణంగా అతని పరిస్థితి చాలా తీవ్రంగా మారింది, అతను ICUలో కూడా ఉండాల్సి వచ్చింది. ఇప్పుడు సుదీర్ఘ చికిత్స ప్రక్రియ తర్వాత అయ్యర్ పూర్తిగా కోలుకున్నాడు. న్యూజిలాండ్ ODI సిరీస్ కోసం భారత జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, మహ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, యశస్వి జైస్వాల్



# మహిళల కోసం జెమిమా రోడ్రిగ్స్ సరికొత్త అవతారం

మహిళా క్రికెటర్ జెమిమా రోడ్రిగ్స్ మైదానంలో ఎంత చురుగ్గా ఉంటారో అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఆమె అదే ఉత్సాహంతో మహిళల సాధికారత, భద్రత దిశగా ఒక కీలక అడుగు వేశారు. మహిళల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేకంగా హెల్మెట్‌లను రూపొందించే ట్వారా కంపెనీతో జెమిమా దీర్ఘకాలిక ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంలో భాగంగా ఆమె కంపెనీలో ఈక్విటీ భాగస్వామిగా వ్యవహరిస్తారు. మహిళలు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు బాధ్యతాయుతంగా ఉండాలని, తమ రక్షణను తామే చూసుకోవాలనే స్పృహ కల్పించడంలో జెమిమా క్రియాశీలక పాత్ర పోషించనున్నారు. ఈ భాగస్వామ్యం గురించి జెమిమా రోడ్రిగ్స్ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "క్రీడలు మనకు క్రమశిక్షణ, నిలకడ, నమ్మకాన్ని నేర్పుతాయి. సామాన్య మహిళలకు వారి దైనందిన జీవితం కూడా ఇవే విషయాలను నేర్పుతుంది. మహిళలకు మెరుగైన రవాణా సౌకర్యాలు ఉంటే వారి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అలాగే సరైన భద్రత ఉంటే వారికి మరింత ధైర్యం వస్తుంది. ట్వారా కంపెనీ ఈ రెండు అంశాలపై దృష్టి సారించింది. అందుకే ఈ భాగస్వామ్యం నాకు వ్యక్తిగతంగా చాలా సంతోషాన్ని ఇస్తోంది" అని ఆమె తెలిపారు. భవిష్యత్తులో మహిళా రైడర్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త డిజైన్లను తీసుకురావడంలో జెమిమా తన సలహాలను కూడా అందించనున్నారు. ట్వారా వ్యవస్థాపకురాలు అల్పనా పరీదా మాట్లాడుతూ.. జెమిమా వంటి స్ఫూర్తిదాయకమైన క్రీడాకారిణి తమ కంపెనీలో చేరడం తమకు గర్వకారణమని పేర్కొన్నారు. జెమిమాలో ఉన్న క్రమశిక్షణ, ఉత్సాహం, లక్ష్యం పట్ల ఉన్న స్పష్టత.. తమ కంపెనీ ఆలోచనలతో సరిగ్గా సరిపోతాయని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఈ కంపెనీ హెల్మెట్‌లు ఆన్‌లైన్ ద్వారా దేశవ్యాప్తంగా 600కు పైగా నగరాల్లో అందుబాటులో ఉన్నాయి. అయితే 2026 నాటికి ఆఫ్‌లైన్ రిటైల్ మార్కెట్‌లోకి ప్రవేశించి, ప్రతి నగరంలోని స్టోర్లలో తమ ఉత్పత్తులను అందుబాటులోకి తేవాలని కంపెనీ ప్లాన్ చేస్తోంది.



# మా ఇంటి బంగారంతో సమంత పలకరింపు

సమంత అభిమానులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తోన్న చిత్రం 'మా ఇంటి బంగారం'. దర్శకురాలు మినహా ఇప్పటివరకూ ఎవరూ ఈ సినిమా గురించి ఎలాంటి అప్‌డేట్ ఇవ్వలేదు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అప్‌డేట్‌ను సామ్ షేర్ చేశారు. ఈ సంక్రాంతికి టీజర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను పంచుకున్న సమంత .. ఆసక్తికర క్యాప్షన్ పెట్టారు. 'మీరు చూస్తా ఉండండి.. మా ఇంటి బంగారం మీ అందరితో కలిసిపోతుంది అంటూ రాశారు. జనవరి 9న ఈ మూవీ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. దీంతో అభిమానులు సంబర పడుతున్నారు. 'క్వీన్ ఈజ్ బ్యాక్' అని కామెంట్స్ చేస్తున్నారు. 'ఓ బేబీ' తర్వాత సమంత దర్శకురాలు నందిని రెడ్డి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'మా ఇంటి బంగారం'. గతేడాది అక్టోబర్ 2న దీని షూటింగ్‌ను ప్రారంభించారు. తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై సమంత నిర్మిస్తున్న రెండో చిత్రమిది. దర్శకుడు రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరి సహ నిర్మాతలు. 1980ల నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ కథతో రూపొందుతున్నట్లు సమాచారం. ఇందులో సమంతతో పాటు బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య కీలకపాత్రలో నటిస్తున్నారు. దీనితో పాటు సమంత ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్' లో నటిస్తున్నారు. దర్శకద్వయం రాజ్, డీకే దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఆదిత్యరాయ్ కపూర్, అలీ ఫజల్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. పీరియాడిక్ డ్రామాగా ఇది రూపొందుతోంది.



# ఆగని దురంధర్ దూకుడు

## ఇప్పటికే 1240 కోట్లు వసూళ్లు

ధురంధర్ సినిమా బాక్సాఫీసు వద్ద దూసుకెళుతున్నది. ఆ ఫిల్మ్ కలెక్షన్ల జోరు తగ్గడం లేదు. తాజాగా ఆ ఫిల్మ్ ఓ కొత్త రికార్డు క్రియేట్ చేసింది. అత్యధిక వసూళ్లు చేసిన హిందీ భాష చిత్రంగా ధురంధర్ ఘనత సాధించింది. ఇప్పటి వరకు హిందీ భాషలో ధురంధర్ సినిమా రూ.1240 కోట్లు ఆర్జించినట్లు ఫిల్మ్ మేకర్స్ పేర్కొన్నారు. ఆదిత్య థార్ డైరక్షన్‌లో వచ్చిన ధురంధర్ సినిమా ప్రస్తుతం సంచలనాలు నమోదు చేస్తున్నది. జియో స్టూడియోస్ ప్రకారం ఆ ఫిల్మ్ కేవలం హిందీ భాషలోనే ఇప్పటి వరకు 1240 కోట్లు ఆర్జించింది. భారత్‌లో ఇప్పటి వరకు 968 కోట్లు ఆర్జించింది. ఇక విదేశాల్లో ఆ సినిమాకు 272 కోట్లు వచ్చాయి. దురంధర్ 2 చిత్రాన్ని మాత్రం హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో రిలీజ్ చేయనున్నారు. ఆ ఫిల్మ్ ఈ ఏడాది మార్చి 19న రిలీజ్ కానున్నది. అయితే తొలి పార్ట్‌కు విపరీతమైన డిమాండ్ ఉన్న కారణంగా.. ఆ ఫిల్మ్ సీక్వెల్‌ను పలు ఇతర భారతీయ భాషల్లో రిలీజ్ చేసే ఉద్దేశంతో నిర్మాతలు ఉన్నారు. రిలీజైన తర్వాత ధురంధర్ చిత్రం హిందీ భాషలో పలు రికార్డులు నెలకొల్పింది. కేవలం 16 రోజుల్లోనే ఇండియాలో 500 కోట్లు వసూల్ చేసింది. ఇది బాలీవుడ్‌లో రికార్డు. ఇక ఆ తర్వాత అదే వేగంతో 600, 800, వెయ్యి కోట్ల క్లబ్‌కు చేరుకున్నది.




# ఆ రెండు చిత్రాలకు హైకోర్టులో ఊరట




## టికెట్లు పెంచుకునేలా ఉత్తర్వులు

'ది రాజాసాబ్', 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్ర నిర్మాతలకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. టికెట్ ధరల పెంపు, ప్రత్యేక షోల విషయంలో గతంలో సింగిల్ బెంచ్ తీర్పును హైకోర్టు 'పుష్ప2', 'ఓజీ', 'గేమ్ ఛేంజర్', 'అఖండ 2' చిత్రాలకే పరిమితం చేసింది. దీంతో తాజా చిత్రాల నిర్మాతలకు ఊరట లభించినట్లయ్యింది. టికెట్ ధరలు పెంచడానికి వీల్లేదంటూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ 'రాజాసాబ్', 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్ర నిర్మాతలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఆ ఉత్తర్వులను సస్పెండ్ చేయాలని కోరుతూ వేర్వేరుగా పిటిషన్లు వేశారు. టికెట్ ధరల పెంపు, ప్రత్యేక షోల కోసం హోంశాఖ కార్యదర్శికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఆ విజ్ఞప్తిని పరిశీలించేలా హోంశాఖ కార్యదర్శికి సూచించాలని కోరారు. దీనిపై బుధవారం విచారణ జరిపిన న్యాయస్థానం.. గతంలో ఇచ్చిన తీర్పును ఆ చిత్రాల వరకే పరిమితం చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో ఈ రెండు చిత్రాలకు టికెట్ ధరలు పెంచుకునే అవకాశం లభించింది. మారుతి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కిన 'ది రాజాసాబ్' జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుండగా.. చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన 'మన శంకరవరప్రసాద్ గారు' జనవరి 12న విడుదల కానుంది. హైకోర్టు ఉత్తర్వులతో 'ది రాజాసాబ్' బుకింగ్స్ ఓపెన్ కానున్నాయి.

# ప్రేక్షక మహాశయులకు పండుగ షురూ..

## రవితేజ కొత్త సినిమా ట్రైలర్ అదిరిపోయింది

**సంక్రాంతికి మాస్ మహారాజా రవితేజ నుంచి వస్తోన్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' (బీఎండబ్ల్యూ). కిశోర్ తిరుమల దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ చిత్రంలో ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి హీరోయిన్లుగా నటించారు.**

ఫ్యామిలీ ఆడియెన్స్‌ను లక్ష్యంగా చేసుకుని రూపొందిన ఈ సినిమా సంక్రాంతి బరిలో నిలవగా, జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానున్నది. ఇప్పటికే విడుదలైన టీజర్‌తో పాటు 'బెల్ల బెల్లా', 'అద్దం ముందు నిలబడి', 'వామ్మో వాయ్యో' సాంగ్స్ చార్ట్‌బస్టర్లుగా నిలిచాయి. ఈ క్రమంలో తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ట్రైలర్‌ను గమనిస్తే, ఈ సినిమా పూర్తిగా ఫ్యామిలీ ఆడియెన్స్‌ను లక్ష్యంగా చేసుకుని



తెరకెక్కినట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఓ వైపు ఇల్లాలు, మరో వైపు ప్రియురాలు మధ్య నలిగిపోయే పాత్రలో రవితేజ కనిపించారు. ఈ పాత్రలో ఆయన చూపించిన ఎమోషన్, ఎనర్జీ కథకు మంచి బలంగా నిలుస్తాయి. రవితేజ మార్క్ ఎనర్జీ, టైమింగ్‌తో కూడిన కామెడీ ట్రైలర్ అంతటా ఆకట్టుకుంటుంది. ప్రేక్షకులను హండ్రెడ్ పర్సెంట్ ఎంటర్‌టైన్ చేసే కంటెంట్‌తో సినిమా రూపొందిందనే నమ్మకాన్ని ట్రైలర్ కలిగిస్తోంది. ఈ మధ్య గన్నులు, కత్తులు, జాతర ఫైట్లు.. ఇలా తెగ చేసేసాను.. ఇక మా ఫ్యామిలీ డాక్టర్ బ్రేక్ తీసుకోమన్నాడు అంటూ రవితేజ డైలాగ్‌తో ట్రైలర్ షురూ అయింది. రామ్ లైఫ్‌లో ప్రేమ, పెళ్లి ఏదైనా సరే.. అది నాతోనే మొదలవుతుంది.. నాతోనే ఎండ్ అవుతుందని డింపుల్ అంటే, ఏ రిలేషన్ అయిన మనం కలిసే పర్సన్ బట్టి డిపెండ్ అయి ఉంటుంది.. అని ఆశికా రవితేజ లైన్ లోకి వచ్చింది. ఇలా వీరిద్దరితో సాగించిన రవితేజ యవ్వారం.. చివరకు ఎలాంటి స్టేజీకి వచ్చిందనేది ఇంట్రెస్టుగా చూపించారు. హీరోయిన్స్ డింపుల్ హయతి, ఆషికా రంగనాథ్ స్టైలిష్ లుక్స్‌తో ఇంప్రెస్ చేయగా, వెన్నెల కిషోర్, సునీల్, మురళీధర్ గౌడ్ తమదైన కామెడీ టైమింగ్‌తో నవ్వులు పూయించారు. మొత్తంగా ట్రైలర్ చూస్తే, ఫ్యామిలీతో కలిసి థియేటర్‌కు వెళ్లేలా చేసే ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుందనే క్లారిటీ ఇస్తుంది. కథ విషయానికి వస్తే.. రామ్ పాత్రలో రవితేజ హ్యాపీ మ్యారీడ్ మ్యాన్‌గా కనిపిస్తాడు. అయితే బిజినెస్ పనిమీద స్పెయిన్‌కు వెళ్లి ఆషికా రంగనాథ్‌తో ఎఫైర్ పెట్టుకుంటాడు. ఓవైపు భార్య, మరోవైపు ప్రియురాలు ఎమోషన్స్ మధ్య నలిగిపోతూ, గైడెన్స్ కోసం ఒక సైకాలజిస్ట్ (మురళీధర్ గౌడ్)ని కలుస్తాడు. ఆ తర్వాత ఇద్దరి మధ్య రామ్ ఎలాంటి నిర్ణయాలతో లైఫ్ ముందుకు ఎలా లాగాడు అనేది మెయిన్ కాన్సెప్ట్ అని తెలుస్తోంది. ఈ క్రమంలో వచ్చే స్క్రీన్ ప్లే, కామెడీ, ఎమోషనల్ సీన్స్ సినిమాకు మెయిన్ అస్సెట్‌గా నిలిచే ఛాన్స్ ఉంది.

# దృశ్యం-3 ఏప్రిల్‌లో విడుదల

మలయాళం నుంచి క్రైం థ్రిల్లర్ జోనర్‌లో వచ్చి దక్షిణాది భాషల్లో సూపర్ క్రేజ్ సంపాదించిన ఫ్రాంచైజీ ప్రాజెక్ట్ దృశ్యం. జీతూ జోసెఫ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం సస్పెన్స్, థ్రిల్లింగ్ అంశాలతో ప్రేక్షకులను కట్టిపడేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పుడీ ఫ్రాంచైజీలో అందరినీ మెస్మరైజ్ చేసేందుకు మరోసారి దృశ్యం 3 కూడా వస్తోంది. మోహన్ లాల్ , మీనా కాంబోలో వస్తోన్న దృశ్యం3 గత సెప్టెంబర్‌లో గ్రాండ్‌గా లాంచ్ అయింది. తాజా అప్‌డేట్ ప్రకారం ఈ మూవీ షూటింగ్ పూర్తయింది. ఇక ప్రేక్షకులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ప్రకటన రానే వచ్చింది. దృశ్యం ఎంతోమందిని ప్రభావితం చేస్తూ ఇప్పటికీ క్యూరియాసిటీతో ఎదురుచూసేలా చేస్తున్న సినిమా అని అన్నాడు డైరెక్టర్ జీతూ జోసెఫ్. ఎలాంటి భారీ అంచనాలు పెట్టుకోకుండా చూసే ఫ్రాంచైజీ ఇదని.. దృశ్యం 3ఏప్రిల్ తొలివారంలో మీ ముందుకు వస్తోందని ప్రకటించాడు. మొత్తానికి మూవీ లవర్స్ ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న దృశ్యం థర్డ్ పార్టు రిలీజ్‌కు సంబంధించి డైరెక్టర్ జీతూ జోసెఫ్ క్రేజీ వార్తను షేర్ చేసి మూవీ లవర్స్‌తోపాటు అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తున్నాడు. జార్జ్‌కుట్టీ ప్రపంచంలోకి మరోసారి తీసుకొస్తూ.. అంటూ మోహన్ లాల్ చాలా రోజుల క్రితం షేర్ చేసిన ఫొటో ఒకటి ఇప్పటికే నెట్టింట చక్కర్లు కొడుతోంది. దశ్యం ఫ్రాంచైజీలో వచ్చిన రెండు పార్టులు ఇప్పటికే బ్లాక్ బస్టర్ హిట్స్‌గా నిలిచాయి. ఫస్ట్ పార్ట్ థియేటర్‌లో విడుదలవగా.. రెండో పార్టు ఓటీటీలో విడుదలైంది. రెండు పార్టులను తెరకెక్కించిన ఆశీర్వాద్



సినిమాస్ దశ్యం 3ని కూడా తెరకెక్కిస్తోంది. కాగా హిందీలో అజయ్ దేవ్‌గన్, శ్రియా కాంబోలో దృశ్యం 3 కూడా తెరకెక్కుతుండగా.. ఈ మూవీని 2026 అక్టోబర్ 2న రిలీజ్ చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 966605221**

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్ | గురువారం 08 జనవరి 2026

## ఆర్‌టిసిపిఓను సత్కరించిన స్టార్ కృష్ణ



**నేటి సాక్షి తిరుపతి,విజయవాడ :** ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఫౌండర్ మెంబర్ అంబేద్కర్ స్టార్ కృష్ణ ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ రాజ్యలక్ష్మి, జనరల్ సెక్రెటరీ ఏ.వి.రాజు తదితర నాయకులతో కలిసి ఆయన విజయవాడ ఆర్టీసీ హెడ్ ఆఫీస్ లో పర్సనల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న రమణను మర్యాద పూర్వకంగా కలసి, పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా స్టార్ కృష్ణ మాట్లాడుతూ తిరుపతి ఆర్.ఎం.ఆఫీస్ లో రమణ విధులు నిర్వహిస్తున్న సమయంలో సంస్థ ఉద్యోగులందరికీ, ప్రత్యేకించి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు విశేషమైన సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు అన్జప్ప, వాసు, శాంసన్, అనిల్ కుమార్,శేషాద్రి తదితరులు పాల్గొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## రక్తదానం చేసిన ఆనంద్ కుమార్



**నేటి సాక్షి-మేడిపెల్లి:** భీమారం మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన జిర్డ్స్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ అంగడి ఆనంద్ కుమార్, 70 సార్లు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు కమ్మరిపేట గ్రామానికి చెందిన పురాణం రజిత, అనారోగ్య కారణంతో జగిత్యాల్ లో దీక్షిత న్యూరో హాస్పిటల్ వైద్యులు రక్తం అవసరం ఉంది అనగా స్పందించి జగిత్యాల వెళ్లి రక్తదానం చేయడం జరిగింది ఇప్పటివరకు జిర్డ్స్ సంస్థ ద్వారా 12850 యూనిట్స్ రక్తదానం చేయడం జరిగింది,వైద్యులు వారి కుటుంబ సభ్యులు ఆనంద్ కుమార్, ని అభినందించారు.

## పర్యాటక కేంద్రంగా బోయకొండ

గువ్వల రమేష్ రెడ్డి



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి:** అన్నమయ్య జిల్లా చౌడేపల్లి మండలం శక్తి క్షేత్రం బోయకొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి వైపు చర్యలు తీసుకుంటున్నట్లు .తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి అన్నారు, ఈ మేరకు బుధవారం ఏఖో టూరిజం అధికారులు బోయకొండ గంగాపురంలోని కసిమిరెడ్డి చెరువు పరిసర ప్రాంతాలను పరిశీలించారు, కొండపై నుంచి కింది వరకు ఒక కిలో మీటర్ మేరా రోప్ వే అదే విధంగా కసిమిరెడ్డి చెరువు సుందరీకరణ వంటి పనులు చేపట్టనున్నట్లు ,వారు వివరించారు పనులు పూర్తయితే బోయకొండలో ఆధ్యాత్మిక తో పాటు పర్యాటకం మరింత అభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో టూరిజం అధికారులు తెలుగుదేశం పార్టీ నాయకులు బోయకొండ సుబ్బు పాలెం రెడ్డి మంజునాథ్ స్థానికులు పాల్గొన్నారు

## యూరియా స్టాక్ వచ్చింది.

మండలానికి 182 టన్నులు

**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి:** ఏ ఏ రైతుసేవాకేంద్రాలకు యూరియా వచ్చిందో, ఆ పంచాయతీ కి సంబంధించిన రైతులకు మాత్రమే యూరియా ఇవ్వడం జరుగుతుంది. కాబట్టి ఆ పంచాయతీలకు చెందిన రైతులు వాళ్లకు సంబంధించిన రైతుసేవా కేంద్రాలకు మాత్రమే రావాలిసిందిగా కోరడమైనది. యూరియా తీసుకోవడానికి వచ్చే రైతులు వారి పట్టాధారు పాస్ పుస్తకము మరియు ఆధార్ కార్డ్ జిరాక్స్ లు తీసుకుని రావలిసిందిగా కోరుచున్నాను. ఇప్పుడు వచ్చిన స్టాక్ ఎంతమంది రైతులకు వస్తుందో అంతమందికి ఇవ్వడం జరుగుతుంది. వచ్చిన రైతులకు ఇప్పుడు వచ్చిన స్టాక్ సరిపోకపోతే మళ్ళీ తెప్పించి ఇవ్వడం జరుగుతుంది. జిల్లాలో యూరియా స్టాక్ సరిపడా వుంది. రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదు. మండల వ్యవసాయ అధికారి, చౌడేపల్లి

## మండల తాసిల్దార్‌కు వినతి



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బీసీలకు సబ్ ప్లాన్ అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర పిఆర్పి కార్యదర్శి ఎం శివ వీర్ కోరారు. బుధవారం నారాయణ పేట జిల్లాలోని మరికల్ మండల పరిధిలోని తాసిల్దార్ కార్యాలయంలో బుధవారం నాడు తెలంగాణ రాష్ట్ర పిఆర్పి పార్టీ ఆధ్వర్యంలో మరికల్ మండల తాసిల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ తరహాలోని బీసీలకు కూడా అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

# రహదారుల భద్రతా వారోత్సవాలు

- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు,




**నేటి సాక్షి తిరుపతి:** చిత్తూరు నగరంలో నిర్వహించిన జాతీయ రహదారుల భద్రతా వారోత్సవాల కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేపట్టిన జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల ర్యాలీ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం చిత్తూరు నగరంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రారంభమై గాంధీ సర్కిల్ వరకు కొనసాగిన ర్యాలీ కార్యక్రమంలో పాల్గొని, నగర ప్రజలను చైతన్య పరిచాను. రహదారి భద్రత నియమ నిబంధనలను పాటిస్తూ.., విలువై ప్రాణాలను కాపాడుకోవాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ప్రజలకు సూచించారు.

# బాడుగకు బడి మైదానాలు

- మైకుల జోరు.. విద్యార్థుల బేజారు
- పాఠశాల మైదానంలో ప్రైవేటు టోర్నమెంట్లు
- శబ్దాలతో విద్యార్థులకు అవస్థలు
- పట్టించుకోని అధికారులు




**నేటిసాక్షి, కరీంనగర్:** ఆ పాఠశాల క్రీడామైదానంలో మైకుల జోరుతో విద్యార్థులు బేజారవుతున్నారు. పాఠశాల విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన మైదానంలో కాసుల కోసం ప్రైవేటు క్రికెట్ టోర్నమెంట్లకు అనుమతిస్తున్నారు. తరగతి వేళల్లో వారు మైకులతో చేస్తున్న భారీ కామెంటరీ శబ్దాలతో విద్యార్థులు సరిగ్గా చదువులు కొనసాగించలేక పోతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కరీంనగర్‌లోని సెయింట్ అల్ఫోన్స్ స్కూలులో నిర్వహిస్తున్న ఓ ప్రైవేట్ క్రికెట్ టోర్నమెంట్ విమర్శలకు దారితీస్తోంది. పాఠశాలలో తరగుతులు నిర్వహించాల్సిన సమయంలో భారీ మైకులు ఏర్పాటుచేసి రణగొణ ధ్వనులను సృష్టిస్తున్నారు. సదరు ప్రైవేటు టోర్నమెంటు నిర్వహణకు గాను ఒక్కో మ్యాచుకు 5 వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. పాఠశాల యాజమాన్యం ధనార్జనే ధ్యేయంగా చేస్తున్న ఈ వ్యవహారంతో తమ పిల్లలు చదువును సరిగ్గా కొనసాగించలేని పరిస్థితి దాపురించిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు పెంపొందించేందుకు, శారీరక ధృడత్వం కోసం ఉపయోగించాల్సిన మైదానాన్ని డబ్బుల కోసం ప్రైవేటు కార్యకలాపాల కోసం వినియోగించడం శోచనీయం. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతె నా ఉంది. ఈ విషయమై కరీంనగర్ ఎంఈఓను ఫోన్‌లో సంప్రదించగా, ఆయన అందుబాటులోకి రాలేదు.

# రాజముద్రతో పాస్ పుస్తకాలు

- జగన్ ఫోటో తొలగించడం అభినందనీయం:
- ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి



**నేటి సాక్షి, తిరుపతి - పలమనేరు:** భూ యజమానులకు పూర్తి భూ భద్రత కల్పించాలనే లక్ష్యంతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను కూటమి ప్రభుత్వం లబ్ధిదారులకు పంపిణీ చేస్తోందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఇది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధికి నిదర్శనమని వారు కొనియాడారు. పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలం పెద్దవెలగటూరు గ్రామంలో నిర్వహించిన రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారులకు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టాదారు పాస్ పుస్తకాలపై మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఫోటో ముద్రించడం ద్వారా ప్రజల ఆస్తులను రాజకీయ ప్రయోజనాలకు వాడుకునే ప్రయత్నం జరిగిందని విమర్శించారు. ఆ ఫోటోను తొలగించి, భూమిపై ప్రజలకు సర్వహక్కులు కల్పించేలా రాజముద్రతో పాస్ పుస్తకాలను రూపొందించడం కూటమి ప్రభుత్వం చేసిన మంచి నిర్ణయమని అన్నారు.

### హామీ అమలు - పారదర్శక పాలన

2024 సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు, ఉన్నత ఆశయంతో రూపొందించిన పట్టాదారు పాస్ పుస్తకాలను లబ్ధిదారులకు అందిస్తున్నామని తెలిపారు. భూమి యాజమాన్యానికి సంబంధించి ఎలాంటి సందేహాలు లేకుండా, పూర్తి పారదర్శకతతో పాస్ పుస్తకాలు జారీ చేయాలని అధికారులకు సూచించారు. పాస్ పుస్తకాలలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సమస్యలు తలెత్తిన చోట పరిష్కార మార్గాన్ని కూడా సూచించే విధంగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వానికి అపఖ్యాతి కలగవచ్చని, అధికారులు తమ బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించి ఆశీర్వదించాలని ఎంపీ, ఎమ్మెల్యేలు కోరారు.

### పాల్గొన్న వారు

ఈ కార్యక్రమంలో పెద్దపంజాణి మండలం కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్ ప్రారంభించిన మంత్రి వివేక్






- మందమర్రి రామకృష్ణపూర్ మంచిర్యాల మధ్య ప్రయాణ సౌకర్యం మెరుగుదల

**నేటి సాక్షి ,మంచిర్యాల జిల్లా:** మందమర్రి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నూతనంగా ప్రవేశపెట్టిన బస్ ను ప్రారంభించిన కార్మిక మరియు మైనింగ్ శాఖ మంత్రి డా. జి.వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ప్రజా రవాణా సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గ్రామాలు, పట్టణాలను అనుసంధానించే విధంగా ఆర్టీసీ సేవలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. ఈ నూతన బస్ సేవతో మందమర్రి, రామకృష్ణపూర్ పరిసర ప్రాంతాల ప్రజలకు జిల్లా కేంద్రం మంచిర్యాలకు వెళ్లే ప్రయాణం మరింత మెరుగు పడుతుంది అన్నారు, ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రవాణా సౌకర్యాల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు, జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అపూర్వ మిత్రులు..

- 57 వసంతాలుగా కొనసాగుతున్న స్నేహం.



**నేటి సాక్షి తిరుపతి రామచంద్రాపురం:** వారందరూ 80 ఏళ్లు నిండినవారు.. మనవళ్ళు, మనవరాళ్లతో,శేష జీవితం గడుపుతున్న వారు. అయినప్పటికీ తామువైద్య విద్య చదువుకున్న యవ్వనపు రోజులను ఇప్పటికీ నెమరు వేసుకుంటూ.. ప్రతి మూడేళ్లకు ఓసారి ఆత్మీయంగా కలుస్తూనే ఉంటారు..తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాల 1968 బ్యాచ్ కు చెందిన మిత్రులు బుధవారం నాడు రామచంద్రపురం మండలం లింగమ నాయుడు కండ్రికలో ఒకే చోట చేరి తమ పాత రోజులను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఆనాటి స్మృతులను పంచుకున్నారు. 1968 సంవత్సరంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వైద్య విద్యకు అభ్యసించడానికి తిరుపతి మెడికల్ కళాశాలకు వచ్చి మిత్రులైయ్యారు..వారి స్నేహానికి నేటితో 57 ఏళ్ళు పూర్తియ్యింది.. నాటి నుండి నేటి వరకు ఒకే కుటుంబ సభ్యుల్లా కలిసిమెలిసి ఆనందంగా తమ జీవితాన్ని గడుపుతున్నారు..ఒకరి కష్ట సుఖాల్లో ఒకరు పలుపంచుకుంటూ. అందరూ ఒక్కటై అండగా నిలబడతారు.వైద్య విద్య పూర్తి చేసుకుని వివిధ రాష్టాలో.. దేశాల్లో.. స్థిరపడి నప్పటికి వారి జ్ఞాపకాలు మాత్రం ఎప్పుడు.. ఎదో ఒక విధంగా గుర్తు చెకుంటూనే ఉంటారు. తిరుపతిలోని ప్రముఖ కంటి వైద్య నిపుణులు అమిలినేని భాస్కర్ నాయుడు ఆధ్వర్యంలో ఇప్పటికీ మూడు సార్లు ఇలాంటి ఆత్మీయ కలయిక సమావేశాలు నిర్వహించుకున్నారు.. నాల్గవ సారి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో నాటి బ్యాచ్ కు చెందిన విద్యార్థిని విద్యార్థులు గా ఉన్నవారు దాదాపు 40 మందికి పైగా హాజరుయ్యారు.. అమెరికా ఆస్ట్రేలియా,నుండి ఈ కార్యక్రమం కోసం రావడం విశేషం..

# రైతు సమస్యలకి విద్యుత్ అంబులెన్స్‌లు





- విద్యుత్ శాఖలో విప్లవాత్మక మార్పులు
- మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నిర్మలా రెడ్డి

**నేటి సాక్షి -జగిత్యాల (పూరెళ్ల బాపు):** రైతుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ అంబులెన్స్ లు ఏర్పాటు చేసిందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చింతల నిర్మలా రెడ్డి, జగిత్యాల జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డిలు తెలిపారు.బుధవారం హైదరాబాద్ లో నిర్మలరెడ్డి, కిషన్ రెడ్డి తో కలిసి విలేకరులతో మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టె రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నాధన్నారు.రైతు భరోసా, రైతుల రుణమాఫీ, పంటలకు మద్దతు ధర కల్పించడం, సన్న వడ్లకు అదనంగా 500 బోనస్, ఇప్పుడు విధ్యుత్ అంబులెన్సు లు ఏర్పాటు చేయడం అభినందనియమన్నారు.

### 1912 కి సమాచారమిస్తే తక్షణ పరిష్కారం

వారానికి 3 రోజులు అధికారులు రైతుల కష్టాలు, సమస్యలను ప్రత్యక్షంగా చూసేందుకు పొలాల్లో ప్రజాబాట కార్యక్రమం నిర్వహించనున్నారని వారు తెలిపారు.అన్నదాతలకు అదనంగా లోడ్ ఉంటే ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేసి ప్రభుత్వం విద్యుత్ ఇబ్బందులను తొలగిస్తుందని నిర్మలా రెడ్డి, కిషన్ రెడ్డిలు పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన వారికి అందజేయడంలో అధికారులు శ్రద్ధ తీసుకోవాలని వారు సూచించారు.

# మోడీపై చేసిన వాక్యాలను ఖండించిన భారత్



**నేటి సాక్షి జగిత్యాల(పూరెళ్ల బాపు):** ఈ రోజు స్థానిక కార్యాలయంలో జరిగిన పత్రిక విలేకరుల సమావేశంలో నాయకులు-బాజూ రాజు, న్యాయవాది పుప్పాల సత్యనారాయణ, అక్కినపెల్లి కాశీ నాదం మాట్లాడుతూ ప్రపంచంలోనే అగ్రరాజ్యంగా చెప్పుకుంటూ ఇతర దేశాల మీద ఆధిపత్యం చెలాయించడానికి చేస్తున్న ప్రయత్నంలో భాగంగా ప్రపంచంలోనే అత్యధిక చమురు నిలువలు కలిగిన వెనిజులా దేశ అధ్యక్షుడు మధురోను సైనిక దాడి ద్వారా ఎత్తుకొని వెళ్ళింది, దీన్ని ఉదాహరిస్తూ మాజీ ముఖ్యమంత్రి అయినా పృథ్వీరాజ్ చౌహాన్ వెనుజులకు జరిగినట్టే మన దేశానికి కూడా జరుగుతుందని మన ప్రధానిని కూడా ట్రంప్ ఎత్తుకొని పోతాడని దేశ ప్రధాని నరేంద్ర మోడీనీ కించపరిచే విధంగా మాట్లాడటం దుర్మార్గమని పేర్కొన్నారు. భారతదేశం వెనిజులా లాంటి దేశం కాదని ప్రపంచంలోనే శక్తివంతమైన అన్వాస్త్రాలు కలిగిన దేశమని ఎలాంటి దాడినైనా ఎదుర్కోగల సత్తా కలిగిన దేశమని ప్రధాని మోడీ ప్రపంచంలోనే ఒక శక్తివంతమైన నాయకుడని ట్రంపును కూడా ఎదుర్కొనే సత్తా కలిగినవాడని అన్నారు. అంతేకాకుండా ఈ మధ్య మేధావులుగా చెప్పుకునే అర్బన్ నక్సల్స్ కూడా ప్రధానిని విమర్శించడం సిగ్గుచేటని వీళ్లు తమ పిల్లలను విదేశాలలో చదివిస్తూ సుఖవంతమైన జీవితం గడిపేలా చేస్తూ పేద మధ్యతరగతి వర్గాలను మాత్రం సమాజానికి వ్యతిరేకంగా తుపాకులు పట్టుకునే నక్సలైట్లుగా తయారు చేయటం తగదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాయవాది అక్కినపల్లి కాశీనాథం కార్యదర్శి సింగం గంగాధర్ ఉపాధ్యక్షులు వేముల పోచమల్లు చిట్ల గంగాధర్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు ఆరవ లక్ష్మి వేముల దేవరాజం బాసెట్టి దుబ్బరాజం నరేందుల శ్రీనివాస్ న్యాయవాది అనుమల్ల భుజంగం గాదాసు భూమన్న చిలుక రాజన్న వేముల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం క్రీడా పోటీలు ప్రారంభం

- పేటలో సీఎం కప్ టార్చ్ ర్యాలీని ప్రారంభించిన పేట డీఎస్పీ



**నేటి సాక్షి, నారాయణపేట (ఇమామ్ సాబ్ ):** విద్యార్థులు చదువు, క్రీడలను సమాన ప్రాధాన్యత ఇచ్చి ఆకాశమే హద్దుగా ముందుకు సాగాలని నారాయణపేట డీఎస్పీ నల్లపు లింగయ్య సూచించారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సీఎం కప్ 2025- 26 క్రీడా పోటీల సందర్భంగా రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో బుధవారం ఉదయం సీఎం కప్ టార్చ్ ర్యాలీని స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్ సదా శివ రెడ్డి తో కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, చదువు కు కూడా చాలా ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి వారిని అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనేలా చేయడమే లక్ష్యంగా సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించి ఈ ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. కాగా సీఎం కప్ టార్చ్ ర్యాలీ మినీ స్టేడియం నుంచి సత్య నారాయణ చౌరస్తా,పాత బస్టాండ్ సెంటర్ చౌక్ మీదుగా దామరగిద్ద కు చేరుకుంది. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి వెంకటేష్ శెట్టి, మార్కెట్ కమిటి డైరెక్టర్ శరణప్ప, ఎస్ ఐ వెంకటేశ్వర్లు, పీడీ గొడుగు నర్సిములు, వ్యాయామ ఉపాధ్యాయులు సాయి, అనంత సేన, బాల్ రాజ్, రమణ, రత్నయ్య, అక్తర్ పాషా, మైనార్టీ గురుకుల కళాశాల, బీసీ బాలికల జూనియర్ కళాశాల, స్థానిక క్రికెట్ అకాడమీ క్రికెటర్లు, సీనియర్ క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## పి ఆర్ టి యు టీ ఎస్ డైరీ అందజేత



**నేటి సాక్షి,జగిత్యాల (పూరెళ్ల బాపు):** 2026 సంవత్సరం పిఆర్‌టి యుటిఎస్ డైరీని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కు, జిల్లా అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత, జిల్లా విద్యాధికారి రాము, జిల్లా కోశాధికారి సోఫియా, మరియు డిసిఇబి కార్యదర్శి మురళీ మనోహర్ చారి గారికి అందజేసిన పి ఆర్ టి యు టి ఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయిని పెల్లి ఆనంద్ రావు యాల్ల అమర్నాథ్ రెడ్డి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జమున గోవర్ధన్ ప్రసాద్ శ్రీనివాసరెడ్డి జిల్లా అసోసియేట్ అధ్యక్షులు మల్లారెడ్డి వేణుగోపాలరావు రాష్ట్ర కార్యదర్శులు చందన ప్రభాకర్ అనూజ జిల్లా బాధ్యులు శ్రీదేవి మండల బాధ్యులు విద్యాదేవి పద్మ విజయ్ హరీష్ డివి చారి తదితరులు పాల్గొన్నారు.

## గంగాపూర్ జాతర ఏర్పాట్లపై



## సమీక్ష సమావేశం

**నేటి సాక్షి, కొమరం భీం ఆసిఫాబాద్:** రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామంలో జరిగే శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి వారి జాతర ఈ నెల జనవరి 31 నుండి ఫిబ్రవరి 1, 2 తేదీల వరకు నిర్వహించనున్న నేపథ్యంలో, జాతర ఏర్పాట్లపై అన్ని శాఖలతో కలిసి జిల్లా కలెక్టర్ శ్రీ వెంకటేష్ దోత్రే గారు, జిల్లా ఎస్పీ శ్రీమతి నితికా పంత్, ఏఎస్పీ శ్రీ చిత్తరంజన్ గారు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల అధికారులు,ఆర్టీఏ మెంబర్ లావుడ్య రమేష్, మాజీ జడ్పీటీసీ సభ్యులు పల్లె ప్రకాష్ రావు, ఆలయ కమిటీ చైర్మన్ జయరాం, డైరెక్టర్లు, మాజీ సర్పంచ్ కొవ్వూరి శ్రీనివాస్, సోనాలే సంతోష్ బాబు తదితరులు పాల్గొన్నారు



## జాతర ఏర్పాట్లపై సమీక్షించిన ఎస్పీ

**నేటి సాక్షి, కొమరం భీం ఆసిఫాబాద్ :** రాబోయే గంగపూర్ జాతరను శాంతియుతంగా, సక్రమంగా నిర్వహించేందుకు కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ శ్రీమతి నితికా పంత్, ఐపీఎస్ గంగపూర్ ఆలయాన్ని సందర్శించి జాతర ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. భక్తుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ఆలయ పరిసరాల్లో తీసుకోవాల్సిన పోలీస్ బందోబస్తు, రద్దీ నియంత్రణ చర్యలు, ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్ నిర్వహణ, అత్యవసర సేవల సమన్వయంపై సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు ఇచ్చారు. జాతర సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో విధులు నిర్వహించాలని, శాంతి భద్రతలకు భంగం కలిగించే పరిస్థితులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ గారు ఆదేశించారు. ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సతీష్, రెబ్బెన సీఐ సంజయ్, ఎస్సై వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్‌లో కార్తికేయ



**నేటి సాక్షి - జగిత్యాల (పూరెళ్ల బాపు):** జగిత్యాల పట్టణంలోని అభ్యాస స్కూల్ విద్యార్థి కార్తికేయ కామారెడ్డిలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్ లో పాల్గొన్నారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో కార్తికేయ సుస్థిర వ్యవసాయం అనే థీమ్ లో Smart Irrigation security system అనే అంశం మీద ప్రాజెక్టును రూపొందించి ప్రదర్శన లో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెట్ బోగ రవి ప్రసాద్ శ్రీదేవి మరియు పాఠశాల అధ్యాపక బృందం అభినందించారు.

## కరాటే క్లాసులు ప్రారంభం

పెద్ద చింతకుంట గ్రామ సర్పంచ్ పోర్ల తిరుపతమ్మ...



**నేటి సాక్షి నారాయణపేట(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల పరిధిలోని పెద్ద చింతకుంట గ్రామంలో గల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్ద చింతకుంట నందు 6 నుండి 9 వ తరగతి విద్యార్థినిలకు స్కూల్‌లో కరాటే క్లాసులను గ్రామ సర్పంచ్ పోర్ల తిరుపతమ్మ, ఉప సర్పంచ్ దండురాజులు బుధవారం నాడు ప్రారంభించారు. ప్రభుత్వం కల్పించిన వసతిని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో రాణించాలని విద్యార్థినిలకు పిలుపునిచ్చారు. పాఠశాల సిబ్బంది... సర్పంచ్, ఉపసర్పంచ్, బడి శ్రేయోభిలాషులు అంజిరెడ్డి గార్లను శాలువాలతో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.. ఈకార్యక్రమంలో పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు గుండ్రాతి గోవర్ధన్ గౌడ్, ఉపాధ్యాయులు, కరాటే మాస్టర్ వివేక్ లు తదితరులు పాల్గొన్నారు.

## కొండపోచమ్మ హుండీ లెక్కలు



**నేటిసాక్షి,జగదేవపూం:** సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలంలోని తీగుల్ నర్సాపూర్ సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ కొండపోచమ్మ అమ్మవారి ఆలయ హుండీని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. అమ్మవారికి భక్తులు వివిధ కనుకల రూపంలో హుండీ లో డబ్బులు వేసి ముడుపులు చెల్లించుకున్నారు. అమ్మవారికి 88 రోజులకు గాను రూ.7,18,878 నగదు హుండీ ద్వారా ఆదాయం సమకురినట్లు దేవాదాయ శాఖ సిద్దిపేట డివిజన్ ఇన్ స్పెక్టర్ విజయలక్ష్మి, ఈవో రవి కుమార్ లు తెలిపారు . అమ్మవారికి కానుకలు రూపంలో వచ్చిన ఆదాయంను అమ్మవారి ఆలయ ఖాతాలో జమ చెయనున్నట్లు తెలిపారు. మరో వారం రోజుల్లో అమ్మవారి జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయం వద్ద అన్ని వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ తాజా మాజీ చైర్మన్ అనుగీత, సర్పంచ్ సంధ్య శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రజీత రమేశ్, మాజీ చైర్మన్ లక్ష్మి నర్సింహా రెడ్డి,ఆలయ సిబ్బంది మహేందర్ రెడ్డి, కనకయ్య, పూజారులు మల్లయ్య, లక్ష్మణ్, కొండయ్య, తిరుపతి, గోవర్దన్ ఉన్నారు.

## ఉద్యాన ఉత్సవ్ రైతులు




**నేటిసాక్షి,జగదేవపూర్:** సికింద్రాబాద్ లోని బొల్లారంలో రాష్ట్రపతి నిలయం నందు ఈనెల 3 తేదీ నుండి 11 తేది వరకు జరుగుతున్న ఉద్యాన ఉత్సవ్ కార్యక్రమమును ప్రత్యక్షంగా వీక్షించేందుకు మండలం నుండి బుధవారం 20 మంది ఉద్యాన రైతులు తరలి వెళ్లినట్టు మండల వ్యవసాయ అధికారి వసంతరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులు పూల, ఉద్యాన పంటల ఎగ్జిబిషన్ ను తిలకించి ధ్యాన పంటల్లో వచ్చిన అధునాతన పద్ధతుల గురించి తెలుసుకోవచ్చు అని అన్నారు. రైతులు ఆర్థికంగా ఎదగాలంటే ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపాలని అన్నారు. తరలి వెళ్లిన వారిలో ఆయా గ్రామాల ఉద్యాన రైతులు తదితరులు ఉన్నారు.

## విద్యార్థుల అ'పూర్వ' సమ్మేళనం.





**నేటి సాక్షి-కోరుట్ల(రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలోని ఆదర్శ విద్యాలయం ప్రాథమికొన్నత పాఠశాలలో 7వ తరగతి చదివిన 2010-11 పూర్వ విద్యార్థులు స్థానిక కటుకం సంగయ్య ఫంక్షన్ హాలులో 'ఆత్మీయ సమ్మేళనం' నిర్వహించుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ కీర్తి శేషులు అల్లె సంగయ్య స్మారకర్తం రెండు నిముషాలు మౌనం పాటించారు. గత స్మృతులను విద్యార్థులు నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అల్లె సతీష్, ఉపాధ్యాయులు ఆడెపు హరీష్, కొక్కుల మమత, రుద్ర సౌజన్య, రానవేణి,మమత,రఘు పటేల్ మాకునూరి,ఉమెర్, రవిరాజు,గణేష్ ,సిద్దార్థ, నవీన్,కిరణ్,నాగరాజు, సాయి తేజ, లహరిక, నందిని, విజయ ,స్వప్న, భవాని, వైష్ణవి, మనిషా, దుర్గ,సౌమ్య ,వందన,లావణ్య,నవ్య, వసంత తదితరులు పాల్గొన్నారు.

# నేడు లిఫ్ట్ పరిశీలనకు రాక..



**నేటి సాక్షి జూపాడుబంగ్లా:** రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని కోరుతూ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, రాయలసీమ లిఫ్ట పరిశీలనకు సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఈశ్వరయ్య తో పాటు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే. రామాంజనేయులు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి. రామచంద్రయ్యలతో పాటు కడప జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు, కర్నూలు జిల్లా కార్యదర్శి గిడ్డయ్య,అన్నమయ్య జిల్లా కార్యదర్శి మహేష్ తిరుపతి జిల్లా కార్యదర్శి మురళి తో పాటు రాష్ట్ర జిల్లా నాయకులు హాజరవుతున్నారని ఈ పర్యటన విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు పిలుపునిచ్చారు.. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో వారు మాట్లాడారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం లో అనేక సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న సాగునిటీ ప్రాజెక్టులు తక్షణమే పూర్తి చేయాలని అదేవిధంగా రాయలసీమ లిఫ్ట పూర్తిచేసి రాయలసీమ రైతాంగన్ని ఆదుకోవాలని కోరుతూ రేపు జరగబోయే పర్యటన విజయవంతం చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు మక్బుల్ భాష, రాజు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు..

# నిజమైన విద్యకు పునాది భగవద్గీతే

- పదో తరగతి విద్యార్థులకు దేవనాథ జీయర్ స్వామీజీ బోధ
- జగిత్యాలలో సిద్ధార్థ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ప్రేరణాత్మక కార్యక్రమం



**నేటి సాక్షి, జగిత్యాల(పూరెల్ల బాపు):** భగవద్గీత నిజమైన విద్యకు పునాదిలాంటిదని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా గీతను అధ్యయనం చేయాలని శ్రీ శ్రీ శ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామీజీ హిందూ సమాజానికి పిలుపునిచ్చారు. జగిత్యాల పట్టణంలోని సిద్ధార్థ విద్యా సంస్థల ఆధ్వర్యంలో మానస స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో, సూర్య గ్లోబల్ స్కూల్, జ్యోతి హై స్కూల్, మానస హై స్కూల్‌లకు చెందిన పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తును దిశానిర్దేశం చేయాలనే ఉద్దేశంతో "ఎగ్జామ్ ఛాలెంజెస్-మోటివేషనల్ సెషన్" అనే ప్రేరణాత్మక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీయర్ స్వామీజీ హాజరై విద్యార్థులకు అమూల్యమైన సందేశాన్ని అందించారు.

### విద్య అంటే కేవలం ఉద్యోగం కాదు

ఈ సందర్భంగా జీయర్ స్వామీజీ మాట్లాడుతూ పిల్లలకు భారతీయ సంస్కృతి, సంప్రదాయ విలువలు తప్పనిసరిగా నేర్పాల్సిన అవసరం ఉందన్నారు. విద్యకు ఎప్పటికీ ఫుల్‌స్టాప్ ఉండదని, ప్రతి వ్యక్తి జీవితాంతం విద్యార్థిగానే ఉండాలని స్పష్టం చేశారు. నేటి విద్యా విధానం కేవలం డబ్బు సంపాదించి స్థిరపడటానికే పరిమితమైందని, విద్య యొక్క అసలైన ఉద్దేశం అది కాదని హితవు పలికారు. ప్రస్తుత చదువు విద్యార్థిని విలువలతో కూడిన వ్యక్తిగా తీర్చిదిద్దడంలో విఫలమవుతోందని, సంస్కారం, నైతికత లోపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 1940 ప్రాంతంలో మెకాలే రూపొందించిన విద్యా విధానం భారతీయులను బానిసలుగా మార్చే ఉద్దేశంతో రూపొందించబడిందని, దాని ప్రభావం ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. అయితే ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ ఆ విధానాన్ని మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు.

### భగవద్గీత ద్వారా ఆత్మవిశ్వాసం

ప్రపంచంలోని అనేక దేశాల్లో భగవద్గీతను బోధిస్తున్నారని, పాకిస్తాన్ వంటి దేశాల్లో కూడా గీతను మూలభాష అయిన సంస్కృతంలోనే బోధిస్తున్నారని తెలిపారు. మనం ఎంత సంపాదించాలనే ఆలోచనలో మునిగి, ప్రపంచానికి విజ్ఞానం అందిస్తున్నామని భావిస్తున్నప్పటికీ, మనమే చీకట్లో ఉన్నామనే సత్యాన్ని గ్రహించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ భగవద్గీతను అధ్యయనం చేస్తే క్రమశిక్షణ, ఒత్తిడినుంచి ఉపశమనం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని అన్నారు. నేటి చదువు కేవలం ఉద్యోగం కోసమే కాకుండా, మంచి మనిషిగా తీర్చిదిద్దేలా ఉండాలని జీయర్ స్వామీజీ ఆకాంక్షించారు. ఆయన సందేశాలు విద్యార్థుల్లో నూతన ఆలోచనలకు నాంది పలికాయి.

### విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రశంస

ఈ కార్యక్రమాన్ని ప్రజ్ఞా వికాస్ కో-ఆర్డినేటర్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించడంపై పాఠశాల నిర్వాహకులు శ్రీధర్ రావు, హరిచరణ్ రావు, రజిత రావు, మౌనిక రావు, సుమన్ రావు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమాన్ని అత్యంత ఆసక్తితో వీక్షించి, జీయర్ స్వామీజీ ప్రసంగానికి మంత్రముగ్ధులయ్యారు.

# తెలుగు,హింది,ఆంగ్లం దీపికలు పంపిణీ




**నేటి సాక్షి,నారాయణపేట,(ఇమామ్ సాబ్):** పేట జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ లో తెలంగాణ ప్రభుత్వము పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు తెలుగు హిందీ ఆంగ్లము అభ్యాస దీపికలు విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు అవసరాలను దృష్టి లో పెట్టుకుని పదవ తరగతి విద్యార్థుల కోసం ఈ అభ్యాస దీపిక తయారు చేయడం జరిగింది ఈ అభ్యాస దీపిక పాఠాలలోని ముఖ్యాంశాలను విద్యార్థులు తేలికగా అర్థం చేసుకునేలా స్వీయ అభ్యాసనానికి అనుకూలంగా రూపొందించబడిందని తరగతిలో బోధనభ్యాసన కార్యక్రమాలు వర్క్ షీట్లు మరియు డిజిటల్ తరగతుల ద్వారా పొందిన జ్ఞానాన్ని మరింత బలపరచడానికి ఈ స్వీయపఠన సామాగ్రి ఉపయోగపడుతుందని ప్రతి పాఠంలోని కవి పరిచయం పాఠ్యంలోని ముఖ్యంశాలు పద్యాలు ప్రతిపదార్థాలు స్వీయ రచన సుజనాత్మకత పదజాలము వ్యాకరణాంశాలు పరిచిత అపరిచిత పద్య గద్యాలు మొదలగు అంశాలను అవగాహన చేసుకోవడంతోపాటు వాటిని అభ్యాసన చేసేందుకు ప్రశ్నలు కూడా ఇవ్వబడ్డాయి వీటి ద్వారావిద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు సులభంగా సంసిద్ధులు కావచ్చు ఈ అభ్యాస దీపికలు ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకానికి ప్రత్యామ్నాయంగా కాకుండా సహకారిగా వినియోగిస్తూ విద్యార్థులకు తగిన సూచనలు ఇస్తూ దిశనిర్దేశం చేయాలి ఇందులో గల అభ్యాసాలు విద్యార్థులు స్వయంగా చేసేలా ప్రోత్సహించాలి ఈ అభ్యాస దీపిక వల్ల విద్యార్థులు ఎక్కువ శాతం ఉత్తీర్ణత సాధించడానికి అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం మధు, విజయ,మధుసూదన్, భాను, ప్రకాష్,లక్ష్మణ్,ప్రతాప్, శశిరేఖ, శిరీష,మంగళ,నిర్మల, శ్రీదేవి, రఘురాం రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాలను జోన్‌లుగా ప్రకటించాలి

- జిల్లాల మండలాల పునర్విభజన తో పాటు జోన్ లను పునర్విభజించాలి
- తెలంగాణ సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మశీడ్ల భాస్కర్

**నేటి సాక్షి, గన్నేరువరం,(బుర్ర అంజయ్య గౌడ్):** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే జిల్లాల మండలాల పునర్విభజన తో పాటు జోన్ లను కూడా పునర్విభజించాలని తెలంగాణ సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ అన్నారు. మండలంలోని గుండ్లపల్లిలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ గతంలో ప్రకటించిన జోన్ లు అస్తవ్యస్తంగా ఉన్నాయని అన్నారు. జోన్ ల ప్రకటన శాస్త్రీయంగా లేదని అన్నారు. ప్రస్తుత జోన్ ల పునవ్యవస్థీకరణ చేసి ఉమ్మడి జిల్లాలను జోన్ లుగా ప్రకటించాలని అన్నారు. ఉమ్మడి జిల్లాల జోన్ ల ఏర్పాటుచేసి ఉమ్మడి జిల్లాల జోన్ల పరిధిలో బదిలీలు చేపడితే ఉద్యోగులకు పెనుబండారంగా మారిన 317 అలాగే స్పౌజ్ ఉద్యోగుల సమస్యలు తీరుతాయని అన్నారు. ఉమ్మడి జిల్లాల జోన్లు శాస్త్రీయ బద్దంగా ఉంటాయని ఉద్యోగులకు నిరుద్యోగులకు వెసులుబాటుగా ఉంటాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోన్ల పునర్విభజన చేపట్టాలని అన్నారు.



# ఉపసర్పంచుల ఫోరంపై కాంగ్రెస్ పట్టు

**నేటి సాక్షి, తొగుట. వడ్డే నరసింహులు:** తొగుట మండలంలో ఉపసర్పంచుల ఫోరాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు, దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్), మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి ఆధ్వర్యంలో ఉపసర్పంచుల ఫోరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజాపాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి చేరేలా నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.





### ఉపసర్పంచుల ఫోరం ఏకగ్రీవ ఎన్నిక

**అధ్యక్షులు:** జంకని అమరేందర్ (బండారుపల్లి ఉపసర్పంచ్)
**ఉపాధ్యక్షులు:** తోయేట శ్రీనివాస్ (గోవర్ధనగిరి ఉపసర్పంచ్)
**ప్రధాన కార్యదర్శి:** గౌస్ పాషా (ఎల్లారెడ్డిపేట ఉపసర్పంచ్)
**కోశాధికారి:** యాసరేణి మురళి (లింగంపేట ఉపసర్పంచ్)
**కార్యదర్శి:** నూనె శ్యామల ఆంజనేయులు (జెప్తిలింగారెడ్డిపల్లె)
**గౌరవ అధ్యక్షులు:** బండారి తిరుపతి (తొగుట ఉపసర్పంచ్)

### సలహాదారులు:

ఎం.డి. గౌసొద్దిన్ (లింగాపూర్ ఉపసర్పంచ్)
బోదాస్ నాగరాజు (రాంపూర్ ఉపసర్పంచ్)
బోయినీ కవిత బాలరాజు (తుక్కాపూర్ ఉపసర్పంచ్)

### కార్యక్రమంలో పాల్గొన్న వారు

ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షులు పిట్ల సత్తయ్య, గౌరవ సర్పంచులు రాంపురం రమేష్, గొడుగు జయమ్మ నర్సింలు, చిక్కుడు మస్తి కళావతి స్వామి, పాగల శోభా కొండల్ రెడ్డి, లాచోళ్ళ రవీందర్‌తో పాటు సీనియర్ నాయకులు బాల్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, భూపాల్ రెడ్డి, పబ్బతి మల్లారెడ్డి, సిద్ధి శ్రీనకర్ రెడ్డి, భారత్ తేజ, మధు తదితరులు పాల్గొన్నారు.

# రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలి

**నేటి సాక్షి ...చిలుకూరు:** ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం ఒక అర ఎకరంలో చేపెటాలని వ్యవసాయ సామాజిక కార్యకర్త , కిసాన్ సేవా రత్న పురస్కారం గ్రహీత డాక్టర్ మొలుగూరి గోపయ్య (గోపి ) కోరారు. మంగళవారం చిలుకూరు మండల కేంద్రం తో పాటు పోలేనిగూడెం, బేతోలు, జెర్రి పోతులగూడెం, చెన్నారిగూడెం, ఆచార్యుల గూడెం, జానకినగర్ తండా, దుద్యా తండా, శీతల తండా, నారాయణ పురం గ్రామాలలో తాను స్వచ్ఛందంగా చేపట్టిన ప్రకృతి వ్యవసాయం పై రైతు చైతన్య యాత్ర కార్యక్రమం లో ఆయన రైతులతో మాట్లాడారు. . ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాగులో అనేక మార్పులు వచ్చాయని ధీంతో జబ్బులతో భాద పడుతున్నామానామన్నారు. గత అరవై ఏళ్లుగా చేస్తున్న రసాయన వ్యవసాయం తో నేల పూర్తిగా దెబ్బతిన్నదన్నారు. కాబట్టి నేల ఆరోగ్యమే పంట ఆరోగ్యమని, పంట మన ఆరోగ్యం అన్నారు. అనంతరం



సహజ సిద్ద పద్ధతులతో చీడ పీడల నివారణ, భూసారం పై అవగాహన కల్పించారు. ప్రస్తుత రబీ సీజన్ లో ప్రతి రైతు తమ కుటుంబం ఆరోగ్య అవసరాల కోసం ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# సర్పంచ్ ఉపసర్పంచ్ వార్డు మెంబర్లకు సన్మానం



- ముఖ్య అతిథిగా హాజరైన కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్.
- భారీ బైక్ ర్యాలీ తో స్వాగతం పలికిన బీఆర్ఎస్ శ్రేణులు...

**నేటి సాక్షి ..చిలుకూరు** బీఆర్ఎస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికలలో అభ్యర్థులే లేరని ఎద్దేవా చేసిన పార్టీలకు, ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సాధించిన ఘన విజయాలు గట్టి గుణపాఠం చెప్పాయని అన్నారు. అమలుకు నోచుకోని హామీలతో కోదాడ నియోజకవర్గంలో గెలుపొందిన ఎమ్మెల్యే గారు, స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించాలని ఎంత ప్రచారం చేసినప్పటికీ, ప్రజలు మెజార్టీ స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను, బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించడం ద్వారా నియోజకవర్గంలో పార్టీ బలం ఎంతటిదో మరోసారి నిరూపించారని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేని కాంగ్రెస్ పార్టీ నాయకులు నియోజకవర్గంలో కొన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ గద్దెలను ధ్వంసం చేయడమే కాకుండా కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయంలో కొందరు పోలీసులు కాంగ్రెస్ పార్టీకి వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీపై గానీ, పార్టీ కార్యకర్తల జోలికి వచ్చినా వారు నాయకులైనా, అధికారులైనా, పోలీసులైనా ఎవ్వరినీ వదిలిపెట్టేది లేదని కాలం వారికి గట్టిగా సమాధానం చెప్తుందని హెచ్చరించారు. రాజకీయ ప్రయాణంలో గెలుపోటములు సహజమని, వాటిని సవాలుగా స్వీకరించి ముందుకు సాగాలి తప్ప ఇలాంటి దుష్చర్యలకు పాల్పడితే రాజకీయంగా అంతం తప్పదని స్పష్టం చేశారు. ప్రజల తీర్పును గౌరవించని వారు మరోసారి ప్రజల చేతిలోనే కఠిన శిక్షకు గురవుతారని అన్నారు. కోదాడ నియోజకవర్గంలో పోలీసులు, అధికారులు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. ఇకనైనా తమ వైఖరిని మార్చుకోవాలని సూచించారు. రాజకీయాల్లో ఎప్పుడూ ఒకే పార్టీకి అధికారం శాశ్వతం కాదని, బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాగానే అక్రమాలకు పాల్పడిన వారిపై తప్పకుండా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ పార్టీని ఉపయోగించుకుని పార్టీని, ప్రజలను మోసం చేసి వెళ్లిపోయిన నాయకులకు ఇప్పటికే ప్రజలు గట్టి బుద్ధి చెప్పారని, రానున్న రోజుల్లో మరింత బుద్ధి చెబుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇలాంటి వారిని ఎట్టిపరిస్థితుల్లో మళ్ళీ బీఆర్ఎస్ గడప కూడా తొక్కనిచ్చే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఎవ్వరూ అధైర్యపడవద్దని, వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందని, రాబోయే బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# బీసీ సబ్ ప్లాన్‌ను అమలు చేయాలి

- టీ ఆర్ పీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రం సంజీవ్

**నేటి సాక్షి, ధర్మారం:** వెనుకబడిన తరగతుల బీసీ సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీ ఆర్ పీ) పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రం సంజీవ్ కోరారు. ఈ మేరకు బుధవారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్ కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంజీవ్ మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలు ఇంకా అనేక రంగాల్లో వెనుకబడి ఉన్నారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ల తరహాలోనే బీసీల కోసం ప్రత్యేక సబ్ ప్లాన్ అమలు చేయాలని కోరారు. బీసీల సంక్షేమంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మారం మండల సోషల్ మీడియా కన్వీనర్ ముత్తునూరి అంజి బాబు, భూపల్లి ప్రసాద్, ముత్యాల శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# సోషల్ సైన్స్ ఆధ్వర్యంలో సెమినార్

### "వికసిత్ భారత్ 2047, స్ట్రాటజీస్ అండ్ చాలెంజెస్" అంశంపై నిర్వహణ

### నేడు, రేపు జరగనున్న సెమినార్ విజయవంతం చేయాలి :

### ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్



**నేటిసాక్షి, నల్లగొండ :** పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి) లో సోషల్ సైన్స్ ఆధ్వర్యంలో ఐసియస్ యస్ ర్ - యస్ఆర్‌సి, పిఎమ్ ఉషా వారి ఆర్థిక సహకారంతో రెండు రోజుల జాతీయ సదస్సును "వికసిత్ భారత్ 2047, స్ట్రాటజీస్ అండ్ చాలెంజెస్"లి అనే అంశం పైన నేడు 08-01- 2026 నుండి రేపు 09- 01-2026 వరకు రెండు రోజులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.సముద్రాల ఉపేందర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో సెమినార్ ను రెండు రోజులు పాటు ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈ సెమినార్ కు వివిధ రాష్ట్రాల్లో ఉన్న కేంద్రీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు మరియు రాష్ట్రస్థాయి విశ్వవిద్యాలయాలు అదేవిధంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు రీసెర్చ్ స్కాలర్సు తదితరులు పరిశోధనాత్మక వ్యాసాలు రాసి వాటిని సెమినార్ లో ప్రజెంట్ చేస్తారని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**నేటి సాక్షి తిరుపతి :** 1972- 77 సంవత్సరానికి సంబంధించిన శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆనందోత్సవాల మధ్య జరిగింది. సుమారు 55 సంవత్సరాల తర్వాత తిరుపతిలో వారి ఆత్మీయ కలయికతో ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు. వ్యవసాయ కోర్సును పూర్తిచేసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో పనిచేసే విశ్రాంతి పొందారు. రైతు సోదరులకు ఇప్పటికీ సేవా చేయడానికి తమ సిద్ధంగా ఉన్నామని, రేపు శ్రీవారి దర్శనానంతరం తమ కళాశాల సందర్శించనున్నట్లు వారు తెలిపారు.

# 'ఇందిరమ్మ చీరల' పంపిణీ



**నేటి సాక్షి, ఎండపల్లి:** రాష్ట్రవ్యాప్తంగా దాదాపు కోటి మంది మహిళలకు చీరలను అందించడమే ముఖ్య ఉద్దేశ్యంగా ప్రభుత్వం గత నవంబర్ 19న ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ప్రారంభించిన విషయం తెలిసిందే. కాగా గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా చీరలు అందని మహిళలకు సంక్రాంతి పండుగ లోపు పంపిణీ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా పంపిణీ కొనసాగుతుంది. చర్లపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం సర్పంచ్ పడిదం లావణ్య మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందని, గ్రామంలోని మహిళా సంఘు సభ్యులందరికీ చీరలు అందేలా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అల్గం తిరుపతి, పంచాయతీ కార్యదర్శి తిరుపతి రెడ్డి, కోటిలింగాల ఆలయ కమిటీ డైరెక్టర్ మెరుగు శ్రీనివాస్, వార్డు సభ్యులు సొల్లు రాజేష్, జెల్ల శ్రీనివాస్, సిగిరి లత, కాంగ్రెస్ నాయకులు పడిదం మొగిలి, గ్రామ శాఖ అధ్యక్షులు జక్కుల మహేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు పత్తిపాక శ్రీధర్, మాదాసు గంగాధర్, సీనియర్ నాయకులు పడిదశీ శంకరయ్య, మెరుగు రాజేశం, బుర్రి మహిపాల్, మహిళా సంఘు సీఏ జెల్ల మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# విజయమే లక్ష్యంగా పనిచేయాలి.

### మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్.



**నేటి సాక్షి వికారాబాద్:** వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 12 వ వార్డు కొంపల్లి గ్రామానికి సంబందించిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న వికారాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఈ సందర్భంగా ఆయన.. పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా, సమన్వయంతో ముందుకు సాగుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికలలో విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో పట్టణ బీ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు గోపాల్ ముదిరాజ్, పట్టణ బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షులు సుభాన్ రెడ్డి గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గ్రంథాలయం విద్యార్థులకు వరం

- ఎంఈఓ సైదులు, సర్పంచ్ రజిత
- కల్తీ లేని ఆహారంతోనే ఆరోగ్యం
- పాఠశాలలో అదిరిన ఫుడ్ ఫెస్టివల్



**నేటిసాక్షి, జగదేవపూర్:** పాఠశాలలో గ్రంథాలయం పిల్లలకు వరమని ఎంఈఓ సైదులు, సర్పంచ్ రజిత పరశురామ్ అన్నారు. బుధవారం జగదేవపూర్ మండలం తిగుల్ ప్రాథమిక పాఠశాలలో రూమ్ టూ రీడ్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుకున్న పిల్లలతోనే ప్రపంచ మార్పు మొదలవుతుందని, చదవడం అలవాటు చేసేవే కథల పుస్తకాలు అని అన్నారు. పుస్తకం చేతిలో ఉంటే ప్రపంచమే మన చెంత ఉన్నట్లు అని పుస్తకం మంచి మిత్రుడు అని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపికళ మాట్లాడుతూ రూమ్ టూ రీడ్ వారు మా పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమని, సుమారు ఆరు వందల పుస్తకాలు మరియు కూర్చొని చదువుకోవడానికి కావాల్సిన బల్లలు కార్పెట్స్ ఇచ్చి, గదిని చిత్రాలతో పెయింటింగ్ వేసి గ్రంథాలయం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఒకటో తరగతి పిల్లల తల్లిదండ్రులకు రోజూ వారి దినచర్య కాలండర్స్ ఇచ్చి పిల్లల్ని రోజూ ఇంటివద్ద ఎలా చదివించాలో రూమ్ టు రీడ్ కో ఆర్డినేటర్ భవానీ వివరించారు. అలాగే ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు విద్యార్థులు వివిధ రకాల ఆహార పదార్థాలను వండుకొని పాఠశాలకు తీసుకువచ్చారు. విద్యార్థులు తీసుకవచ్చిన ఆహార పదార్థాలను ఉపాధ్యాయులు ప్రజాప్రతినిధులు కలిసి పరిశీలించి తిని రుచిచూసారు. కల్తీ లేని ఆహారాన్ని తీసుకోవాలని అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని ఎంఈఓ సైదులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, పిఏసీఎస్ మాజీ డైరెక్టర్ భూమయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కనకయ్య, పాఠశాల ఉపాధ్యాయులు సత్తయ్య, భాస్కర్, నాగరాజు, తరుణశ్రీ, నవిత, బాల్ రెడ్డి, అమృతమ్మ, వార్డు సభ్యులు మల్లేశం, నీరజ, అశ్విని, వివిధ పార్టీల నాయకులు కర్ణాకర్, భూమయ్య, ఎల్లారెడ్డి, కర్ణాకర్ రెడ్డి, యాదగిరి, నాగరాజు, దయానంద్ రెడ్డి, ఆంజనేయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతే ప్రాణ రక్షణ





- మోమిన్‌పేట్‌లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

**నేటి సాక్షి, వికారాబాద్:** రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మోమిన్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు నిర్లక్ష్యం, అజాగ్రత్త, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలేనని తెలిపారు. రోడ్డు మీద ప్రయాణించే ప్రతి ఒక్కరూ తమ ప్రాణ భద్రతతో పాటు కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు. రెండు చక్రాల వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ వినియోగం కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. అలాగే ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్, వన్-వే నియమాలు, ఓవర్‌టేకింగ్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. "రోడ్డుపై ప్రయాణించే సమయంలో మీ భద్రత మీ చేతుల్లోనే ఉంటుంది. ట్రాఫిక్ నియమాలు పాటిస్తేనే ప్రాణ రక్షణ సాధ్యం" అని ఎస్పీ పేర్కొన్నారు. విద్యార్థులు, యువత రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించుకొని, కుటుంబ సభ్యులు, మిత్రులకు కూడా ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను తెలియజేయాలని కోరారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, పోలీసుల చర్యలతో పాటు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని తెలిపారు. అనంతరం రోడ్డు భద్రతపై సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జిల్లా ఎస్పీ వాహనదారులతో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ ద్వారా ట్రాఫిక్ నియమాల పాటింపు, రోడ్డు భద్రత ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, మోమిన్‌పేట్ సీఐ వెంకట్, ఎస్.ఐ అరవింద్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, వాహనదారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉచిత పశువైద్య శిబిరం

- 51 పశువులకు చికిత్స
- ఫెర్టిలిటీ క్యాంప్‌తో రైతులకు ఆర్థిక లాభాలు
- గర్భకోశ సమస్యలపై ప్రత్యేక వైద్య సేవలు



**నేటి సాక్షి - కోరుట్ల(రాధారపు నర్సయ్య):** కోరుట్ల మండలం సంగెం గ్రామంలో 'వృద్ధి సంస్థ' ఆధ్వర్యంలో, పశుసంవర్ధక శాఖ సహకారంతో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి పెద్ద సంఖ్యలో రైతులు హాజరై సేవలను సద్వినియోగం చేసుకున్నారు.

ఈ సందర్భంగా ఫెర్టిలిటీ క్యాంప్ నిర్వహించి పశువుల గర్భధారణ సమస్యలపై వైద్యులు ప్రత్యేక చికిత్సలు అందించారు. పశువుల గర్భకోశ సంబంధిత వ్యాధులు, ఆరోగ్య సమస్యలపై రైతులకు అవగాహన కల్పించారు.

## 51 పశువులకు చికిత్స - మందుల పంపిణీ

ఈ ఉచిత పశువైద్య శిబిరంలో మొత్తం 51 పశువులకు గర్భకోశ సంబంధిత చికిత్సలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా 17 దూడలకు నట్టల నివారణ మందులు ఇచ్చారు. పశువుల ఆరోగ్యం, పోషణ విధానాలపై రైతులకు వైద్యులు సూచనలు చేశారు. శిబిరాన్ని పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ మాదేష్, ప్రసన్న సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. రైతులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చీటి స్వరూప, మండల పశువైద్య అధికారి సంతోష్ కుమార్, డీఎల్డీఏ సూపర్వైజర్ నర్సయ్య, మోహన్ రెడ్డి, గోపాల మిత్రులు బైర శ్రీనివాస్, గంగారాం, కిషన్, దశరథం, రైతులు నరేష్, భూమయ్య, రవి, భూమారెడ్డి, నర్సయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఇలాంటి శిబిరాలు గ్రామీణ పశుసంవర్ధక రంగానికి ఎంతో దోహదపడతాయని రైతు సూదవేణి భూమయ్య అభిప్రాయపడ్డారు.

# మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన నర్సింగారావు



**నేటి సాక్షి - మంచిర్యాల జిల్లా:** కన్నాపల్లి మండలంలోని జన్కాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఇప్ప బాపు తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాధవరపు నర్సింగారావు, వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చి, ఈ కష్టసమయంలో తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోరిగాం వెంకన్న, మాజీ జెడ్పీటీసీ అల్లి మోహన్, ఉపసర్పంచ్ ఇంద్రమోహన్, వార్డు సభ్యులు కొండు శాంతమధూకర్, మాజీ సర్పంచ్ రాజేందర్, సింగిల్ విండో డైరెక్టర్ కొరల్ల భూమయ్య, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఏల్పుల రోహిత్, కాంగ్రెస్ నాయకులు బోరిగాం జలపతి, కొత్తకొండ సంతోష్, కొత్తకొండ తిరుపతి, కార్యూరి సురేష్, నల్లుల శ్రీను, కొండు సురేష్, ఎండి కరీం, ఓకారి అశోక్, పోగుల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు.



**నేటి సాక్షి వికారాబాద్:** స్వామి వివేకానంద 163 వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని వికారాబాద్ పట్టణంలోని వివిధ పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, పోటీలు నిర్వహించడం జరిగింది. గొప్ప జాతీయవాది తన జీవితాన్నే భారత జాతికి అంకితం చేసిన, అతి చిన్న వయసులో ప్రపంచ మహాసభలలో భారతదేశ ఖ్యాతిని చాటిచెప్పిన మహనీయులు స్వామి వివేకానంద గారి 163 వ జన్మదిన ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం స్థానిక వికారాబాద్ పట్టణ బాలికల ఉన్నత పాఠశాల, వికారాబాద్ పట్టణ బాలుర ఉన్నత పాఠశాల, అనంతగిరిపల్లి ఉన్నత పాఠశాల లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం చిత్రలేఖనం, పోటీలు నిర్వహించి ప్రతి విద్యార్థికి జాతీయవాదం పెంపొందించే విధంగా ప్రోత్సహించి దేశ ఎదుగుదలలో విద్యార్థుల సేవలను దేశభక్తిని చాటే విధంగా భారత యువతను తయారు చేసే దిశగా ఈ కార్యక్రమాలు స్వామి వివేకానందుని ఉపన్యాసాలు రచనలు ఆయన చేసిన సంస్కరణలు ప్రతి విద్యార్థికి ప్రతి యువకునికి ప్రతి పౌరునికి ఆదర్శంగా ఉండాలని ప్రోత్సహిస్తూ ఈ ఉత్సవాలను జరుపుతున్నామని వికారాబాద్ డెవలప్మెంట్ ఫోరం సభ్యులు తెలియజేశారు., ఈ కార్యక్రమంలో వి డి ఎఫ్ సభ్యులు డాక్టర్ శ్రీకాంత్, పిల్లికండ్ల ఆనంద్, ఎం. ప్రవీణ్ రెడ్డి, కొత్త కాపు నాగేశ్వర్ రెడ్డి, పెద్దింటి శ్రీకాంత్, పత్తేపురం సురేందర్ రెడ్డి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# లేగ దూడపై ఐనా దాడి

**నేటి సాక్షి, గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండలంలోని గును కుల కొండాపూర్ గ్రామానికి చెందిన జాగిరి శ్రీనివాస్ గౌడ్ కు చెందిన లేగ దూడ పై అర్ధరాత్రి ఐనా దాడి చేయడంతో లేగ దూడ మృతి చెందింది. వెటర్నరీ డాక్టర్ సందర్శించి పంచనామ చేశారు. అనంతరం పాడి రైతు జాగిరి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ లేక దూడ మృతి చెందడంతో పాడి రైతు జీవన ఉపాధి కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి సయ సహకారాలు అందించాలని పాడి రైతు కోరారు.

# మిర్యాలగూడను జిల్లా చేయండి

**రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన**

**బీఆర్ఎస్ నాయకులు తిరందాస్ విష్ణు**



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** ఒక జిల్లాకు చేసేందుకు అన్ని అవకాశాలు ఉన్న మిర్యాలగూడ ను నూతన జిల్లా గా మార్చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని మిర్యాలగూడ బీఆర్ఎస్ నాయకులు తిరందాస్ విష్ణు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మిర్యాలగూడ భౌగోళికంగా, పరిపాలనా పరంగా మౌళిక సదుపాయాల పరంగా అన్ని విధాలుగా జిల్లా కేంద్రంగా అభివృద్ధి చెందుటకు అనుకూలంగా ఉన్నదని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని, పరిపాలన మరింత సులభతరం కావాలన్న ఉద్దేశ్యంతో మిర్యాలగూడను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని బుధవారం ఒక ప్రకటనలో కోరారు

# ఎలక్ట్రికల్ సైకిల్ సబ్సీడీ లో లభ్యం

**పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**యంపిడివో పురుషోత్తం**

**లాంఛనంగా ప్రారంభించిన మోహన్ మురళి**



**నేటి సాక్షి తిరుపతి వెదురుకుప్పం:** రాష్ట్ర ప్రభుత్వం చొరవతో సబ్సిడీ లో ఎలక్ట్రికల్ సైకిల్ ను పొందవచ్చని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పురుషోత్తం తెలియచేసారు. మహిళా సంఘాలు మరియు బ్యాంకుల ద్వారా సైకిల్ పొందడానికి లోన్లు ఇవ్వడం జరుగుతుందని ఏపిఎం పరుశురాం రెడ్డి తెలిపారు. మండలానికి వచ్చిన మోడల్ సైకిల్‌ను మండల తేదేపా అధ్యక్షులు మోహన్ మురళి బుధవారం యంపీడీవో కార్యాలయంలో లాంఛనముగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా పంచాయితీ సచివాలయంలో ఈ పథకానికి సంబందించిన వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఈ సైకిల్‌ను 24వేల రూపాయలకు అందుబటులోకి తెచ్చి విద్యార్థులకు రైతులకు ఉపయోగ పడేలా చేయడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ ఎంపీడీవో మాధవి, పంచాయితీ కార్యదర్శులు దివ్యవాణి,వరలక్ష్మి,నాగభూషణం, వెదురుకుప్పం మండల జనసేన పార్టీ మండల అధ్యక్షులు లాలాపేట.పురుషోత్తం, జీడి నెల్లూరు బూత్ కన్వీనర్ యతిఈశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు శేఖర్, జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పుట్ట బెనర్జీ, నాయకులు వెంకటప్ప, టిడిపి నాయకులు నాగరాజు రెడ్డి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు..

# ఓటర్ల జాబితాలో భారీ లోపాలు





- తక్షణ సవరణ కోరిన మిర్జా ముఖ్రమ్ బేగ్
- అన్యాయంగా పేర్ల చేర్పు-తొలగింపుపై ఆందోళన

**నేటి సాక్షి - కోరుట్ల(రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణ మున్సిపాలిటీ పరిధిలో తాజాగా విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని కోరుట్ల డెవలప్మెంట్ ఫోరం ఉపాధ్యక్షులు మిర్జా ముఖ్రమ్ బేగ్ తీవ్రంగా ఆరోపించారు. ఈ లోపాలను తక్షణమే సవరించాలని సంబంధిత అధికారులను ఆయన డిమాండ్ చేశారు.

### స్థానికంగా నివసించని వారి పేర్లు చేర్పు

15వ వార్డు సహాపలు వార్డుల్లో గత 15-20 సంవత్సరాలుగా ఆ వార్డులో నివసించని వ్యక్తుల పేర్లు ముసాయిదా ఓటర్ల జాబితాలో చేర్చడం గమనించామని ఆయన తెలిపారు. ఇది అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.

### ఇతర వార్డుల ఓటర్లు 15వ వార్డులో..

ఇదే తరహాలో ఇతర వార్డులకు చెందిన సుమారు 100 నుంచి 150 మంది ఓటర్ల పేర్లు 15వ వార్డులో నమోదు కావడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని పేర్కొన్నారు. ఇలాంటి పొరపాట్లు ఎన్నికల నిర్వహణపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు.

### అధికారులకు వినతిపత్రాలు

ఈ లోపాలను సరిదిద్దాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ రవీందర్, ఆర్డీవో జివాకర్ రెడ్డి, ఎమ్మార్వో చైతన్య కృష్ణలకు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితాను పునఃపరిశీలించి న్యాయసమ్మతంగా సవరణలు చేపట్టాలని ఆయన కోరారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ, నిజమైన ఓటర్ల పేర్లు మాత్రమే జాబితాలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మిర్జా ముఖ్రమ్ బేగ్ డిమాండ్ చేశారు.

# అమ్మకు అక్షరమాల

- మహిళలకు అక్షరాస్యత
- ULLAS పథకంలో భాగంగా కోరుట్లలో ప్రారంభం
- చదవడం-వ్రాయడం నేర్చుకొని సాధికారత సాధించాలి



**నేటి సాక్షి - కోరుట్ల( రాధారపు నర్సయ్య ):** గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల సభ్యులకు చదవడం, వ్రాయడం నేర్పించడం లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు అమలవుతున్న ఖూూూ పథకంలో భాగంగా 'అమ్మకు అక్షరమాల' కార్యక్రమాన్ని కోరుట్ల మున్సిపాలిటీలో ప్రారంభించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా పరిధిలోని అన్ని మున్సిపాలిటీల్లో ఈ కార్యక్రమం అమలవుతోంది.

### అక్షరాస్యతతో సాధికారత

ఈ కార్యక్రమంలో భాగంగా మెప్మా ఏవో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ..మహిళలు చదవడం, వ్రాయడం నేర్చుకొని అందరికీ ఆదర్శంగా నిలవాలని సూచించారు. అక్షరాస్యత ద్వారా మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధి కోసం కార్యాలయాల్లో స్వయంగా దరఖాస్తులు రాసే స్థాయికి చేరుకునేలా ఈ పథకం తోడ్పడుతుందన్నారు.

### మార్గదర్శక పుస్తకాల వినియోగం

CRPలు మాధవీలత, స్రవంతి అక్షరాస్యత ప్రాధాన్యతను వివరిస్తూ, వాలంటీర్లు మహిళలకు సులభ పద్ధతుల్లో బోధించాలని సూచించారు. ఇందుకోసం మార్గదర్శిని పుస్తకం, అక్షర వికాసం పుస్తకం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఐవీజ సునీత,వీజ శ్రీరామ్ గౌడ్,జాలు గంగారాణి, సంధ్య,మహిళా సమాఖ్య ప్రతినిధులుమెప్మా రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు. మహిళలు విస్తృతంగా పాల్గొని అక్షరాస్యత సాధనకు ముందుకు రావాలని అధికారులు పిలుపునిచ్చారు.

# ఐద్వా మహాసభలను జయప్రదం చేయాలి



- జనవరి 25 నుంచి 28 వరకు హైదరాబాద్‌లో నిర్వహణ
- మహాసభల పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా కార్యదర్శి అనసూయ పిలుపు

**నేటి సాక్షి - వికారాబాద్:** వికారాబాద్ మండల పరిధిలోని జైదుపల్లి గ్రామంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 14వ జాతీయ మహాసభల పోస్టర్, కరపత్రాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి అనసూయ మాట్లాడుతూ, 2026 జనవరి 25 నుంచి 28 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఐద్వా ఆల్ ఇండియా 14వ మహాసభలను మహిళలంతా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

### 26 రాష్ట్రాల నుంచి ప్రతినిధుల రాక

2026 జనవరి 26 నుంచి 28 వరకు ప్రతినిధుల మహాసభలు జరగనున్నాయని, దేశవ్యాప్తంగా 26 రాష్ట్రాల నుంచి సుమారు 1000 మంది మహిళా ఉద్యమ ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరవుతారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఐద్వా జాతీయ మహాసభలు జరగడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు.

### ఎన్‌టీఆర్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ

2026 జనవరి 25న హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ గ్రౌండ్స్‌లో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు మహిళలంతా పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ మహాసభల్లో దేశవ్యాప్తంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని వెల్లడించారు.

### మహిళా హక్కుల కోసం ఐద్వా పోరాటాలు

ఐద్వా జాతీయ సంఘంగా మహిళల హక్కులు, విద్య, బాల్య వివాహాల నిషేధం, ఆస్తి హక్కు చట్టం, వరకట్న వేధింపుల నిరోధానికి ఐపీసీ 498ఏ, మహిళా కమిషన్లు, గృహహింస నిరోధక చట్టం, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం, స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్ అమలు వంటి అంశాలపై దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు నిర్వహించిందని గుర్తు చేశారు.

రాష్ట్రంలో చీప్ లిక్కర్ ప్రవేశానికి వ్యతిరేకంగా ఉద్యమించి దానిని నిలువరించడంతో పాటు, ఇంటిపని మహిళలను సంఘటిత పరిచి స్నేహ ఇంటివారుల సంక్షేమ సంఘం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కనీస వేతన చట్టం, పని హక్కు, ఆహార భద్రత, ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతం వంటి అంశాలపై మహిళలు పెద్దఎత్తున ఉద్యమాలు చేశారని చెప్పారు.

### ఎన్డీఏ ప్రభుత్వంపై విమర్శ

కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలు, మైనార్టీలు, దళితులు, అట్టడుగు వర్గాలకు భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ నిర్భయ ఘటన, కతువా ఘటన, మణిపూర్‌లో కొనసాగుతున్న హింస బీజేపీ పాలనకు నిదర్శనాలని విమర్శించారు.

### ప్రముఖ నాయకుల పాల్గొనింపు

ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా ఐద్వా జాతీయ నాయకురాలు బృందాకరత్, ఆల్ ఇండియా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టీచర్, మరియం దావలె, జాతీయ నాయకురాలు ఎస్. పుణ్యవతి, సుధా సుందర రామన్ తదితర ప్రముఖ మహిళా ఉద్యమ నాయకులు హాజరవుతారని తెలిపారు.

### మహాసభల విజయార్థం రాష్ట్రవ్యాప్త కార్యక్రమాలు

మహాసభల విజయవంతానికి రాష్ట్రవ్యాప్తంగా సెమినార్లు, సదస్సులు, చర్చాగోష్టులు, ఫోటో ఎగ్జిబిషన్లు, కళాజాతాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

"సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిద్దాం - మనువాదాన్ని తిప్పికొడదాం - మహిళల హక్కుల కోసం ముందుకు సాగుదాం" అనే నినాదంతో ఈ మహాసభలు జరగనున్నాయని పేర్కొన్నారు.

### పాల్గొన్నవారు

ఈ పోస్టర్ విడుదల కార్యక్రమంలో ఐద్వా మహిళా సంఘం నాయకులు గుడ్లల లక్ష్మీ, మాల మంజుల అనసూయ, లక్ష్మమ్మ, ఎం. సుక్కమ్మ, పిట్టల పద్మమ్మ, సి. లక్ష్మమ్మ, ఉపాధ్యక్షులు ఆర్. మహ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లకు ఇరువైపులా శుభ్రత పనులు

### సంక్రాంతి పండుగను పురస్కరించుకొని చర్యలు

### సర్పంచ్ మేకల భాగ్యమ్మ



**నేటి సాక్షి - పాములపాడు:** పాములపాడు మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో రోడ్లకు ఇరువైపులా ఉన్న ముళ్లపోదలు, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రత పనులు చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ మేకల భాగ్యమ్మ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆమె తరపున కుమారుడు మేకల రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వచ్చే సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కేజీ రోడ్డు ఇరువైపులా, అలాగే గ్రామంలోని ఇతర ప్రధాన రోడ్ల వెంట ఉన్న ముళ్లపోదలు, చెత్తాచెదారాన్ని జెసిబీ సహాయంతో తొలగించి, ట్రాక్టర్ల ద్వారా వ్యర్థాలను డంపింగ్ యార్డ్‌కు తరలించినట్లు సర్పంచ్ మేకల భాగ్యమ్మ, మేకల రాజశేఖర్ తెలిపారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ హై స్కూల్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు, అలాగే గ్రామంలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన శుభ్రత కార్యక్రమానికి గాను సర్పంచ్ మేకల భాగ్యమ్మను, ఆమె కుమారుడు మేకల రాజశేఖర్‌ను పలువురు అభినందించారు. ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల డాక్టర్ ఎం. మహమ్మద్ బేగ్, ఫార్మసిస్టు మూసా సలాం, హెల్త్ ఎడ్యుకేటర్ జి. మల్లికార్జున, యూడీసీ నారాయణదాసు, ఎంఎన్‌ఓలు సి. హరికృష్ణ, ఎన్. పుల్లయ్య తదితరులు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్‌తో పాటు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## భాజపా గెలుపుకు కృషి చేయాలి

### రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్



**నేటి సాక్షి శంకర్‌పల్లి:** మున్సిపల్ ఎన్నికలలో భాజపా అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం అన్నారు. బుధవారం శంకర్‌పల్లి మున్సిపల్ కేంద్రంలోని డిఎంఆర్ గార్డెన్ లో మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో భాజపా అభ్యర్థులు సత్తాచాటాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో భాజపా అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు అంజన్ కుమార్ గౌడ్, కంజర్ల ప్రకాష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాములు గౌడ్, సీనియర్ నాయకుడు ప్రభాకర్ రెడ్డి, ప్రతాపరెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు వాసుదేవ్ కన్నా, శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షురాలు లీలావతి భయానంద్, నాయకులు కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, సురేష్, వీరేందర్, మధు మోహన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రాజ్ కుమార్, లోకేష్, రాజేష్ గౌడ్, సతీష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## అంగన్వాడీల ఆకస్మిక తనిఖీ



**నేటి సాక్షి - కోరుట్ల( రాధారపు నర్సయ్య )** కోరుట్ల పట్టణంలోని పలు అంగన్వాడీ కేంద్రాలను ఐసిడిఎస్ ప్రాజెక్టు డిడబ్ల్యూఓ నరేష్ బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇటీవల కోరుట్ల పట్టణంలోని ఖాజీపుర-3 సెంటర్ నిర్వాహకురాలు సంగీత నిర్వాకం పై వచ్చిన కథనం దృష్ట్యా జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ సీరియస్ కావడంతో ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారులు మిగితా సెంటర్ల పరిస్థితి ఏంటని ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగానే పట్టణంలోని ఐబి రోడ్ -2 సెంటర్,జవహర్ రోడ్-1 సెంటర్ లను డిడబ్ల్యూఓ నరేష్, మెట్ పల్లి సిడిపిఓ మణి లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఇందులో చిన్నారులకు, గర్భిణీలకు, బాలింతలకు అందించాల్సిన పౌష్టికాహారం, గుడ్లు,పాలు అందిస్తున్నారా. లేదా. అని అడిగి తెలుసుకున్నారు. సరుకులు ఉన్నాయా. లెక్కల్లో తేడాలున్నాయా. రిజిస్టర్‌ల మెయింటెనెన్స్ ఎలా ఉందని ఆయన ఆరాతీశారు. సెంటర్ టీచర్లు,ఆయాలు సమయపాలన పాటిస్తున్నారా. పిల్లలు వస్తున్నారా. గర్భిణీ స్త్రీలకు సీమంతం, ఇతరత్రా కార్యక్రమాల నిర్వహణ ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు.ఇకపై ప్రాజెక్టు నియమ నిబంధనలకు అనుగుణంగా ఎవరూ విధులు నిర్వహించకున్నా జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.ఆయన వెంట సిడిపిఓ మణి, సూపర్ వైజర్ అనిత, సెంటర్ టీచర్లు, ఆయాలు ఉన్నారు.

# బీఆర్ఎస్‌లో భారీ చేరికలు



- పార్టీలో చేరిన కాంగ్రెస్ వార్డు ఇంచార్జి రేబెల్లి లోహిత్
- రాబోయే రోజుల్లో మిర్యాలగూడలో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం..
- మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేద్దాం.....
- బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రాష్ట్ర నాయకులు నల్లమోతు సిద్దార్ధ

**నేటిసాక్షి, మిర్యాలగూడ :** పట్టణంలోని 27వ వార్డు కాంగ్రెస్ ఇంచార్జి రేబెల్లి లోహిత్ కాంగ్రెస్ కు నుండి ఇచ్చి కారు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి రాష్ట్ర నాయకులు నల్లమోతు సిద్దార్ధ ఆహ్వానించారు. బుధవారం రెడ్డికాలనీ లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో "27 వార్డు కాంగ్రెస్ పార్టీ వార్డు ఇంచార్జి రేబెల్లి లోహిత్ కాంగ్రెస్ కు రాజీనామా చేసి, తన అనుచరులు 200 మందితో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పట్టణ ముఖ్య నేతలు ఎడవెల్లి శ్రీనివాస రెడ్డి, అన్నబీమోజు నాగార్జున చారి, ఎండి.ఇలియాస్ ఖాన్, పెద్ది శ్రీనివాస్ గౌడ్ గసమక్షంలో పార్టిలో చేరారు. అనంతరం వారు మాట్లాడుతూ, రోజు రోజుకి కాంగ్రెస్ పార్టీ పూర్తిగా బలహినపడిపోతుందని, రాబోయే భవ్యిషత్తు అంతా బీఆర్ఎస్ దే నని, మిర్యాలగూడలో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం అని స్పష్టం చేశారు. కావున పార్టీ సంస్థాగత నిర్మాణానికి అందరూ కృషి చేయాలనీ, దానికి రానున్న మున్సిపల్ ఎన్నికలు చిహ్నం కావాలని కోరారు.. కాంగ్రెస్ పార్టీ తరపున పోటి చేసే అభ్యర్ధులకు ఇచ్చిన హామీలు ఏమైనాయని నిలదీయాలని సూచిచారు.. ఏ ఒక్క హామీ అయిన పూర్తిస్థాయిలో నెరవేర్చకుండా పూటకో మాట మారుస్తున్నారని ధ్వజమెత్తారు.. అదేవిధముగా మనకు ఇప్పటి వరకు అధికార కాంగ్రెస్ పార్టీ పడిన బాకిని కరపత్రాల రూపంలో ఇంటింటికి పంచి వారు మన బాకీని వెంటనే అమలు చేసేలా డీమాండ్ చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో పద్మశెట్టి కోటేశ్వర రావు, పిన్నబోయిన శ్రీనివాస్ యాదవ్, లింగంపల్లి చీరంజీవి, ఎండి.షోయబ్, పునాటి లక్ష్మీనారాయణ, కోల రామస్వామి, కంచి సత్యనారాయణ, నల్లగంతుల నాగభూషణం, యర్రమళ్ళ దినేష్, దోనేటి సైదులు, శ్రినాద్, వడ్డేపల్లి శ్రీనివాస్, బాచి, కూరపాటి సాంబశివ రావు, సిరసనగండ్ల ఈశ్వర్ చారి, మీసాల జగదీష్ , నాంపల్లి యేసు, నరేష్, పార్టీలో చేరిన వారు స్వాతి, ప్రదీప్, కృష్ణ, సతీష్, నవీన్, గణేష్, కార్ల యల్లయ్య, శ్రీను, నాగయ్య, బంగారి తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ నాయకులు సంబరాలు

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో



**నేటి సాక్షి,గన్నేరువరం, ( బుర్ర అంజయ్య గౌడ్):** మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ టిపిసిసి ఎస్సి సెల్ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులైన సందర్భంగా గన్నేరువరం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో టపాసులు పేల్చి స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు చింతల శ్రీధర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మహిళా మండల అధ్యక్షురాలు రాజేశ్వరి, మండల అధ్యక్షుడు ముసుకు ఉపేందర్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మాతంగి అనిల్ కరీంనగర్ కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ అల్వాల కోటి చొక్కారావు పల్లి సర్పంచ్ గోపాల్ రెడ్డి, కటకం తిరుపతి, వార్డు మెంబర్ సతీష్ మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు సహకరించాలి

స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని విజ్ఞప్తి - సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్




**నేటి సాక్షి - మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణంలో చేపడుతున్నAR167 రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు, వ్యాపారులు పూర్తిస్థాయిలో సహకరించాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ కోరారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. పట్టణంలో సుమారు ఒక కిలోమీటర్ మేర రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గణేష్ మార్కెట్ నుంచి రాజీవ్ చౌక్ వరకు 90 అడుగుల వెడల్పుతో, రాజీవ్ చౌక్ నుంచి సుధా బ్యాంక్ వరకు 84 అడుగుల వెడల్పుతో ఫోర్ లేన్ బీటీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ఈ పనుల్లో భాగంగా సెంట్రల్ లైటింగ్, ఫుట్‌పాత్‌లు, డ్రైనేజ్ సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణకు మొత్తం రూ.54 కోట్లు కేటాయించగా, అందులో రూ.44 కోట్లు ఇప్పటికే 205 మంది లబ్ధిదారులకు నష్ట పరిహారంగా చెల్లించినట్లు తెలిపారు. మిగిలిన 55 మంది లబ్ధిదారులు తమకు సంబంధించిన డాక్యుమెంట్లను సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమర్పించి పరిహారం పొందాలని సూచించారు. ఈ విషయమై సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి రెండవ 3ఈ నోటీసులు జారీ చేసినట్లు, అలాగే ఇచ్చిన 60 రోజుల గడువు కూడా ముగిసిందని తెలిపారు. కావున షాపులు, ఇళ్ల యజమానులు స్వచ్ఛందంగా ఖాళీ చేసి డిస్మాంటిలింగ్ పనులకు సహకరించాలని కోరారు. డిస్మాంటిలింగ్ అనంతరం రోడ్డుకు అవసరమైన స్థలాన్ని వదిలి సెట్బ్యాక్ పాటిస్తూ నిర్మాణాలు చేపట్టాలని, సెట్బ్యాక్ ఉన్నప్పుడే మున్సిపల్ అనుమతులు జారీ చేస్తామని స్పష్టం చేశారు. చీఎ-167 రోడ్డు విస్తరణ పనులకు అందరూ సహకరించాలని, లేనిపక్షంలో చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ హెచ్చరించారు.

## ముందస్తు సంక్రాంతి సంబరాలు



**నేటిసాక్షి, నల్లబెల్లి:** విద్యార్థులు చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చుకోవాలని బుచ్చిరెడ్డి పల్లి గ్రామ సర్పంచ్ భూక్య భద్రమ్మ సూచించారు. వీరాూ బుచ్చిరెడ్డిపల్లి పాఠశాలలో ముందస్తుగా సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ హాజరై విద్యార్థులతో కలిసి పండుగ ఉత్సాహాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌కు పాఠశాల సిబ్బంది మర్యాదపూర్వకంగా సన్మానం చేశారు.సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చుకోవాలని సూచించారు.పిల్లల ప్రదర్శనలు, సంప్రదాయ కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలకు ముందస్తుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం పాఠశాలలో పండుగ వాతావరణాన్ని సృష్టించి అందరిలో ఉత్సాహాన్ని నింపింది.

# మాదకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత






- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**నేటిసాక్షి, రాయికల్ :** డ్రగ్స్, మాదకద్రవ్యాల మహమ్మారిని సమాజం నుండి పూర్తిగా నిర్మూలించి భావితరాలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన భవిష్యత్తును అందించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని జగిత్యాల ఎస్పీ ఆశోక్కుమార్ కోరారు. ఇదే లక్ష్యంతో జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. రాయికల్ మండల కేంద్రంలో గల ఆర్.ఆర్ గార్డెన్స్‌లో బుధవారం జిల్లా పోలీస్‌శాఖ, రాయికల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రగ్స్‌వ్యతిరేక అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. డ్రగ్స్, మాదకద్రవ్యాలకు బానిసలవడం వల్ల యువత భవిష్యత్తు పూర్తిగా నాశనం అవుతుందని హెచ్చరించారు. విద్యార్థులు తమ లక్ష్యాలపై దృష్టి సారించి, మంచి చదువుతో పాటు క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. డ్రగ్స్‌వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలతో పాటు కుటుంబాలు విచ్ఛిన్నం కావడం, నేరాలకు పాల్పడే పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. డ్రగ్స్‌సరఫరా, వినియోగంపై జిల్లా పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, రాబోయే రోజుల్లో మాదకద్రవ్యాల నిర్మూలనలో కీలక పాత్ర పోషించేది నేటి తరం విద్యార్థులేనని పేర్కొన్నారు. విద్యార్థుల దృష్టి పూర్తిగా తమ విద్య, కెరీర్‌పై ఉండాలని, నిషేధిత డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల వైపు ఆకర్షితులు కాకూడదని సూచించారు. అధిక ఒత్తిడిని ఎదుర్కొనేందుకు మత్తు పదార్థాలను ఆశ్రయించకుండా, సానుకూల మార్గాలను ఎంచుకోవాలని తెలిపారు. స్నేహితుల ఒత్తిడితో చెడు మార్గాల వైపు అడుగులు వేయరాదని హెచ్చరించారు. మాదకద్రవ్యాల బారిన పడుతున్న యువతను కాపాడేందుకు జిల్లా పోలీస్ శాఖ కృషి చేస్తోందని, అందులో భాగంగా విద్యాసంస్థలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహించడం జరుగుతోందని అన్నారు. మత్తు పదార్థాల నివారణ కోసం యువత, విద్యార్థులు యాంటీ డ్రగ్స్ కమిటీలలో సభ్యులుగా చేరి "యాంటీ డ్రగ్స్ సోల్జర్" లుగా చేరి సహకరించాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌లేని సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థులే సమాజానికి మార్గదర్శకులని పేర్కొన్నారు. అనంతరం మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులను ప్రశ్నలు అడిగి అవగాహన పెంపొందించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో "మేము డ్రగ్స్ తీసుకోము, మా బంధుమిత్రులు, స్నేహితులు, చుట్టుపక్కల వారు మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా చూసుకునే బాధ్యత మాదే, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాల గురించి వారికి అవగాహన కల్పిస్తాము"అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీ శేషాద్రిని రెడ్డి ఐపీఎస్, డీఎస్పీ రఘు చందర్, జగిత్యా ల రూరల్ ఇన్స్పెక్టర్ సుధాకర్, ఎస్‌ఐలు సుధీర్ రావు, గీత, కృష్ణ, తహసీల్దార్ నాగార్జున, ఎంపిఓ సుష్మ, ఎంఈఓ రాఘవులు, జేఏసీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వాసరి రవి, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, కోశాధికారి మచ్చ శేఖర్, పాత్రికేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, -విద్యార్థులు పాల్గొన్నారు. ఫోటో రైటప్: 07JAGT151: సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఆశోక్కుమార్ 07JA+ు15A: జ్యోతిప్రజ్వలన చేస్తున్న దృశ్యం 07JA+ు151B: హాజరైన విద్యార్థులు

# అయ్యప్ప స్వామి పడిపూజా





- స్వామివారికి పంచామృతాభిషేకాలు
- భజన సంకీర్తనలతో హర్షోల్లాసంగా ఆలయ ప్రాంగణం

**నేటి సాక్షి - మెర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మెర్తాడ్ గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం ఉదయం అయ్యప్ప స్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను పట్టణానికి చెందిన పాలెం విక్రమ్, హరీష్ స్వాములు సంప్రదాయ పద్ధతుల్లో సకల పూజావిధానాలతో నిర్వహించారు.

### ఘనంగా పూజా విధానాలు

అర్చకులు నారంభట్ల భరద్వాజ శర్మ నేతృత్వంలో కంకణ ధారణ, గణపతి పూజ, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పూజలు, అయ్యప్ప స్వామి అభిషేకాలు, అష్టోత్తర శతనామావళి పఠనం నిర్వహించారు. అనంతరం స్వామివారి 18 మెట్లకు ప్రత్యేక పూజలు చేసి, భక్తిశ్రద్ధలతో పంచామృతాభిషేకం చేశారు.

### భజన సంకీర్తనలతో ఆధ్యాత్మిక వాతావరణం

ఈ కార్యక్రమంలో అయ్యప్ప దీక్షాధారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భజన సంకీర్తనలు, హరినామ స్మరణతో ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు. పూజ అనంతరం స్వామివారికి ఇష్టమైన వేటతుల్లి ఆటను నిర్వహించగా భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తుల శరణఘోషలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో నిండిపోయాయి.

### పాల్గొన్న ప్రముఖులు

ఈ కార్యక్రమంలో గురుస్వాములు ఎలిగేటి రమేష్, అంకతి భరత్ కుమార్, చింతల లవకుమార్, అనంతుల రమేష్, జిల్లా సాయి గణేష్, వెలగందుల అఖిల్, మెత్కురి రాంశా గౌడ్, మాజీ జడ్పీటీసీ కంఠం భారతి, మాజీ సర్పంచ్ కంఠం రమేష్, కంఠం శివచరణ్, అరె రమేష్, కట్ట భుమేశ్వర్, తాటికొండ రణధీర్, గంగం రాకేశ్, కట్ట పవన్‌తో పాటు మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవాలి

- మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సమీక్ష
- మ్యాపింగ్, ఓటర్ లిస్ట్, పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై కీలక సూచనలు




**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో(రాధారపు నర్సయ్య):** మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని బుధవారం జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు (లోకల్ బాడీస్), ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో మ్యాపింగ్, ఓటర్ల జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు వంటి కీలక అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.

### ఖచ్చితమైన ఓటర్ల జాబితానే ఎన్నికల విజయానికి పునాది

మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో రెండో సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి వార్డు వారీగా, పోలింగ్ స్టేషన్ వారీగా ఫోటో ఓటర్ల జాబితాల తయారీ అత్యంత కీలకమని కమిషనర్ స్పష్టం చేశారు. నిర్దేశిత మార్గదర్శకాలు, కాలపట్టికలను కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు.

### కొత్త ఓటర్ల చేర్పు - అనర్హుల తొలగింపుపై ప్రత్యేక దృష్టి

అర్హులైన కొత్త ఓటర్ల పేర్ల చేర్పు, డూప్లికేట్ మరియు అనర్హులైన ఓటర్ల పేర్ల తొలగింపుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతత్వం తప్పనిసరి అని కమిషనర్ పేర్కొన్నారు.

### పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ

తాజా ఓటరు డేటాను ఆధారంగా చేసుకుని అవసరమైన చోట్ల పోలింగ్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ చేయాలని కమిషన్ సూచించింది. ఫిర్యాదుల పరిష్కారం, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు, చట్టబద్ధ ఫారమ్‌లు అందుబాటులో ఉంచే విధానంపై అధికారులకు మార్గనిర్దేశం చేసింది.

### ముఖ్యమైన తేదీలు

12-01-2026 : తెలంగాణ పురపాలక చట్టం-2019 (సెక్షన్ 195-ఎ) ప్రకారం వార్డు వారీగా ఫోటో ఓటర్ల జాబితాల ప్రచురణ 13-01-2026 : పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రచురణ, Te□Pollలో అప్‌లోడ్ 16-01-2026 : కలెక్టర్ కార్యాలయాలు, మున్సిపల్ కమిషనర్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో తుది పోలింగ్ కేంద్రాల జాబితా, పోలింగ్ కేంద్రాల వారీగా ఫోటో ఓటర్ల జాబితాల ప్రచురణ

### జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ స్పందన

జగిత్యాల కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజగౌడ్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలకు సంబంధించి వచ్చిన 229 అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నామినేషన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటులో అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.

### ఎన్నికల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

పోలింగ్ సిబ్బంది నియామకం, ఆర్వోల శిక్షణ, డిస్ట్రిబ్యూషన్-రిసెప్షన్ సెంటర్ల ఏర్పాటు, కౌంటింగ్ కేంద్రాల గుర్తింపు, మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లు, ఎన్నికల నిబంధనల అమలు, ఓటర్ల అవగాహన కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లా నోడల్ అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను పూర్తి స్థాయిలో నిర్వహించాలని సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూదన్, జీవాకర్ రెడ్డి, శ్రీనివాస్, జెడ్పీ సీఈవో గౌతమ్ రెడ్డి, డిప్యూటీ సీఈవో పి. నరేష్, డిపివో మదన్ మోహన్, జిల్లా నోడల్ అధికారులు, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ స్టడీ సర్కిల్‌ను పరిశీలించిన కొప్పుల



- కేసీఆర్ పాలనలో సూపర్ సక్సెస్ కాంగ్రెస్ హయాంలో తాళాలు : కొప్పుల

**నేటి సాక్షి - జగిత్యాల(పూరెళ్ల బాపు:)** జగిత్యాల జిల్లా కేంద్రంలో గత రెండు సంవత్సరాలుగా ప్రవేశాలు, శిక్షణ లేక మూతపడ్డ ఎస్సీ స్టడీ సర్కిల్‌ను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు విద్యాసాగర్ రావు, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వెలుగొందిన ఎస్సీ స్టడీ సర్కిళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక క్రమంగా నిర్వీర్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా స్టడీ సర్కిళ్లలో గత రెండు సంవత్సరాలుగా బోధన, ప్రవేశాలు నిలిచిపోయాయని తెలిపారు. జగిత్యాల ఎస్సీ స్టడీ సర్కిల్ పరిస్థితి దారుణంగా ఉందని, 2024 ఆగస్టు 17 నుంచి అడ్మిషన్లు లేక పూర్తిగా మూతపడిందని తెలిపారు. నిధుల మంజూరు లేకపోవడం, భవన అద్దె చెల్లింపులు నిలిచిపోవడంతో స్టడీ సర్కిల్‌కు తాళాలు వేయాల్సి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నెలకు రూ. 1.28 లక్షల అద్దె చెల్లించేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అద్దె చెల్లింపులు నిలిచిపోయి సుమారు 15 నెలల బకాయిలు పేరుకుపోయాయని చెప్పారు. ఇటీవల డిసెంబర్ రెండో వారంలో మూడు నెలల అద్దె మాత్రమే విడుదల చేశారని పేర్కొన్నారు. డైరెక్టర్, అకౌంటెంట్, ఇతర సిబ్బందికి దాదాపు ఏడాది కాలంగా వేతనాలు రావడం లేదని, ట్యూటర్లకు లక్షల రూపాయల బోధన బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 ఎస్సీ స్టడీ సర్కిళ్లలో హైదరాబాద్ మినహా మిగిలినవన్నీ 17 నెలలుగా శిక్షణ లేక మూతపడ్డాయని తెలిపారు.

### కేసీఆర్ హయాంలో ఎస్సీ స్టడీ సర్కిళ్లు - యువతకు ఆశాకిరణం

స్వరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల నిరుద్యోగ యువతకు నాణ్యమైన శిక్షణ అందించాలనే లక్ష్యంతో 33 జిల్లాల్లో 132 స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేశారని కొప్పుల ఈశ్వర్ గుర్తు చేశారు. ఉచిత వసతి, భోజనంతో పాటు పోటీ పరీక్షలకు సమగ్ర శిక్షణ అందించడంతో పాటు ఉద్యోగ, ఉపాధి భరోసా కేంద్రాలుగా స్టడీ సర్కిళ్లను అభివృద్ధి చేశారని తెలిపారు. జగిత్యాలలో కేసీఆర్ సహకారంతో రూ. 1.20 కోట్ల వ్యయంతో ఎస్సీ స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేశామని, తొలి బ్యాచ్‌లో 90 మంది అభ్యర్థులకు ఐదు నెలల పాటు శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఇందులో 42 మంది తొలి ప్రయత్నంలోనే మెరుగైన ఫలితాలు సాధించారని, 10 మంది గ్రూప్-1 మెయిన్స్‌కు, 32 మంది ఎస్సై మెయిన్స్‌కు అర్హత సాధించారని వెల్లడించారు.

### కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శ

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగాల భర్తీ మాట దేవుడెరుగు కనీసం నిరుద్యోగ యువతకు భరోసాగా నిలిచే ఎస్సీ స్టడీ సర్కిళ్లను కూడా మూసివేసిందని విమర్శించారు. భవనాల అద్దెలు కూడా చెల్లించలేని పరిస్థితి రావడంతో యువతలో తీవ్ర అసహనం నెలకొందన్నారు. ఈ సందర్భంగా స్టడీ సర్కిళ్లను తక్షణమే పునఃప్రారంభించి, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని సంబంధిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను డిమాండ్ చేశారు.

# నక్షతో మీ భూములకు రక్ష

- రీసర్వే పారదర్శకంగా నిర్వహించండి.
- కమిషనర్ ఎన్.మౌర్య.

**నేటి సాక్షి తిరుపతి** నక్ష (రీసర్వే) కార్యక్రమం ద్వారా మీ భూములకు రక్షణ ఏర్పడుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. నక్ష (రీసర్వే) కార్యక్రమం పై నగరపాలక సంస్థ కార్యాలయంలోని అన్ని విభాగాల అధికారులు, సచివాలయ కార్యదర్శులతో కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నక్షా అనే కార్యక్రమం ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులను సర్వే చేసేటటువంటి కార్యక్రమం నిర్వహిస్తున్నదని తెలిపారు. అందులో భాగంగా తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో ఉన్నటువంటి ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఆస్తుల యొక్క సర్వే, వాటి యొక్క సరిహద్దులు నిర్ణయించేటటువంటి ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రజలందరూ కూడా సహకరించి, వారి ఆస్తులకు ఉన్నటువంటి సరిహద్దులు, అదేవిధంగా మీ ఆస్తులకు ఉన్నటువంటి సరిహద్దు వివాదాలు ఏమైనా ఉన్నట్లయితే వాటన్నిటినీ శాశ్వతంగా పరిష్కరించేందుకు ఇదొక మంచి అవకాశం. కాబట్టి, ఈ సర్వేకి అందరూ సహకరించాలి అని పిలుపునిచ్చారు. సచివాలయ సిబ్బంది వచ్చినప్పుడు వారికి సంబంధించిన ఆస్తుల డాక్యుమెంట్ల నకళ్లు వారికి ఇచ్చి సహకరించడం ద్వారా ఖచ్చితమైన ఆస్తుల రికార్డుల నమోదు ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. ప్రజల ఆస్తికి సంబంధించినటువంటి హక్కు పత్రం కూడా ఈ నక్షా ద్వారా వారికి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇది కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా నిర్వహిస్తున్నటువంటి కార్యక్రమం కాబట్టి అందరూ సహకరించాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకుని పారదర్శకంగా ఈ కార్యక్రమం పూర్తి చేయాలని



కమిషనర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డిసిపీ ఖాన్, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, ఏసీపీ లు మూర్తి, పార్వతి ప్రియ, సర్వేయర్ కోటేశ్వరరావు, ప్లానింగ్ సెక్రెటరి లు, అడ్మిన్ సెక్రటరీలు, విఆర్ఓ లు పాల్గొన్నారు.

# ఎంకన్న సామికి..ఎన్ని వై'భోగాలు

### ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా 108 రకాల నైవేద్య సమర్పణ

### వైవిధ్యమైన పండ్లతో అభిషేకం



**నేటి సాక్షి - కోరుట్ల( రాధారపు నర్సయ్య ):** కోరుట్ల పట్టణంలోని అతిపురాతన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం 7 గంటలకు స్వామివారికి వైవిధ్యమైన పండ్లు, ఫలాలతో అభిషేకం నిర్వహించారు.

### 108 రకాల నైవేద్య సమర్పణ

అభిషేకం అనంతరం 108 రకాల దైవ నైవేద్య సమర్పణ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు బీర్నంది.నరసింహాచారి వైదిక పద్ధతుల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కటాక్షం కలగాలని కోరి మొక్కులు చెల్లించుకున్నారు.

### ప్రసాద వై'భోగాలు' పంపిణీ

భక్తులు ప్రేమతో తయారుచేసిన 108 రకాల ప్రసాద భోగాలను స్వామి వారికి సమర్పించి అనంతరం భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణం నిండా హర్షోత్సాహ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎతిరాజం.నర్సయ్య,ధర్మకర్తలు శ్రీనివాస్, దివాకర్, గంగాధర్,రాములు, విజయ్ కుమార్, పద్మ, నర్సయ్య, ఆండాళ్ బృందంతో పాటు మహిళలు, భక్తులు పాల్గొన్నారు. ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా ఆలయం భక్తజనాలతో సందడిగా మారింది.

# రోడ్డు భద్రతఉత్సవాలు

### రోడ్డు భద్రత"పై అవగాహనసదస్సు.....

### మరికల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి....



**నేటి సాక్షి,నారాయణపేట, (ఇమామ్ సాబ్ ):** నారాయణపేట జిల్లాలోనినర్వ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన జాతీయ రోడ్డుభద్రత మహాఉత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమం లో మరికల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.రాజేందర్‌రెడ్డి నర్వఎస్సై రమేష్ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టం దీప్తి పాల్గొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా. హెల్మెట్‌ను ధరించాలని, అతివేగం ప్రమాదాల,కు దారితీస్తుందని ప్రతి ఒక్కరూ తప్పకుండ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని అవగాహన కల్పించారు. విద్యార్థులతో. రోడ్డు భద్రత పై ప్రతిజ్ఞ' చేయించారు. రోడ్డు భద్రత సంబంధిత అంశాల,పై క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎవరైనాఅతివేగం డ్రింక్ డ్రైవ్ చేస్తూ పట్టుబడితే చట్ట రీత్యా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# బీసీ కాలనిని సందర్శించిన రమేష్ రెడ్డి



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** పట్టణ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న బీసీ కాలనీ నందు బుధవారం మండల అధ్యక్షులు గువ్వల రమేష్ రెడ్డి (చిట్టి) సందర్శించడం జరిగింది. అక్కడ ఉన్నటువంటి పరిసరాలు మురికినీటితో నిండి,చెత్తా చదారం పేరుకుపోయి వుండటం గమనించిన రమేష్ రెడ్డి పరిసర ప్రాంతం ఈ విధంగా ఉంటే ఇక్కడ నివసించేవారు అంటు రోగాల బారిన పడతారని ముఖ్యంగా చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రహించి వెంటనే అధికారాలను పిలిచి పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని సూచించడం జరిగింది. స్పందించిన అధికారులు వెంటనే పారిశుధ్య పనులు చేపట్టి పూర్తి చేయడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ కాలాని వాసులు మండల అధ్యక్షులు గువ్వల రమేష్ రెడ్డి (చిట్టి) కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమములో మండల నాయకులు ఆవుల రామచంద్ర,చంగల్ రాయుడు, మునీంద్ర,మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలకు స్ట్రాంగ్ రూమ్

**లెక్కింపు కేంద్రాలను పరిశీలించిన :**

**మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్**

**నేటిసాక్షి, మిర్యాలగూడ :** రాబోయే మున్సిపల్-2026 సాధారణ ఎన్నికల నిమిత్తం మండల పరిధిలోని అవంతిపురం మార్కెట్ యార్డ్‌లోని స్ట్రాంగ్ రూమ్ మరియు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. వారి వెంట సబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.



## కరెంటుతో కాదు.. చెట్టుతో కూడా ప్రమాదమే

**చెట్టుకు విద్యుత్ షాక్ భయాందోళనలో గ్రామస్తులు**



**నేటి సాక్షి:** నల్లబెల్లి మండలం బుచ్చిరెడ్డి పల్లె గ్రామంలో ప్రమాదకర పరిస్థితి నెలకొంది. గ్రామానికి చెందిన ప్రేమ్ కుమార్ ఇంటి సమీపంలో ఉన్న చిక్కుడు తీగ చెట్టుకొమ్మలు విద్యుత్ తీగలకు అలుముకోవడంతో చెట్టుకు విద్యుత్ షాక్ వస్తోంది. ఇంటి ఆవరణలో చిన్నారులు, పశువులు తిరుగుతుండటంతో ఎప్పుడైనా ప్రమాదం జరగవచ్చని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరా కొనసాగుతున్న నేపథ్యంలో ప్రాణనష్టం వాటిల్లే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. ఈ ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి విద్యుత్ శాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. చెట్టు కొమ్మలను తొలగించి, విద్యుత్ తీగలను సురక్షితంగా మార్చాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించాలని ప్రజలు ఆశిస్తున్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

**కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ కు వినతి**



**నేటి సాక్షి, ఎండపల్లి:** భవన నిర్మాణ కార్మికుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని కోరుతూ...చెన్నూరు నియోజకవర్గ పర్యటనలో ఉన్న సంబంధిత శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని బుధవారం ఎండపల్లి మండల బీజేపీ మజ్దూర్ సంఘశీ అధ్యక్షులు సిగిరి ఆనంద్ మర్యాద పూర్వకంగా కలిసి విన్నవించారు. ధర్మపురి నియోజకవర్గంలో భవన నిర్మాణ కార్మికుల అనేక సమస్యలు పెండింగ్‌లో ఉండటంతో కార్మికులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. కార్మికుల ప్రయోజనాలు, ప్రమాద, సాధారణ మరణాల భీమా, సంక్షేమ పథకాల అమలు, పింఛన్‌లు, ఉపకార వేతనాలకు సంబంధించి లబ్ధిదారుల ఆర్థిక పరిహార సహాయ పెండింగ్ నిధులు మంజూరు చేసి, వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులు దేశ అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్నారని, నిర్మాణ రంగాన్ని నమ్ముకొని జీవిస్తున్న కార్మికుల సంక్షేమంకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వారి సమస్యలు పరిష్కారం అయ్యేలా తక్షణమే అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# అంగన్‌వాడీ బదిలీలపై కఠిన నియమాలు

- సేవా ధృవీకరణ-నివాస పత్రాలు తప్పనిసరి
- ప్రత్యేక కారణాలకు ఆధార పత్రాలు సమర్పించాలి
- అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సాయిశ్వరీ



**నేటి సాక్షి - కోరుట్ల( రాధారపు నర్సయ్య )** ఆంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఒక కేంద్రం నుంచి మరొక కేంద్రానికి బదిలీ కోరిన సందర్భంలో పత్రాల పరిశీలనలో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత శాఖ స్పష్టం చేసిందని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సాయిశ్వరీ తెలిపారు. బదిలీ ప్రతిపాదనలు ముందుకు పంపే ముందు సంబంధిత శిశు అభివృద్ధి ప్రాజెక్ట్ అధికారులు (జణ్రూాలు) నిర్దిష్ట పత్రాలు తప్పనిసరిగా సమర్పించబడినట్లు ధృవీకరించాల్సి ఉంటుందని ఆదేశాలు జారీ అయ్యాయన్నారు.

**సేవా ధృవీకరణ పత్రం తప్పనిసరి**

ఐదు సంవత్సరాల సేవ పూర్తి చేసి ఉండాలి

బదిలీ కోరుతున్న ఆంగన్‌వాడీ టీచర్ /హెల్పర్ కనీసం ఐదు సంవత్సరాల సేవ పూర్తి చేసినట్లు సంబంధిత జణ్రూా జారీ చేసే 'సేవా ధృవీకరణ పత్రం' తప్పనిసరిగా జత చేయాలని సూచించారు. సేవా కాలం పూర్తి చేయని సిబ్బంది ప్రతిపాదనలు పరిశీలనకు లెక్కలోకి తీసుకోరాదని తెలిపింది.

**నివాస ధృవీకరణ పత్రాలు సమర్పించాలి**

స్థానిక వివాహిత మహిళ అర్హత నిర్ధారణ

బదిలీ కోరుతున్న ప్రాంతానికి సంబంధించిన ఆంగన్‌వాడీ సిబ్బంది మరియు వారి జీవిత భాగస్వామి నివాస ధృవీకరణ పత్రాలు సమర్పించాలి. స్థానిక వివాహిత మహిళ అర్హతను నిర్ధారించేలా పత్రాలు స్పష్టంగా ఉండాలని అధికారుల నుంచి సూచనలు జారీ అయ్యాయన్నారు.

**ప్రత్యేక కారణాలకు ఆధార పత్రాలు అవసరం**

నేటివిటీ, వైద్య, స్పౌజ్ గ్రౌండ్స్‌పై స్పష్టమైన రికార్డులు

ప్రత్యేక కారణాలపై బదిలీ కోరినప్పుడు సంబంధిత ఆధార పత్రాలు తప్పనిసరిగా జత చేయాలని తెలిపింది.

**నేటివిటీ కారణాలు:**

నివాస / నాటివిటీ ధృవీకరణ పత్రం వైద్య కారణాలు: ప్రభుత్వ గుర్తింపు పొందిన వైద్య సంస్థల ధృవీకరణలు భర్త/జీవిత భాగస్వామి కారణాలు:లి సేవా ధృవీకరణ, ఐడీ కార్డు, సేవా వివరాలు ఇతర కారణాలు: చూపిన కారణాలకు అనుగుణమైన పూర్తి ఆధార పత్రాలు పూర్తి ఆధారాలు లేని దరఖాస్తులను పరిశీలనకు స్వీకరించవద్దని స్పష్టం చేశారు.

**రెండు రోజుల్లోపే ప్రతిపాదనలు పంపాలి**

ఆలస్యం చేయొద్దని జణ్రూాలకు సూచనలు

ఆంగన్‌వాడీ కేంద్రం నుంచి మరో కేంద్రానికి బదిలీ కోరిన సిబ్బందిపైన వచ్చిన బదిలీ ప్రతిపాదనలను స్వీకరించిన తేదీ నుంచి రెండురోజులలోపు పై కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. ఏ విధమైన ఆలస్యం జరుగకుండా సమయపాలనకు కట్టుబడి ఉండాలని సంబంధిత శాఖ సూచించిందన్నారు.

**లోపాలు లేకుండా ప్రతిపాదనలు సిద్ధం చేయాలి**

పూర్తిస్థాయి పత్రాలతోనే పంపాలి. బదిలీ ప్రతిపాదనలను ముందుకు పంపే ముందు ప్రతి దరఖాస్తును పూర్తి స్థాయి పత్రాలతో సమగ్రంగా తనిఖీ చేసి పంపించాలని జణ్రూాలకు ఆదేశాలు జారీ అయ్యాయి. అసంపూర్ణ పత్రాలుతో వచ్చే దరఖాస్తులను తిరస్కరించాల్సి ఉంటుందని కూడా స్పష్టం చేశారు. అంగన్‌వాడీ సిబ్బందికి బదిలీల విషయంలో పారదర్శకత, సమాన అవకాశాలు కల్పించడమే ఈ చర్యల లక్ష్యమని సాయీశ్వరీ వెల్లడించారు.

# మున్సిపల్ కార్యాలయం దిగ్బంధం

- 17వ రోజు కొనసాగుతున్న సమ్మె.



నేటి సాక్షి - కొమరం భీమ్ ఆసిఫాబాద్ : కొమురం భీం ఆసిఫాబాద్ కాగజ్నగర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కార్మికులు 17వ రోజు సమ్మె చేరింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు రాజేందర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ. మున్సిపల్ కార్మికుల ఐదు నెలల వేతనంతో పాటు దాదాపు రెండు కోట్ల బకాయి ఉందని. జిల్లా కలెక్టర్. మరియు సబ్ కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ కు ఈ సమస్యలు పరిష్కరించాలని గత మూడు నెలల నుంచి వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ నిర్లక్ష్యం వ్యవహరించడంతో కార్మికుల సమ్మె బాట పట్టాల్సి వచ్చిందని వెల్లడించారు. సమ్మెలో భాగంగా కలెక్టర్. మరియు సబ్ కలెక్టర్ ఎమ్మెల్సీ తో చర్చలు జరిగినప్పటికీ చర్చలు అనుకూలంగా లేవని సమ్మె కొనసాగిస్తున్నామని. మున్సిపల్ కార్యాలయాన్ని నాలుగు రోజులుగా దిగ్బంధనం చేశామని. అవసరమైతే సమ్మె మరింత ఉదితరం చేస్తామని. కాగజ్నగర్ మున్సిపల్ నుండి ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని వరకు పాదయాత్ర చేసి జిల్లా కార్యాలయాన్ని దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు. మున్సిపల్ కార్మికులు,తదితరులు పాల్గొన్నారు

# రైల్వే ప్రయాణాన్ని మరింత సురక్షితంగా




- ఆర్పీఎఫ్ ఐజీ అరోమా సింగ్ ఠాకుర్



**నేటి సాక్షి కొమరం భీమ్ ఆసిఫాబాద్:** ప్రయాణికుల రక్షణే ధ్యేయంగా రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ (ఆర్పిఎఫ్) ముందుకు సాగుతోందని, రైల్వే ప్రయాణాన్ని మరింత సురక్షితంగా, విశ్వసనీయంగా మార్చడమే తమ లక్ష్యమని రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ IG pcscsc అరోమా సింగ్ ఠాకుర్ స్పష్టం చేశారు. బుధవారం కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్స్ పెక్టర్ కర్యాలయం నూతన భవనాన్ని ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో రైల్వే ప్రయాణికుల భద్రత కోసం అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు రైల్వేలో మోసాలు జరగకుండా నివారించేందుకు ఫోర్స్ ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి వాటిని అమలు చేస్తుందన్నారు. అదే విధంగా రైల్వే ఆస్తుల పరిరక్షణ కోసం సైతం రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ నిరంతరంగా కృషి చేస్తుందన్నారు. ఆర్పిఎఫ్ కేవలం రైల్వే ఆస్తుల రక్షణకే పరిమితం కాకుండా, మహిళల భద్రత, పిల్లల రక్షణ, మానవ అక్రమ రవాణా నిరోధం, మాదకద్రవ్యాల నియంత్రణ, ప్రయాణికుల అవగాహన వంటి విభిన్న రంగాల్లో ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆమె వివరించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డివిజనల్ సెక్యూరిటీ కమీషనర్ నవీన్ కుమార్, కాగజ్‌నగర్ ఆర్పీఎఫ్ ఇన్స్ పెక్టర్ రమణ కుమార్,జీఆర్ పి కాజీపేట్ సీఐ నరేష్ కుమార్, ఎస్ఐ ప్రాచీదేవి, ఏఎస్ఐ ఆర్.దాసు, ఏఎస్ ఐ దిలీప్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.